సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 189

శుక్రవారం 29-9-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



మన గురి అదిరె...

ఆసియా క్రీడల షూటింగ్‌లో భారత్‌కు నాలుగో స్వర్ణం లభించింది. - 13లో



బుల్ మరోసారి కుదేల్


19,550 దిగువకు నిఫ్టీ.. ఒక్కరోజులో రూ.2.95 లక్షల కోట్లు నష్టం - 13లో



నిరసనలతో దద్దరిల్లిన ఇంఫాల్

మణిపూర్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనకారులు ఇంఫాల్ వెస్ట్‌లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంపై దాడికి దిగారు.

- వివరాలు 6లో



70% పైగా భూభాగంలో కరువు

భారత్‌లోని 718 జిల్లాలకు 500కుపైగా జిల్లాల్లో.. అంటే 70% పైగా భూభాగంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి.


- వివరాలు 6లో



కమి రిటా షెర్పా సరికొత్త రికార్డు

నేపాలీ పర్వతారోహకుడు కమి రిటా షెర్పా.. 8వేల మీటర్లు పైబడిన ఎత్తయిన శిఖరాలను 42సార్లు అధిరోహించిన ఘనత సాధించారు.

- వివరాలు 6లో



కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూపీకి చెందిన తన్వీర్‌ఖాన్ ఉరేసుకుని తనువు చాలించాడు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

తెలంగాణ పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శం



తెలంగాణలో నూతన పారిశ్రామికవిధానం దేశానికే ఆదర్శమని రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో రూ.1,200 కోట్లతో ఏర్పాటు చేసే కిటెక్స్ గ్రూప్స్ రెండో యూనిట్‌కు, చందనవెల్లిలో రూ.272 కోట్లతో ఏర్పాటయ్యే సింటెక్స్ మూడో యూనిట్‌కు గురువారం ఆయన భూమిపూజ చేశారు.

- వివరాలు 5లో

కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి



బీఆర్‌ఎస్‌ను వీడిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరారు. మైనంపల్లితో పాటు ఆయన కుమారుడు రోహిత్‌రావు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- వివరాలు 5లో

మళ్లీ.. మళ్లీ 'పరీక్షే'



సర్కారు కొలువు సాధించడం ఓ యజ్ఞమే. దీని కోసం అభ్యర్థులు ఏళ్ల తరబడి కష్టపడతారు. అయితే లీకేజీల మకిలీ, పరీక్షల వాయిదా, పరీక్షల రద్దు ఇలా వరుస ఘటనలు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. ప్రిపరేషనే ఓ పరీక్ష అయితే... సహనానికీ పరీక్ష పెట్టినట్టుగా ఉందని నిరుద్యోగులు వాపోతున్నారు.

- వివరాలు 2లో

ఇంత'కీ' ఏం జరిగింది..!



ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి ప్రాథమిక 'కీ' లో వచ్చిన అభ్యంతరాలను శాస్త్రీయంగా చూడకపోవడం.. తుది 'కీ' ఆలస్యంగా వెబ్‌సైట్‌లో ఉంచడంతో పరీక్ష రాసిన అభ్యర్థుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - 2లో





గురువారం హైదరాబాద్ సెక్రటేరియట్ వద్ద భక్తజన సందోహం మధ్య ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్ర, (ఇన్‌సెట్) ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన దృశ్యం



భక్త గణ యాత్ర

కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

ప్రశాంతంగా ముగిసిన వేడుకలు

నగరం ఆధ్యాత్మిక సంద్రమైంది. ఎటుచూసినా భక్తజన సందోహం.. అంతటా గణనాథుని నిమజ్జన వేడుకల కోలాహలం.. దారిపొడవునా వినాయకులకు ఘన స్వాగతాలు.. ట్యాంక్‌బండ్‌లు, చెరువుల వద్ద వీడ్కోళ్లు.. గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. 63 అడుగుల ఖైరతాబాద్ శ్రీ దశ మహావిద్యా గణపతి నిమజ్జనోత్సవం మధ్యాహ్నం 1.27 గంటలకే ముగిసింది.

రూ.1.25 కోట్లు పలికిన గణేశ్ లడ్డు

బండ్లగూడ జాగీర్‌లోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలో అత్యధిక ధరకు వేలం

రూ.27 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డు

పలుచోట్ల లడ్డూలు దక్కించుకున్న ముస్లింలు

వివరాలు 2లో

• హరిత విప్లవ పితామహుడు

ఎం.ఎస్. స్వామినాథన్ కన్నుమూత

అనారోగ్యంతో చెన్నైలోని స్వగృహంలో తుదిశ్వాస

తరమణిలోని ఫౌండేషన్‌లో పార్థివదేహం

రేపు అంత్యక్రియలు నిర్వహిస్తామన్న సన్నిహితులు

సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ



సాక్షి, చెన్నై: భారత హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ (98) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. దేశంలో ఆకలితో అలమటించే అభాగ్యులు ఉండకూడదన్న లక్ష్యంతో జీవితాంతం పోరాటం సాగించిన మహా మనిషి తమిళనాడు రాజధాని చెన్నైలోని తన స్వగృహంలో గురువారం ఉదయం 11.15 గంటలకు శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు డాక్టర్ సౌమ్యా స్వామినాథన్, మధుర స్వామినాథన్, నిత్యా రాయ్ ఉన్నారు. భార్య మీనా స్వామినాథన్ గతంలోనే మిగతా 6వ పేజీలో ▶

ఆకలి లేని సమాజమే ఆయన కల

గోధుమ, వరి వంగడాల అభివృద్ధితో ఎనలేని మేలు

దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసిన స్వామినాథన్

సుస్థిర ఆహార భద్రతలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు

6లో

తెలంగాణ వ్యవసాయ విధానాల్లో స్వామినాథన్ ముద్ర

వ్యవసాయ రంగం పెద్దదిక్కును కోల్పోయింది: సీఎం కేసీఆర్

కో ఫౌండర్.. బ్రాండ్ అంబాసిడర్

3లో



పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సునీతారెడ్డి



మర్రి రాజశేఖర్‌రెడ్డి



నందకిషోర్ వ్యాస్

కారు చివరి సీట్లు ఖరారు

జనగామలో పల్లా, నర్సాపూర్‌లో సునీత, మల్కాజిగిరిలో మర్రి, గోషామహల్‌లో నందకిషోర్..

పెండింగ్‌లో ఉన్న స్థానాలకూ అభ్యర్థుల ఖరారు

పని చేసుకునేందుకు పచ్చజెండా ఊపిన అధినేత కేసీఆర్

త్వరలో బీఆర్‌ఎస్ రెండో జాబితా ప్రకటించే అవకాశం

తొలి జాబితాలో స్వల్ప మార్పులు చోటు చేసుకునే చాన్స్

బీజేపీ, కాంగ్రెస్ వైపు అసమ్మతి నేతలు.. ఆ పార్టీల్లోని నేతలను కారెక్కించాలని చూస్తున్న గులాబీ పార్టీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ముందుగానే ప్రకటించిన భారత్ రాష్ట్ర సమితి పెండింగ్‌లో ఉన్న మిగతా స్థానాల అభ్యర్థుల పేర్లను కూడా ఖరారు చేసింది. మల్కాజిగిరి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన మైనంపల్లి హన్మంతరావు పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో అక్కడ కొత్త అభ్యర్థికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు పెండింగ్ అభ్యర్థులతో త్వరలోనే రెండో జాబితాను ప్రకటించే అవకాశముంది. ఇదిలా ఉంటే విపక్ష పార్టీలు మిగతా 10వ పేజీలో ▶

అధిక శాతం ఓటర్లను ఆకర్షించాలి

బీఆర్‌ఎస్ సర్కార్‌పై వ్యతిరేకతను కూడా సొమ్ము చేసుకోవాలి

వ్యూహాలు, కార్యాచరణపై బీజేపీ స్పెషల్ ఫోకస్



- పార్టీలో, కేడర్‌లో స్తబ్ధత తొలగించేలా ప్రత్యేక ప్రణాళికలు
- మోదీ, నడ్డా పర్యటనలతో ఊపు వస్తుందనే అంచనాల్లో నేతలు.. 6న నడ్డా వివిధ అంశాలపై స్పష్టతనిచ్చే అవకాశం

5 లో

ఒక్కో టికెట్‌కు రూ.10కోట్లు, ఐదెకరాల భూమి

టీపీసీసీ అధ్యక్షుడు అమ్ముకుంటున్నట్టు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మతకలహాలు, కొట్లాటలే..



- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

వివరాలు 5లో



ఇదండీ పాలిటిక్స్



సార్! మీరిప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు!

పేదలను బెదిరించారు.. 'అసైన్డ్' కాజేశారు


పక్కా స్కెచ్‌తో బడుగుల భూములు కొల్లగొట్టిన చంద్రబాబు ముఠా



- వాటికి ప్యాకేజీ లేదని బెదిరించి మరీ హస్తగతం..
- 1954 తరువాత భూపంపిణీ రికార్డులు లేవని కోర్టుకు బురిడీ
- ఆ కుట్రతో 617.70 ఎకరాల అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణ బ్యాచ్ హస్తగతం.. భూసమీకరణ ప్యాకేజీ కింద వాటి విలువ రూ.3,737.30 కోట్లు

10 లో

‘తుది తీర్పునకు లోబడే ఎస్జీటీ నియామకాలు’



సాక్షి, హైదరాబాద్: జీవో 25కు సంబంధించిన రికార్డులను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) నియామకం తుదితీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ)సహా పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ స్టేట్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ టీచర్స్(స్కీమ్ ఆఫ్ సెలక్షన్) రూల్స్, 2023 పేరిట సెప్టెంబర్ 5న ప్రభుత్వం జారీ చేసిన జీవో లోని రూల్ 4(2)(2) ఎన్సీటీఈ 2014 నిబంధనలకు విరుద్ధమంటూ క్రాంతికుమార్‌సహా మరో 24 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జీవోలో ప్రాథమికంగా పేర్కొన్న నియమ నిబంధనలను పిటిషన్ తరపు న్యాయవాది తప్పుబట్టారు. డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(డీఈడీ) అభ్యర్థుల ఇంటర్మీడియట్ అర్హతల ఆవశ్యకతను వ్యతిరేకించారు. క్లాజ్–2 నుంచి ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా ఉన్న బ్యాచిలర్ డిగ్రీ అభ్యర్థులకు ఎలా మినహాయింపు ఇస్తారని ప్రశ్నించారు. ఈ జీవోకు చట్టబద్ధ అధికార పరిధి లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16, 254ను ఇది ఉల్లంఘిస్తోందని, అలాగే సెప్టెంబర్ 21న కోర్టు వెలువరించిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఉందని చెప్పారు. రూల్ 4(2)(2)ను రద్దు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆర్థిక వ్యవస్థకు ఆయిల్‌పామ్ వెన్నెముక

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి

ములుగు(గజ్వేల్): వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు ఆయిల్‌పామ్ సాగు వెన్నెముక కాబోతోందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు కొండా లక్ష్మణ్ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఆయిల్‌పామ్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ విరివిగా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంతో భుగర్భజలాలు గణనీయంగా వృద్ధి చెందాయన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి పూర్తి అనుకూల వాతావరణం ఏర్పడిందని వివరించారు. సదస్సులో రాష్ట్ర ఉద్యాన కమిషనర్ ఎం.హన్మంతరావు, యూనివర్సిటీ వీసీ నీరజాప్రభాకర్, రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తత

పోటాపోటీగా నిరసన ర్యాలీలు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి తదితరులు

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు గురువారం స్థానిక రాజీవ్ చౌరస్తాలో పోటాపోటీగా నిరసన ర్యాలీలు చేపట్టారు. మంత్రి దయాకర్‌రావుపై కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గంలో గత ఎన్నికల హామీలను అమలు చేయలేదని సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి రాజీవ్‌చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి, మంత్రి ఎర్రబెల్లికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ నిరసన కార్యక్రమంలో బీఎస్పీ, బీఎంపీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ప్రజాసంఘాల నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. అదే సమయంలో రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలు మోహరించారు. ఈ క్రమంలోనే చౌరస్తాలో ధర్నా కు దిగారు. పోలీసులు అడ్డుకుని ఝాన్సీరెడ్డితో పాటు కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులను స్టేషన్‌కు తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జనగామ డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో భారీగా పోలీసులను మోహరించి ఇరు పార్టీల కార్యకర్తలను సమన్వయపరిచి అక్కడి నుంచి పంపించారు.



గురువారం నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో భారీగా పోటెత్తిన భక్త జనం



హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం కోసం అమరవీరుల స్మారక చిహ్నం వద్ద బారులు తీరిన వినాయక విగ్రహాలు

కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

ప్రశాంతంగా ముగిసిన వేడుకలు
- ఆధ్యాత్మికతను సంతరించుకున్న భాగ్యనగరం
- సకాలంలో గంగ ఒడికి చేరిన మహాగణపతి
- హెలికాప్టర్ నుంచి పరిశీలించిన మంత్రులు, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: గణపతి నిమజ్జన వేడుకలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. వేల సంఖ్యలో వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు, భక్తులతో రహదారులు కిటకిటలాడాయి. నగరం నలువైపుల నుంచి తరలి వచ్చిన భక్తజన సందోహంతో సాగరతీరం సందడిగా మారింది. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో ‘జై బోలో గణపతి మహారాజ్‌కీ జై ’అంటూ నినాదాలు హోరెత్తాయి. వైవిధ్య భరితమైన వినాయక మూర్తుల నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. భక్తుల నినాదాలు, నృత్యాలతో కూడిన శోభాయాత్రతో మహానగరం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. 63 అడుగుల ఖైరతాబాద్ శ్రీ దశ మహావిద్యా గణపతి నిమజ్జన వేడుకలు మధ్యాహ్నం 1.27 గంటలకే ముగిశాయి. ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్త జనందోహం నడుమ శోభాయాత్ర ప్రశాంతంగా సాగింది. ఉదయం 6.12 గంటలకు ప్రారంభమైన ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మీనార్, సచివాలయం, ఎన్టీయార్ మార్గ్ మీదుగా ఉదయం 11.40 గంటలకు 4వ నంబర్ క్రేన్ వద్దకు చేరుకుంది. మధ్యాహ్నం 12.24 గంటలకు చివరి పూజ నిర్వహించిన గంట తరువాత మహాగణపతిని నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో మంత్రి తలసాని, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అన్ని విభాగాల సహకారంతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతికి ప్రత్యేకత ఉందని పది రోజుల్లో 50 లక్షల మంది దర్శించుకున్నారని చెప్పారు.

ఏరియల్ నిఘా

రాష్ట్ర వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీస్‌శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు వినాయక నిమజ్జన ప్రాంతాలు పరిశీలించారు. హైదరాబాద్ పరిధిలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి డీజీపీ అంజనీకుమార్ ఏరియల్ వ్యూ ద్వారా పర్యవేక్షించారు. హెలికాప్టర్‌లో శోభాయాత్రను, హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ కూడా పాల్గొన్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కూడా శోభయాత్రను పరిశీలించారు. సీసీటీవీ కెమెరాల లైవ్ ఫీడ్‌ను చూస్తూ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

మహాగణపతి నిమజ్జన వేడుకలు ముగిసిన తర్వాత వివిధ ప్రాంతాల నుంచి బొజ్జ గణపయ్యలు సాగర తీరంలో నిమజ్జనానికి తరలివచ్చారు. మధ్యలో స్వాగత వేదికలు గణపతులకు సాదర స్వాగతం పలికాయి. రకరకాల ఆకృతులలో అందంగా రూపుదిద్దుకున్న మూషికవాహనుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. తిరుపతి వెంకటేశ్వర దేవస్థానం అలంకరణలో ఏర్పాటు చేసిన మండపాలు, విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, జీమెయిల్ వంటి సోషల్ మీడియాను ప్రతిబింబించే చిన్న చిన్న విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి నిమజ్జనానికి తీసుకొచ్చారు. అబిడ్స్, ఎల్బీనగర్, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పండ్లతో అలంకరించిన విగ్రహాలు, కాగితంతో అందంగా తీర్చిదిద్దిన పర్యావరణ గణపతులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

రూ.1.25 కోట్లు పలికిన గణేశ్ లడ్డు

బండ్లగూడ జాగీర్‌లోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలో అత్యధిక ధరకు వేలం

బండ్లగూడ(హైదరాబాద్): వేలం పాటలో గణేశ్ లడ్డుకు అత్యధికంగా రూ.1.25 కోట్లు పలికింది. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలోని గణనాథుడి లడ్డుకు గురువారం వేలంపాట నిర్వహించగా, ఆర్వీ దియా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రూ.1.25 కోట్లకు దక్కించుకున్నారు. ఆర్వీ దియా ట్రస్ట్ ఆధ్వర్యంలో 150కిపైగా వ్యక్తిగతదాతలు కలి సి ఈ లడ్డును కొనుగోలు చేశారు. గతేడాది ఇక్కడి లడ్డుకు వేలంపాటలో పలికిన ధర రూ.6.28 లక్షలే.

బాలాపూర్ లడ్డు రూ. 27 లక్షలు

బాలాపూర్ గణనాథుని లడ్డును ఈసారి తుర్కయాంజాల్ పరిధిలోని పాటిగూడ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, రైతు దాసరి దయానంద్‌రెడ్డి కై వసం చేసుకున్నారు. వేలంపాటలో రూ.27 లక్షలకు ఆయన సొంతమైంది.

- రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఏర్పాటు చేసిన రచ్చబండ వినాయక లడ్డును వేలం పాటలో రూ.22.11 లక్షలకు కేటీఆర్ గ్రూప్ సభ్యులు దక్కించుకున్నారు. గతేడాది రూ.20.20 లక్షలు పలికింది.
- బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం లడ్డును మాజీ ఉప సర్పంచ్ పెద్దబావి వెంకట్‌రెడ్డి రూ.17 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మధురపురం రెడ్డిసేవా సమితి వినాయక లడ్డును అదే గ్రామానికి చెందిన శేరి పర్వతరెడ్డి రూ.11,11,116లకు దక్కించుకున్నాడు



బాలాపూర్ గణేశుడి లడ్డును దక్కించుకున్న దాసరి దయానంద్

లడ్డు దక్కించుకున్న ముస్లింలు

- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమార్‌జనతా గణేశ్‌మండలి వద్ద లడ్డుకు వేలం పాట నిర్వహించగా, స్థానిక ముస్లిం యువకుడు షేక్ ఆసిఫ్ రూ.1.02లక్షలకు దక్కించుకున్నాడు.
- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పరిధిలోని సాయి నగర్ కాలనీలో లడ్డు వేలం పాట నిర్వహించగా, మండలంలోని మహాలింగపురం గ్రామానికి చెందిన మహారాజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తాహెర్ అలీ రూ. 23,100కు దక్కించుకున్నాడు.



గణనాథుడి లడ్డూను రూ.1.25 కోట్లకు దక్కించుకున్న ఆర్వీ దియా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

టీచర్లకూ మూడేళ్లలో టెట్ అర్హత!

పదోన్నతులకు తాత్కాలికంగా బ్రేక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై విద్యాశాఖ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత సాధించి ఉండాలన్న నిబంధనపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి కోర్టు గడువు ఇస్తూ, పదోన్నతుల ప్రక్రియపై స్టే విధించింది. ఇప్పటికే మొదలైన పదోన్నతుల ప్రక్రియ కోర్టు ఉత్తర్వుల కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో సమస్యను ఎలా పరిష్కరించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. 2011 ముందు టెట్ అర్హత లేకుండా ఉపాధ్యాయులను ఇతర పరీక్షల ద్వారా నియమించారు. అలాంటప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలనే వాదన సరికాదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం 2011కు ముందున్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చింది. 2017లో టీచర్లుగా చేరిన వారు ఈ అంశంపై కోర్టులో సవాల్ చేశారు. తమిళనాడు కోర్టు కూడా టెట్ తప్పనిసరి అంటూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని రాష్ట్ర హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో టీచర్ల పదోన్నతి అంశానికి టెట్ ముడిపడి ఉంది.

అంతర్గత టెట్ నిర్వహణ

రాష్ట్రంలో దాదాపు 1.03 లక్షల మంది టీచర్లున్నారు. వీరిలో 2017 తర్వాత నియమితులైన వారికే టెట్ అర్హత ఉంది. ఈ లెక్కన టెట్ అర్హత ఉన్నవాళ్లు 10 వేలకు మించి ఉండే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో టీచర్ల సంఘాలతో అధికారులు సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారం దిశగా అడుగులేయాలని నిర్ణయించారు. మూడేళ్లలో ఉపాధ్యాయులంతా టెట్ అర్హత పొందేలా ప్రభుత్వపరంగా ఓ నిర్ణయం తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. టీచర్లకు అంతర్గతంగా పరీక్షలు నిర్వహించి, టెట్ అర్హత పొందేలా చూడాలనే యోచనలో ఉన్నారు. ఇదే అంశాన్ని కోర్టుకూ విన్నవించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. దీనిపై త్వర లో ఉన్నతస్థాయి సమావేశం జరిగే వీలుందని, అందులో నిర్ణయం తీసుకుంటామని ఓ అధికారి తెలిపారు.

హెచ్‌సీఏ ఆస్తుల అటాచ్‌పై నేడు విచారణ



సాక్షి, హైదరాబాద్: ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బ్యాంక్ అకౌంట్లు సహా ఆస్తులన్నింటినీ ట్రయల్ కోర్టు అటాచ్ చేయడాన్ని సవాల్ చేస్తూ జస్టిస్ ఎల్.నాగేశ్వర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. తమ వాదనలు వినకుండానే చేసిన ఆ అటాచ్‌మెంట్లను రద్దు చేయాలని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ముందు న్యాయవాది ఎం.శరత్‌కుమార్ దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. కాగా దీనిపై శుక్రవారం విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ‘హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, ఎంపీ వివేక్(విశాఖ ఇండస్ట్రీస్ అధినేత)కు, హెచ్‌సీఏకు నడుస్తున్న వివాదంలో భాగంగా ట్రయల్ పైవిధంగా ఆదేశాలు జారీ చేసింది.

మళ్లీ.. మళ్లీ ‘పరీక్షే’

అటు సన్నద్ధానికి.. ఇటు సహనానికి..

సాక్షి, హైదరాబాద్: సర్కారు కొలువు సాధించడం ఓ యజ్ఞమే. దీనికోసం ఏళ్ల తరబడి కష్టపడేవారు కొందరు ఉంటున్నారు. అన్నీ వదిలేసి కోచింగ్ తీసుకునేవారు మరికొందరు ఉంటారు. ప్రైవేట్ ఉద్యోగాలకు రాజీనామా చేసేవారు, దీర్ఘకాలిక సెలవు పెట్టేవారూ ఉంటారు. అయితే లీకేజీల మకిలీ, పరీక్షల వాయిదా, పరీక్షల రద్దు ఇలా వరుస ఘటనలు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. ప్రిపరేషనే ఓ పరీక్ష అయితే...సహనానికీ పరీక్ష పెట్టినట్టుగా ఉందని నిరుద్యోగులు వాపోతున్నారు.

30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

తెలంగాణస్టేట్ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ గతేడాది ఏప్రిల్‌లో గ్రూప్–1 ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత వరుసగా ఇప్పటివరకు 30 ఉద్యోగ నియామక ప్రకటనలు ఇచ్చింది. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఎక్కువ సంఖ్యలో ఏకంగా 503 ఉద్యోగాలతో గ్రూప్–1 ప్రకటన వెలువడడంతో నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న వారిలో ఎంతో ఉత్సాహం నింపింది. ఆ తర్వాత గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఇంజనీరింగ్ ఉద్యోగాలతోపాటు జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, పాలిటెక్నిక్ టీచర్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, లైబ్రేరియన్స్, డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్స్, హార్టికల్చర్ ఆఫీసర్స్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్, అగ్రికల్చర్ ఆఫీసర్స్, టౌన్ ప్లానింగ్.. ఇలా దాదాపు 30వేల ఉద్యోగాలకు పైబడి నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించింది.

రెండో ‘సారీ’

ప్రశ్నపత్రాల లీకేజీతో డీఏఓ, గ్రూప్–1, ఏఈఈ పరీక్షలు రద్దు చేయగా, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, హార్టికల్చర్ ఆఫీసర్ తదితర పరీక్షలు చివరి నిమిషంలో వాయిదా వేసింది. ఈ క్రమంలో దాదాపు ఏడున్నర లక్షల మందికిపైగా అభ్యర్థులంతా రెండోసారి పరీక్షలు రాయాల్సి వచ్చింది. ఇందులో అత్యధికంగా గ్రూప్–1కు 3.80 లక్షల మంది, డీఏఓ పరీక్షకు దాదాపు 1.6లక్షల మంది అభ్యర్థులున్నారు. ఒకసారి పరీక్ష రాశాక, రెండోసారి మళ్లీ పరీక్షకు సన్నద్ధం కావడమనేది మానసికంగా తీవ్రఒత్తిడి కలిగించే విషయమే. ఇక గ్రూప్–1 విషయానికి వస్తే పరీక్ష నిర్వహణలోపాల కారణంగా రెండోసారి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని హైకోర్టు రెండుసార్లు ఆదేశించింది. గ్రూప్–1 పరీక్ష రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అత్యంత ఉత్తమమైన సర్వీసు. రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసుగా భావించే దీనికి ప్రిపరేషన్ అంత ఈజీ కాదు. రోజుకు 18గంటల పాటు కష్టపడాల్సి ఉంటుంది. అలాంటి వారికి తాజాగా హైకోర్టు నిర్ణయం షాక్‌కు గురిచేసింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తే హాజరశాతం గణనీయంగా పడిపోయే అవకాశం లేకపోలేదు.



ఆ తర్వాతే హాజరులో స్పష్టత

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యను ప్రకటించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూన్ 11వ తేదీ సాయంత్రం టీఎస్‌పీ ఎస్సీ హాజరైన అభ్యర్థుల ప్రాథమిక సమాచారం పేరిట ప్రకటన విడుదల చేసింది. పరీక్ష కేంద్రాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఈ గణాంకాలు చెబుతున్నా, ఓఎంఆర్ జవాబుపత్రాలు స్వాధీనం చేసుకున్న తర్వాత పక్కా గణాంకాలు ఇస్తామని తెలిపింది. సాధారణంగా పరీక్షల హాజరుశాతం గణాంకాలపై స్పష్టత రావాలంటే వెంటనే సాధ్యం కాదు. అన్ని కేంద్రాల నుంచి పక్కా సమాచారం సేకరించడానికి సమయం పడుతుంది. ఈమేరకు టీఎస్‌పీఎస్సీ ప్రకటనలో పేర్కొన్నా, మరుసటి ప్రకటనలో నెలకొన్న గందరగోళం అభ్యర్థులను కొంత అనుమానాలకు గురిచేసింది. ప్రిలిమినరీ పరీక్ష ప్రాథమిక కీ విడుదల చేసిన తర్వాత టీఎస్‌పీఎస్సీ చేసిన ప్రకటనలో స్పష్టత ఇచ్చినా, అభ్యర్థులకు మాత్రం అనుమానాలు తొలగలేదు. ఇక బయోమెట్రిక్ హాజరుతీరు పట్ల కూడా అనుమానాలు నెలకొనడంతో న్యాయస్థానాన్ని ఆశ్ర యించాల్సిన పరిస్థితి వచ్చింది. గతంలో బయోమెట్రిక్ హాజరులో ఎదుర్కొన్న పలు సమస్యల కారణంగానే, బయోమెట్రిక్ వద్దనుకున్నట్టు టీఎస్‌పీఎస్సీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులకు వారం రోజుల ముందే పంపించిన హాల్‌టికెట్లలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశామని చెబుతున్నాయి. అయి తే రెండోసారి జారీ చేసిన హాల్ టికెట్‌లలో బయోమెట్రిక్ చెకిన్ అంశాన్ని ప్రస్తావించలేదు. దీంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు.

ఇంత‘కీ’ ఏం జరిగింది!

టెట్ ప్రాథమిక కీ, తుది కీ మధ్య తేడాలు
- ఆప్షన్లు మార్చారని అభ్యర్థుల ఆందోళన
- ఓఎంఆర్ షీట్స్ ఆన్‌లైన్‌లో ఉంచాలని డిమాండ్

TS-TET 2023
TELANGANA STATE TEACHER ELIGIBILITY TEST

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి ప్రాథమిక ‘కీ’లో వచ్చిన అభ్యంతరాలను శాస్త్రీయంగా చూడకపోవడం ..తుది ‘కీ’ఆలస్యంగా వెబ్‌సైట్ ఉంచడంతో పరీక్ష రాసిన అభ్యర్థుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక కీ చూసుకొని పాస్ గ్యారంటీ అనుకున్నవారు కూడా ఫెయిల్ అవ్వడం అనేక సందేహాలకు తావిస్తోంది. ప్రాథమిక కీలో ఇచ్చిన ఆన్సర్ ఆప్షన్స్ తుది కీ వచ్చే నాటికి మార్చడం కూడా ఈ పరిస్థితికి కారణమని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రాథమిక కీలో వచ్చిన అభ్యంతరాలు నిజమని భావిస్తే, సాధారణంగా రెండు ఆప్షన్లు ఇస్తారని, అప్పుడు అభ్యర్థులకు అన్యాయం జరగదని టెట్ రాసినవారు అంటున్నారు. ఇదేమీలేకుండా, ఆప్షన్లు మార్చడం వల్ల కొంతమంది ఐదు మార్కుల వరకూ కోల్పోయినట్టు చెబుతున్నారు. ఒకటి, రెండు మార్కులు తక్కువై అర్హత సాధించలేని వారు దాదాపు 50 వేల మంది ఉన్నారని అధికారవర్గాలు అంటున్నాయి.

అధికారుల గోప్యతపై అనుమానాలు

టెట్ ఫలితాల వెల్లడి సందర్భంగా అధికారులు ఏ విషయంపైనా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. తుది కీ కూడా ఆలస్యంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రాథమిక కీలో వచ్చిన అభ్యంతరాలు ఏమిటి? అందులో వేటిని పరిగణనలోనికి తీసుకున్నారు? వేటిలో మార్పులు చేశారు? అనే సమాచారం వెల్లడించనేలేదు. టెట్ రాసిన అభ్యర్థులు ఓఎంఆర్ షీట్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ..టెట్ కన్వీనర్‌ను కలిసినా స్పందించలేదు. ఈ విషయమై పలువురు మంత్రిని కలిసి, టెట్, ఆప్షన్ల మార్పు, సమాచారం వెల్లడించకపోవడంపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పరీక్ష, ఫలితాల వెల్లడిపై సరైన సమన్వయం లేదని అధికారవర్గాల నుంచి కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. టెట్ కన్వీనర్ ఏకపక్ష ధోరణితో వ్యవహరించారని, ఏ సమాచారం చెప్పేందుకు వెళ్లినా ఆమె పట్టించుకోవడం లేదని కొందరు అధికారులు అంటున్నారు. మంత్రి కార్యాలయం నుంచి వచ్చే సూచనలు కూడా పరిశీలించని సందర్భాలున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టెట్ నిర్వహణ తీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దారుణంగా దెబ్బతిన్న పేపర్–2 అభ్యర్థులు

పేపర్–2కు రాష్ట్రవ్యాప్తంగా 2,08,499 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 1,90,047 మంది పరీక్ష రాశారు. కేవలం 29,073 మంది మాత్రమే అర్హత సాధించారు. జనరల్ కేటగిరీలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఫలితాలు దారుణంగా పడిపోయాయి. కేవలం 563 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అంటే 3.65 శాతం ఉత్తీర్ణతగా నమోదైంది. జనరల్ కేటగిరీలో 150 మార్కులకు 90 మార్కులు వస్తేనే అర్హత సాధిస్తారు. ఈ కారణంగా చాలామంది ఫెయిల్ అయినట్టు చెబుతున్నారు.

సామాజికవర్గాల వారీగా టెట్ అర్హత ఇలా..

సామాజికవర్గం	దరఖాస్తులు	పరీక్ష రాసినవారు	అర్హులు	అర్హత శాతం
పేపర్–1				
జనరల్	20,557	15,718	2,254	14.34
ఎస్సీ	55,449	46,340	24,215	52.26
ఎస్టీ	39,300	34,773	13,287	38.21
బీసీ	1,54,251	1,26,751	42,733	33.71
మొత్తం	2,69,557	2,23,582	82,489	36.89
పేపర్–2				
జనరల్	17,774	15,424	563	3.65
ఎస్సీ	42,309	38,879	10,979	28.24
ఎస్టీ	24,267	22,435	4,144	18.47
బీసీ	1,24,149	1,13,309	13,387	11.81
మొత్తం	2,08,499	1,90,047	29,073	15.30

• హరిత విప్లవ పితామహుడికి చిత్రనివాళి



హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ మృతికి నివాళిగా నారాయణఖేడ్‌కు చెందిన ప్రముఖ పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావిఆకుపై స్వామినాథన్ చిత్రాన్ని మలచి చిత్రనివాళులు అర్పించారు. - నారాయణఖేడ్

తెలంగాణ వ్యవసాయ విధానాల్లో స్వామినాథన్ ముద్ర

- ఆయన సిఫార్సుల మేరకు ఎంఎస్‌పీ ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆ మేరకు కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖ
- రైతుబంధు, రైతుబీమాలను కొనియాడిన స్వామినాథన్

సాక్షి, హైదరాబాద్: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ తెలంగాణ వ్యవసాయ విధానాల్లో తనదైన ముద్ర వేశారు. తెలంగాణ ప్రభుత్వం స్వామినాథన్ సిఫార్సులను దృష్టిలో ఉంచుకొని పలు నిర్ణయాలు చేసిందని వ్యవసాయశాఖ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. రైతులకు విరివిగా ప్రోత్సాహకాలు ఇవ్వాలనేది స్వామినాథన్ ఆలోచనల్లో ఒకటి. సీఎం కేసీఆర్ రైతుబంధుకు రూపకల్పన చేయడం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాల్లో అత్యంత కీలకమైంది. రైతుబంధు, రైతుబీమా పథకాలను పలు సందర్భాల్లో స్వామినాథన్ ప్రశంసించారు. అంతేకాదు స్వామినాథన్ కీలక సిఫార్సుల్లో ఒకటైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కేంద్రానికి పలు ప్రతిపాదనలు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ సీజన్లలో రైతులు పండించే పంటలకు ఎంతెంత ఎంఎస్‌పీ ఉండాలో స్వామినాథన్ సిఫార్సులను లెక్కలోకి తీసుకొని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది.

స్వామినాథన్ సిఫార్సులను పక్కన పెట్టిన కేంద్రం

వివిధ పంటల సాగు ఖర్చుల ప్రకారం స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని తాము కోరితే కేంద్రం పెడచెవిన పెట్టిందని కూడా వ్యవసాయశాఖ వర్గాలు చెపుతున్నాయి. ఈ ప్రకారం రైతులు పండించిన పంటకు వచ్చేది నష్టమే తప్ప లాభం లేదని అంటున్నాయి. ఉదాహరణకు సీఏసీపీకి రాష్ట్ర వ్యవసాయశాఖ పంపిన నివేదికల ప్రకారం తెలంగాణలో క్వింటా వరి సాధారణ (కామన్) రకం ధాన్యానికి రూ.3,300, ఏ గ్రేడ్ ధాన్యం పండించాలంటే రూ.3,400, పత్తికి రూ. 11 వేలు, మొక్కజొన్నకు రూ.2 వేలు, సోయా పంటకు రూ.4,500 రైతు గతేడాది ఖర్చు చేశారు. ఈ ఖర్చులకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం 50 శాతం అదనంగా కలపాలని రాష్ట్రం సూచించింది. ఆ ప్రకారం మద్దతు ధరలను ఖరారు చేయాలని కోరింది. ఉదాహరణకు పత్తి క్వింటాకు రూ.11 వేలు ఖర్చు అయితే, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అందులో 50 శాతం కలపాలి. ఆ ప్రకారం మద్దతు ధరగా రూ. 16,500 ప్రకటించాలని రాష్ట్రం కేంద్రానికి ప్రతిపాదించింది. కానీ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఎంఎస్‌పీ ఖరారు చేయలేదు. స్వామినాథన్ సిఫార్సులను పక్కన పెట్టినా వాస్తవ సాగు ఖర్చు ప్రకారమైనా మద్దతు ధర ప్రకటించలేదన్న విమర్శలు ఉన్నాయి.

వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయింది

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి సీఎం కేసీఆర్ సంతాపం

- ప్రతి రైతు హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోతారని నివాళి
- తెలంగాణ ప్రభుత్వ కార్యాచరణను ప్రశంసించారని వెల్లడి
- ఆయన మన్ననలు పొందడం రైతుబిడ్డగా గర్వకారణమన్న కేసీఆర్
- స్వామినాథన్ మృతికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ దిగ్భ్రాంతి
- రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్, బీజేపీ నేతలు, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రముఖుల సంతాపం



సీఎం కేసీఆర్‌తో వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: దేశంలో హరిత విప్లవ పితామహుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజల ప్రధాన ఆహార వనరులైన వరి, గోధుమ పంటలపై స్వామినాథన్ చేసిన అద్భుతమైన ప్రయోగాలతో భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి హరిత విప్లవాన్ని సాధించిందని కేసీఆర్ తెలిపారు. సాంప్రదాయ పద్ధతిలో సాగుతున్న దేశీయ వ్యవసాయాన్ని స్వామినాథన్ వినూత్న పద్ధతుల్లో గుణాత్మక దశకు చేర్చారని కొనియాడారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందంటే అది ఎంఎస్ స్వామినాథన్ కృషితోనే సాధ్యమైందన్నారు. దేశంలో రాష్ట్రాల వారీగా ప్రజలు పండిస్తున్న పంటలపై విస్తృత పరిశోధనలు చేసిన ఆయన ప్రతి భారత రైతు హృదయంలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ వ్యవసాయాభివృద్ధిని ప్రశంసించారు: మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు

స్వామినాథన్ మరణం తీరని లోటుని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల తాము చెన్నై వెళ్లి ఆయన్ను కలిసినప్పుడు తెలంగాణ వ్యవసాయాభివృద్ధిని ప్రశంసించారని గుర్తు చేశారు. ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విచారం వెలిబుచ్చారు. ఆయన మరణం పరిశోధన రంగంతోపాటు యావత్ దేశ వ్యవసాయ రంగానికి తీరని లోటన్నారు.

వ్యవసాయ పరిశోధనలకు మార్గదర్శి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దేశ వ్యవసాయరంగంలో జరిగే పరిశోధలనకు ఓ మార్గదర్శిగా హరిత విప్లవ పితామహుడు డా.ఎంఎస్ స్వామినాథన్ నిలిచారని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి నివాళులర్పించారు. స్వామినాథన్ మృతిపట్ల ఓ ప్రకటనలో తీవ్రవిచారం వ్యక్తం చేశారు. ఎంఎస్ స్వామినాథన్ మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ సంతాపం

ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. దేశ వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి, వ్యవసాయ రంగంలో అభివృద్ధికి ఆయన ఎన్నో సేవలు అందించి తన పరిశోధనలకు దేశ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత్‌ను వ్యవసాయరంగంలో ప్రపంచశక్తిగా డా.స్వామినాథన్ తీర్చిదిద్దారని మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ శ్రద్ధాంజలి ఘటించారు.

దేశానికి తీరనిలోటు: పీసీసీ చీఫ్ రేవంత్

వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమానికి నిరంతరం శ్రమించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి అత్యంత బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. దేశంలో మేలైన వరి వంగడాలను సృష్టించి.. హరిత విప్లవానికి నాంది పలికిన స్వామినాథన్ మరణం దేశంలో వ్యవసాయ రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశ ఆత్మగౌరవాన్ని కాపాడారు: మురళీ శర్మ, ఇక్రిశాట్ విశ్రాంత శాస్త్రవేత్త.

"1960లలో మనం అమెరికా తదితర దేశాల నుంచి తిండి గింజలు దిగుమతి చేసుకునేవాళ్లం. ఇందుకు డబ్బులు చెల్లించినప్పటికీ మేము మీకు తిండి పెడుతున్నామన్నట్టుగా ఆయా దేశాలు మనల్ని చిన్నచూపు చూసేవి. అలాంటి పరిస్థితుల్లో డాక్టర్ స్వామినాథన్ దేశంలో హరిత విప్లవానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉన్నప్పటికీ తిండి గింజల విషయంలో స్వయం సమృద్ధిని సాధించాం. ఒక రకంగా చెప్పాలంటే దేశం తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు స్వామినాథన్ నేతృత్వంలో నడిచిన హరిత విప్లవం ఉపయోగపడింది"అని ఇక్రిశాట్ విశ్రాంత శాస్త్రవేత్త మురళీశర్మ నివాళులర్పించారు.

సాగుపై పూర్తి అవగాహన స్వామినాథన్‌కే సొంతం: జీ.వి.రామాంజనేయులు

"భారతీయ వ్యవసాయ రంగం బహుముఖీనతను అర్థం చేసుకునేందుకు డాక్టర్ స్వామినాథన్ నివేదికలు ఎంతో ఉపయోగపడతాయి. వ్యవసాయ శాస్త్రవేత్తల్లో సాగుకు సంబంధించిన సమగ్ర అవగాహన ఉన్న తొలి, చివరి వ్యక్తి కూడా డాక్టర్ స్వామినాథనే కావచ్చు."అని సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ వ్యవస్థాపకుడు జీవీ రామాంజనేయులు సంతాపం ప్రకటించారు. ఎం.ఎస్.స్వామినాథన్ భౌతికంగా లేకపోవచ్చు కానీ.. ఆయనిచ్చిన స్ఫూర్తి ఎప్పటికీ చెరిగిపోనిదని సీఎస్ఐఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ రఘునాథ్ మషేల్కర్ పేర్కొన్నారు.

వ్యవసాయరంగానికి తీరని లోటు: రైతు నేతలు వెంకట్, మల్లారెడ్డి

ఎంఎస్పీ సాధన, ఆహార భద్రత చట్టం అమలు కోసం పోరాడడమే స్వామినాథన్‌కు అర్పించే నిజమైన నివాళి అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్ పేర్కొన్నారు. స్వామినాధన్ హరిత విప్లవ మార్గదర్శకుడని అఖిల భారత కిసాన్ సభ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి నివాళులర్పించారు.

భూ సంస్కరణల అమలుకు కృషి చేశారు: తమ్మినేని

స్వామినాథన్ మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రగాఢ సంతాపం ప్రకటించారు. భూసంస్కరణల అమలుకు కృషి చేసిన ఆయన మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు.

తెలంగాణను కొనియాడారు

తెలంగాణలో వ్యవసాయరంగాభివృద్ధికి దిశగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణను ఎం ఎస్ స్వామినాథన్ పలుమార్లు కొనియాడిన విషయాలను, తనతో ఉన్న అనుబంధాన్ని సీఎం కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో రాష్ట్ర సచివాలయంలో ఆయనతో తాను సమావేశం కావడం మరిచిపోలేనని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, ఎత్తిపోతలతో సాగునీటి రంగాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణను స్వామినాథన్‌ఎంతగానో ప్రశంసించారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణలో స్వామినాథన్ స్ఫూర్తి ఇమిడి ఉందని సీఎం తెలిపారు. వీలుచూసుకుని తెలంగాణ పర్యటనకు వస్తానని మాట ఇచ్చిన స్వామినాథన్ ఆ ఆకాంక్ష తీరకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం బాధను కలిగిస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఆయన మన్ననలు పొందడం రైతుబిడ్డగా, ముఖ్యమంత్రిగా తనకెంతో గర్వకారణమంటూ స్వామినాథన్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీవితకాలం మొత్తం రైతుల సంక్షేమం కోసం పరితపించిన మహావ్యక్తి వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ ఇక లేరు అని విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశంలో పంటల సమృద్ధి, ఆహార అభివృద్ధి, భద్రత, మహిళా రైతుల స్వయం సమృద్ధి కి విశేషంగా కృషి చేసిన స్వామినాథన్ మరణం పట్ల పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కో ఫౌండర్.. బ్రాండ్ అంబాసిడర్

ఇక్రిశాట్‌తో స్వామినాథన్‌కు అనుబంధం



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఇక్రిశాట్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దేశ హరితవిప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌తో సంగారెడ్డి జిల్లాలో ఉన్న అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ(ఇక్రిశాట్)కు ప్రత్యేక అనుబంధముంది. 1972లో ఈ సంస్థ ఏర్పాటైంది. ఈ పరిశోధన సంస్థ స్థాపనలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. 1972 నుంచి 1980 వరకు ఆయన ఇక్రిశాట్ గవర్నింగ్ బోర్డ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. అందరికీ పౌష్టికాహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉష్ణ మండల ప్రాంత్రాల్లో సాగుకు యోగ్యంగా లేని భూముల్లో సైతం ఆహార పంటలు పండించేలా ఇక్రిశాట్ నూతన వంగడాలను అభివృద్ధి చేస్తోంది. ఈ సంస్థ మెట్ట పంటలపై, వాతావరణ మార్పుల ప్రభావంపై పరిశోధన చేస్తోంది. ప్రధానంగా జొన్న, వేరుశనగ, తృణధాన్యాల పంటలకు సంబంధించిన ఎన్నో వంగడాలను అభివృద్ధి చేసింది. ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పోషకాహార భద్రతను కల్పించడమే లక్ష్యంగా అంతర్జాతీయస్థాయిలో పరిశోధనలు చేస్తున్న ఇక్రిసాట్ 2013లో ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులను బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించుకుంది. బిల్‌గేట్స్, న్యూజిలాండ్ మాజీ ప్రధానమంత్రి జేమ్స్‌బొల్గర్, ఒలింపిక్ మెడలిస్ట్ సైనా నెహ్వాల్, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం తదితర ప్రముఖులతోపాటు స్వామినాథన్ కూడా ఇక్రిశాట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. "వ్యవసాయం విఫలమైతే.. అన్ని రంగాలు విఫలమైనట్లే.."అనే ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్‌తో ఇక్రిశాట్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది.

వ్యవసాయ రంగంపై చెరగని ముద్ర: ఇక్రిశాట్

వ్యవసాయ పరిశోధనల రంగంలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చెరగని ముద్ర వేశారని, వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవ ప్రపంచవ్యాప్తంగా ఎందరో శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చిందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీ య మెట్ట ప్రాంతపంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) తెలిపింది. ఇక్రిశాట్ సహ వ్యవస్థాపకుడుగా, 1972 – 80ల మధ్యకాలంలో సంసథ గవర్నింగ్ బాడీ ఉపాధ్యక్షులుగానూ డా క్టర్ స్వామినాథన్ పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంది.

ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేస్తూ..

విద్యుదాఘాతంతో విద్యుత్ ఆపరేటర్ మృతి





ట్రాన్స్‌ఫార్మర్‌పైనే మృతి చెందిన ఆపరేటర్ సుధాకర్

నడిగూడెం: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై విద్యుత్ ఆపరేటర్ మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామ పరిధిలో గురువారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. తెల్లబల్లి గ్రామానికి చెందిన నెమ్మాది సుధాకర్ (40) మునగాల మండలం రేపాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సుధాకర్ గురువారం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. తెల్లబల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు రత్నవరం రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని అతన్ని తీసుకెళ్లారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ మునగాల మండలం ఆకుపాముల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉందనుకొని అక్కడి నుంచి సుధాకర్ ఎల్‌సీ తీసుకున్నాడు. కానీ ఆ ట్రాన్స్‌ఫార్మర్ నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉంది. ఈ విషయం తెలియకపోవడంతో సుధాకర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రూ.450 నుంచి రూ.1.25 కోట్ల వరకూ..

- కొత్త శిఖరాలు చేరిన లడ్డూ వేలం
- హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణ

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాలు అంటే గుర్తుకు వచ్చేది ఖైరతాబాద్ వినాయకుడు అదే విధంగా బాలాపూర్ లడ్డూ కూడా. అయితే ఒకప్పుడు కేవలం బాలా పూర్‌కు మాత్రమే పరిమితమైన లడ్డూ వేలం పాట ఇంతింతై...అన్నట్టుగా నగరవ్యాప్తమై ప్రతి మండపంలో వినాయక మూర్తితో సమాన ప్రాధాన్యతను సంతరించుకుంది.

వేలం వయసు 30ఏళ్లు...

ఈ లడ్డూ వేలం పాటకు 1994లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి శ్రీకారం చుట్టగా తొలి వేలం పాటలో రూ.450కు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న భక్తులకు మంచి జరిగిందనే ప్రచారంతో...రెండో సంవత్సరమే పదిరెట్లు పెరిగి రూ.4500కి పెరిగి ఏటేటా అంతకంతకూ ఆదరణ పెరుగుతూ 2002 నుంచి లడ్డూ ధర లక్షల్లో పలకడం ప్రారంభమైంది. కాలక్రమంలో లడ్డూ వేలం పాటని ఖైరతాబాద్ సహా అనేకమంది ఉత్సవ నిర్వాహకులు కూడా అనుసరించడంతో ఇది మండపాలన్నింటికీ సంప్రదాయంగా మారింది. అదే క్రమంలో తాజాగా జరిగిన లడ్డూ వేలంలో బండ్లగూడలోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ లో జరిగిన వేలం పాటలో రూ.1.26 కోట్లు పలకడం దేశంలోనే రికార్డుగా చెప్పవచ్చు. గత ఆరేళ్లుగా లడ్డూ వేలం ద్వారా పోగు చేసిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తున్నారు.

పంపిణీ నుంచి పొలాల్లో జల్లడం దాకా...

లడ్డూ వేలంలో పాడుకున్న వారిలో కొందరు సన్నిహితులకు, బంధువులకు పంపిణీ చేస్తుండడం, వంటకాల్లో కలపడం, మరికొందరు ఇళ్లలోని ముఖ్యమైన చోట్ల జల్లడం, కొందరైతే ఏకంగా తమ పొలాల్లో చల్లుతుండడం.. ఇలా తమ తమ భక్త విశ్వాసాలకు అనుగుణంగా చేస్తున్నారు.

లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు

రహమత్‌నగర్ డివిజన్ కమలానగర్ డబుల్‌బెడ్రూం నివాసాల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో నిర్వహించిన వేలంలో సలీం అనే ముస్లిం యువకుడు రూ.31 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.

వేలంలో లడ్డూను దక్కించుకున్న ట్రాన్స్‌జెండర్

శంషాబాద్: పట్టణంలోని ఇంద్రారెడ్డి కాలనీ రాజీవ్ గృహకల్పలో మహాగణపతి వద్ద వినాయకుడి లడ్డూ వేలంలో పాటలో ట్రాన్స్‌జెండర్ ఐశ్వర్య రూ. 30 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ప్రసాదం తయారీ నా అదృష్టం



గత 2009 నుంచి బాలాపూర్ లడ్డూ తయారు చేసి అందిస్తుండడం మా పూర్వజన్మ సుకృతంగానే భావిస్తాను. సినిమా రంగంపై మక్కువతో నగరానికి వచ్చిన నన్ను ఆ దైవమే ఇటు నడిపించింది. లడ్డూ వేలంలో పాడుకున్న భక్తులకు జరిగినట్లుగానే లడ్డూ అందిస్తున్న మా కుటుంబానికి కూడా దైవానుగ్రహం లభించింది. నగరంలో పలు చోట్ల మా హనీఫుడ్స్ బ్రాంచీలు తెరిచేందుకు, ఎందరో ప్రముఖులను నా కస్టమర్లుగా మార్చుకుంటూ మా వ్యాపారాభివృద్ధి జరిగింది.

– దేవు ఉమామహేశ్వరరావు, బాలాపూర్ లడ్డూ తయారీదాత, హనీ ఫుడ్స్



విద్యుత్ వెలుగుల్లో చార్మినార్ వద్ద గణనాథుడి యాత్ర

తగ్గని క్రేజీ

ప్రతిష్టాత్మక బాలాపూర్ గణనాధుని లడ్డును ఈ సారి తుర్కయాంజాల్ మునిసిపాలిటీ పరిధిలోని పాటి గూడ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, రైతు దాసరి దయానంద్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. హోరాహోరీగా జరిగిన వేలం పాటలో రూ.27 లక్షలకు దయానంద్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. అరగంట పాటు నిర్వ హించిన ఈ వేలం పాటలో మొత్తం ఏడుగురు పాల్గొన్నారు. వీరిలో దయానంద్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఇక బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం గణనాధుని లడ్డుని మాజీ ఉప సర్పంచ్ పెద్దబావి వెంకట్‌రెడ్డి రూ.17 లక్షలకు సొంతం చేసుకున్నారు. గత ఏడాది రూ.12 లక్షలకు లడ్డును కైవసం చేసుకున్న అందెల శిరీష సందీప్‌లు ఈ సారి సైతం గట్టి పోటీ ఇచ్చారు. బడంగ్‌పేట గణనాథుని లడ్డును పెద్ద బావి పార్వతమ్మ అండ్ సన్స్ పేరున ఇప్పటి వరకు ఆరు సార్లు దక్కించుకున్నట్లు పెద్దబావి వెంకట్‌రెడ్డి, కుమారుడు మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. కొంపల్లి అపర్ణ ఫామ్ మిడోస్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను రూ.13.10 లక్షలకు జీవన్‌రెడ్డి, నీలిమ దంపతులు సొంతం చేసుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం మధురపురం రెడ్డిసేవా సమితి వినాయక లడ్డూను అదే గ్రామానికి చెందిన శేరి పర్వతరెడ్డి రూ.11లక్షల11వేల16కు దక్కించుకున్నారు. నిజాంపేటలోని స్ప్రింగ్ విల్లా కాలనీ గణేశ్ లడ్డూను రూ.10,01,116లకు వేలంలో దివ్య సుబ్రహ్మణ్యం దక్కించుకున్నారు. ఖానాపూర్ వరసిద్ధి వినాయక లడ్డూను డాకూర్ శివరాజ్ అనే వ్యక్తి రూ. 10.10 లక్షలకు దక్కించుకున్నాడు. ఇదిలా ఉంటే శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డు వేలం పాటలో మహాలింగపురం గ్రామానికి చెందిన మహారాజ్‌పే ట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాహేర్ అలీ పాల్గొన్నారు. ఆయన ఈ లడ్డూను రూ. 23,100కు దక్కించుకున్నారు.

ఐసీసీసీకి హోంమంత్రి, డీజీపీ



సాక్షి, హైదరాబాద్: గణేష్ సామూహిక నిమజ్జన ఊరేగింపులను పర్యవేక్షించేందుకు హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ గురువారం మధ్యాహ్నం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేడెట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (టీఎస్ ఐసీసీసీ) వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన మల్టీ ఏజెన్సీ ఆపరేషనల్ సెంటర్ నుంచి కొత్వాల్ సీవీ ఆనంద్‌తో కలిసి శోభాయాత్రను పర్యవేక్షించారు.

చైన్‌స్నాచింగ్ చేసి.. పారిపోతూ.. చెరువుగుంతలో పడి..

- నీటమునిగి పాత నేరస్తుడి మృతి
- ఒకచోట చోరీకి విఫలమై.. మరోచోట పుస్తెలతాడు లాక్కెళ్లి...



రాజ్‌కుమార్ (ఫైల్)

ముత్తారం(మంథని): ఒకచోట చోరీకి యత్నించి విఫలమయ్యాడు.. వెంటనే మరో ప్రాంతానికి వెళ్లి ఓ మహిళ మెడలో చైన్ తెంపాడు. వెంటనే బాధితురాలు కేకలు వేయగా, పారిపోతూ చెరువుగుంతలో పడి ఓ పాత నేరస్తుడు మృతి చెందాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామపంచాయతీ పరిధి సర్వారంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..రామగిరి మండలం బేగంపేటకు చెందిన బొంతల రాజ్‌కుమార్(35) తన కుటుంబంతో కలిసి గోదావరిఖనిలో ఉంటున్నాడు. గురువారం బైక్‌పై ముత్తారం మండలం మచ్చుపేట నుంచి సర్వారం వైపు వెళుతున్నాడు. ఆ గ్రామానికి చెందిన కాంచర్ల పుష్పలత చేనుకు నడుచుకుంటూ వెళుతుండగా, బైక్‌పై రావాలని రాజ్‌కుమార్ కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆమె గొంతు పట్టుకున్నాడు. బాధితురాలు కేకలు వేయడంతో సమీప చేనులో ఉన్న గొర్రె నవీన్ రావడంతో రాజ్‌కుమార్ అక్కడినుంచి పరారయ్యాడు. ఆ తర్వాత సర్వారంలోని సజ్జనపు మమత కిరాణం వద్దకు చేరుకున్నారు. బైక్‌లో పెట్రోల్ పోయించుకోగా, మిగతా చిల్లర ఇవ్వడానికి మమత ఇంట్లోకి వెళ్లింది. ఆమెను వెంబడించి మెడలోనుంచి 3 తులాల బంగారు పుస్తెలతాడు లాక్కు న్నాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. వారిని చూసి రాజ్‌కుమార్ బైక్ అక్కడే వదిలేసి మైదంబండ వైపు పరుగెత్తాడు. ఆ దారిలో చెరువుగుంత కనిపించక అందులో మునిగి చనిపోయాడు. సమాచారం అందుకున్న గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు తన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి భార్య సింధూజ, కుమారుడు అక్షిత్‌కుమార్(2) ఉన్నారు.

నిందితుడిపై 12 కేసులు

రాజ్‌కుమార్‌పై పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 12 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనాలతోపాటు పలు ఇళ్లలో చోరీలు చేశాడు. ఈక్రమంలో 2022న రామగిరిలో అరెస్టయి కరీంనగర్ జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై విడుదలయ్యాక గోదావరిఖనికి మకాం మార్చాడు.

బైక్‌లో కారంపొడి ప్యాకెట్: చోరీలు చేయాలనే పక్కా ప్లాన్‌తోనే రాజ్‌కుమార్ తన బైక్‌లో కారం పొడి ప్యాకెట్లు ఉంచాడు. మమత మెడలో నుంచి పుస్తెలుతాడు లాక్కొని, పారిపోయేందుకు వీలుగా రోడ్డుపై బైక్ సిద్ధంగా ఉంచుకున్నాడు. అక్కడి నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కానీ, చోరీ సమయంలో స్థానికులు వెంబడించడంతో దారి మార్చుకున్నాడు. చెరువు వైపు పరుగెత్తాడు. అక్కడ చెట్ల ఆకులు, తీగలు, నాచు ఉండడంతో చెరువులోని నీరు కనిపించలేదు. అటువైపు వెళ్లొద్దని స్థానికులు హెచ్చరిస్తున్నా వినకుండా వెళ్లి పూడికతీసిన గుంతలో పడి చనిపోయాడు.

బంధువులకు, పేదలకు, బాటసారులకు,
వారి హక్కు (వారికి) ఇవ్వు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 29 సెప్టెంబర్ 2023

పారాహుషార్!

అజ్ఞానం అనేక విధాల అపాయకరం. ఆరోగ్యం విషయంలో అది మరీ ప్రమాదకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక ఆ సంగతి మన భారతీయులం దరికీ మరోసారి గుర్తుచేసింది. మన దేశ జనాభాలో 18.83 కోట్ల మంది దాకా అధిక రక్తపోటు (హై బీపీ)తో బాధపడుతున్నారనీ, అయితే వారిలో కేవలం 37 శాతం మందికే తమ ఆరోగ్య పరిస్థితి గురించి అవగాహన ఉందనీ వెల్లడించింది. అధిక రక్తపోటు ఉందని తేలినవారిలో నూటికి 30 మందే మందులు వాడుతున్నారనీ, వారిలోనూ 15 మందే దాన్ని నియంత్రణలో ఉంచుకుంటున్నారనీ పేర్కొంది. బీపీ ఉన్నవారిలో కనీసం సగం మంది దాన్ని నియంత్రణలో ఉంచుకోగలిగినా... వచ్చే 2040 నాటికి గుండెపోటు, పక్షవాతం వల్ల సంభవించే 46 లక్షల మరణాలను మన దేశంలో నివారించవచ్చు. డబ్ల్యూహెచ్ఓ చెబుతున్న ఈ మాటలు భారత్‌లో 'హై బీపీ' పట్ల పేరుకున్న అశ్రద్ధను గుర్తుచేస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణలోని ఈ లోటుపాట్లపై ప్రజలు, వారితో పాటు ప్రభుత్వం కూడా తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని చెబుతున్నాయి.

ప్రపంచవ్యాప్త హైపర్‌టెన్షన్ ప్రభావంపై డబ్ల్యూహెచ్ఓ విడుదల చేసిన తొట్టతొలి నివేదిక ఇదే! 2019 నాటి డేటా ఆధారంగా ఈ ప్రపంచ సంస్థ చేసిన నిర్ధారణలు ఆలోచింపజేస్తున్నాయి. ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరు అధిక బీపీతో బాధపడుతున్నారట! వారిలోనూ ప్రతి అయిదుగురిలో నలుగురు దాన్ని అదుపులో ఉంచుకోవట్లేదట! జీవనశైలిలో అనూహ్య మార్పుల వల్ల 1990 నుంచి 2019కి వచ్చేసరికల్లా బీపీ బాధితుల సంఖ్య 65 కోట్ల నుంచి రెట్టింపై, 130 కోట్లకు చేరింది. పైకి లక్షణాలేవీ ప్రత్యేకంగా కనిపించని 'సైలెంట్ కిల్లర్' ఇది. అందుకే, గుండె జబ్బు, కిడ్నీలు దెబ్బ తినడం లాంటి ఇతర సమస్యలు తలెత్తినప్పుడు గానీ ఈ అధిక బీపీని పలువురు గుర్తించడం లేదని వైద్యులు వాపోతున్నారు. బీపీ ఉన్నట్టు తెలిసినా సరిగ్గా మందులు వాడక అశ్రద్ధ చేసి తల మీదకు తెచ్చుకుంటున్నవారు అనేకులు. భారత్‌లో గుండెపోటు, స్ట్రోక్‌లతో మరణిస్తున్న వారిలో నూటికి 52 మంది అనియంత్రిత అధిక బీపీ (140/90కి పైన)కి బలి అవుతున్నవారే! చౌకగా మందులతో అదుపు చేయవచ్చని తెలిసినా, పలు దేశాల్లో ఈ పెను ప్రమాదకారిపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు.

అభివృద్ధి చెందిన దేశాల్లో కొన్ని తమ పౌరులందరికీ పరీక్షలు జరిపి, ఉచితంగా చికిత్స అందిస్తున్నాయి. అయితే, అల్పాదాయ దేశాల్లో అలాంటి పరిస్థితి లేదు. నిజానికి, మనదేశంలో ప్రజల్లో అధిక బీపీ దుష్ఫలితాల్ని నియంత్రించేందుకు 'ఇండియా హైపర్‌టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్' (ఐహెచ్‌సీఐ)ను 2017 నవంబర్‌లోనే కేంద్ర ఆరోగ్య శాఖ చేపట్టింది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలోనే అసాంక్రమిక వ్యాధుల పరీక్షలు జరిపి, చికిత్స, మందులిచ్చి, 2025 నాటి కల్లా దేశంలో 7.5 కోట్ల మందికి బీపీ, షుగర్‌ల నుంచి సంరక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదట 5 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కొద్ది జిల్లాల్లో మొదలైన ఈ ఆరోగ్య యజ్ఞం క్రమంగా 155 జిల్లాలకు విస్తరించింది. అయితే, ఈ ఏడాది జూన్ నాటికి 27 రాష్ట్రాల్లో దాదాపు 58 లక్షల మంది బీపీ రోగులకు మాత్రం చికిత్స అందించగలిగింది. నిరుడు ఇది ఐరాస అవార్డును అందుకున్న ప్రశంసనీయ ప్రయత్నం. కానీ, బీపీ బాధితుల సంఖ్య కోట్లలో ఉన్న దేశంలో చెరువు నీటిని చెంబుతో తోడితే సరిపోదు. డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక సైతం ముందుగా ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతోంది.

సమాజంలోని పేదవర్గాల్లో పలువురు అధిక బీపీ బాధితులు కొంతకాలం పాటు మందులు వాడి, పరిస్థితి కొద్దిగా కుదుటపడగానే మానేస్తున్నారట! కొన్ని అధ్యయనాలు వెల్లడించిన ఈ చేదు నిజం ఆందోళన రేపుతోంది. బీపీకి చికిత్స, మందులు మధ్యలో ఆపడం ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదని భారతీయ ఆరోగ్య సంరక్షణ మార్గదర్శకాలు ఎప్పటి నుంచో చెబుతున్నదే! అయినా మనం పెడచెవిన పెడుతున్నాం. ఈ ధోరణి మారాలి. 30 ఏళ్ళ వయసు నుంచే బీపీ చూపించుకోవాలనీ, 50వ పడిలో పడ్డాక తరచూ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరనీ వైద్యులిస్తున్న సలహాను పాటించడం మంచిది. అలాగే, రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ సిఫార్సున్నా, భారత్‌లో 8 గ్రాముల దాకా తీసుకుంటున్నట్లు భారత వైద్య పరిశోధనా మండలి తాజా నివేదిక సైతం హెచ్చరిస్తోంది. ఉప్పు తగ్గించడం, ధూమపానం, మద్యపానం మానేయడం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం, కంటి నిండా నిద్ర లాంటి జీవనశైలి మార్పులతో, జీవితాంతం బీపీ మందులు మానకుండా వాడడం శ్రేయస్కరం.

గణాంకాలు గమనిస్తే, గత 15 ఏళ్ళలో దేశంలోని చిన్న పట్నాలు, గ్రామీణ ప్రాంతాలకు సైతం బీపీ సమస్య విస్తరించింది. ఆరోగ్య సంరక్షణ వసతుల్లోని లోటు సైతం అక్కడి సమస్యను పెంచుతోంది. మచ్చుకు, గ్రామీణ బిహార్ లాంటి చోట్ల ఆరోగ్య సేవకుల్లో మూడోవంతు మందికి మాత్రమే సరైన బీపీ చికిత్స తెలుసట! అంతర్జాతీయ పరిశోధకుల సర్వే నిరుడు తేల్చిన దిగ్భ్రాంతికరమైన నిజమిది. జిల్లా, గ్రామస్థాయుల్లో ప్రజారోగ్య సేవకుల నైపుణ్యం పెంచి, డాక్టర్ల, నర్సుల కొరతను అధిగమించడం ద్వారా ప్రభుత్వ బీపీ కార్యక్రమాన్ని మెరుగుపరచవచ్చని నిపుణుల సూచన. ఏమైనా, డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక ఇస్తున్న సందేశాన్ని మన విధాన నిర్ణేతలు వెంటనే చెవికెక్కించుకోవాలి. ఎందుకంటే, ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని బట్టి పంథా మార్చి, కొత్త వ్యూహాలను అనుసరించడమే ఏ సమస్యకైనా అసలైన ఔషధం.

శిఖర సమానుడైన శాస్త్రవేత్త

సందర్భం



డా॥ జి.వి. రామాంజనేయులు

భారతదేశ వ్యవసాయ రంగాన్ని తలుచుకోగానే స్ఫురించే మొదటిపేరు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్. వ్యవసాయంలో ఆధునిక విధానాలను ప్రవేశ పెట్టడం ద్వారా ఆహార భద్రతను పెంచి దేశానికి ఆయన హరిత విప్లవ పితామహులయ్యారు. 'ఓడ నుంచి నోటికి' అన్నట్టుగా ఉన్న కరువు పరిస్థితుల నుంచి, దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి వెలగట్టలేనిది. అందుకు అనుగుణంగా ఎన్నో సంస్థల ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారు. రైతుల జీవితాలను మెరుగు పరచడానికి చివరిదాకా పనిచేస్తూనే ఉన్నారు. అదే సమయంలో హరిత విప్లవ అనంతర దుష్ఫలితాలకు కూడా ఆయన బాధ్యత వహించాలన్న విమర్శలూ వచ్చాయి. ఏమైనా ఆయన లేకుండా భారతదేశ వ్యవసాయ రంగ మంచిచెడ్డలు లేవు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎం.ఎస్. స్వామినాథన్ గారు 98 సంవత్సరాల సంపూర్ణ జీవితం గడిపిన తర్వాత ఈ రోజు (సెప్టెంబర్ 28) చనిపోయారు. భారత వ్యవసాయ రంగంలో అనేక కీలకమైన మలుపుల వెనుక అయన నిర్ణయాలు, ఆలోచనలు ఉన్నాయి. హరిత విప్లవం పేరుతో అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనాలు, నీరు, మెషీన్లు వాడటం వంటివి తేవటంతో పాటు, వీటికి సహకారం అందించటానికి జాతీయ స్థాయిలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విస్తరణ వ్యవస్థ, రుణాలు అందించటానికి బ్యాంకుల జాతీయీకరణ, మద్దతు ధరలు, సేకరణ కోసం భారతీయ ఆహార సంస్థ, ఆహార భద్రత కోసం జాతీయ పంపిణీ వ్యవస్థ లాంటివి ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ వరకు అనేక కీలకమైన పదవులు కూడా అయన నిర్వహించారు.

రైతుల హక్కుల కోసం...

తర్వాతి కాలంలో జాతీయ రైతు కమిషన్ చైర్ పర్సన్‌గా – భారత వ్యవసాయ రంగం అభివృద్ధిని ఎంత దిగుబడులు పెంచాము అని కాకుండా, రైతుల ఆదాయం ఎంత పెంచాము అని ఆలోచించాలి అనీ, రైతులకు వచ్చే ధరలు ఉత్పత్తి ఖర్చులపై కనీసం యాభై శాతం ఉండాలి అనీ పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో వ్యవసాయ రంగంలో మహిళల ప్రాధాన్యం గుర్తించి, దానికి అనుగుణంగా విధానాలు ఉండాలి అని మహిళా రైతుల హక్కుల చట్టం ముసాయిదా తయారు చేసి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు.

గ్రామాల్లోని ప్రజలు సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు వచ్చినప్పుడే వ్యవసాయంలో మార్పులు వస్తాయన్న ఆలోచనతో గ్రామాల్లో క్లైమేట్ స్కూల్స్ లాంటివి స్థాపించడం జరిగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం వ్యవసాయ రంగం మీద ఎలా ఉంటుంది, ఆ మార్పులను ఎదుర్కోవడానికి రైతులు ఏం చేయాల్సి ఉంటుంది, ప్రభుత్వ విధానాలు ఎలా మారాల్సి ఉంటుంది అనే అంశాలపై పరిశోధన చేయడమే గాకుండా ఆ దిశగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేగలిగారు.

అయితే, వ్యవసాయ రంగంలో ఉన్న విభిన్న పరిస్థితులు, విభిన్న అవసరాలు, విభిన్న దృక్కోణాల మధ్యలో నిర్ణయాలు తీసుకునే విషయంలో ఎదురయ్యే అనేక వివాదాలు కూడా అయన చుట్టూ ఉన్నాయి. హరిత విప్లవం ద్వారా వచ్చిన దుష్ఫలితాలకు ఆయనే బాధ్యులు అనీ, జాతీయ జీవ వైవిధ్యం కోల్పోవటం, విదేశాలకు తరలి పోవటంలో అయన పాత్ర ఉందనీ, అనేక ఆరోపణలు ఉన్నాయి. కానీ అయన జీవన ప్రయాణాన్ని దగ్గరగా చూసిన వాళ్ళు కాని, ఆయనతో ఒక్కసారి మాట్లాడిన వాళ్ళు కాని చెప్పే అనుభవాలు పూర్తిగా వేరుగా ఉంటాయి. తను కలిసిన ప్రతి వ్యక్తినీ పేరుతో గుర్తు పెట్టుకొని పలకరించే అలవాటు ఆయనకు ఉండేది. జాతీయ పరిశోధనా సంస్థలో ఆయన పని చేసినప్పుడు పొలంలో పనిచేసిన కూలీలను... ఆ తర్వాత ఆయన జాతీయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ అయినప్పుడు కూడా పేరుతో పలకరించేవాడని చెప్పేవారు.

నేను భారతీయ పరిశోధనా సంస్థలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో ఒక విద్యార్థి తన పరిశోధనా పత్రం కోసం ఆయనని ఇంటర్వ్యూ చేస్తూ – 'నాయకత్వ లక్షణాలు ఎలా వుండాలి?' అని అడిగితే, 'ఎట్టి పరిస్థితులలో నైనా కోపం తెచ్చుకోకుండా ఉండటమే నాయకత్వ లక్షణం' అని చెప్పారు. 2005లో జాతీయ నాలెడ్జ్ కమిషన్ ఉప కమిటీలో సభ్యునిగా ఆయనని కలవటం, చర్చించటం... ఆ తర్వాతి కాలంలో మేము సుస్థిర వ్యవసాయంపై చేసిన ప్రయోగాలు, ఫలితాలు, రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి అనే విషయం మీద చేసిన సూచనల విషయంలోనూ అయన స్పందించి, తన ఆలోచనలు పంచుకోవటమే కాకుండా, వాటి గురించి రాసి సహకరించారు.



నివాళి

డా॥ ఎం. ఎస్. స్వామినాథన్
(7 ఆగస్ట్ 1925 - 28 సెప్టెంబర్ 2023)

విధానాలను మార్చేలా...

జీవవైవిధ్యాన్ని కాపాడటం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేసిన ప్రయత్నాల వెనుక స్వామినాథన్ ప్రయత్నాలు ఉన్నాయి. జీవవైవిధ్య చట్టం, బయోడైవర్సిటీ ఇంటర్నేషనల్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ స్థాపనలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. మన హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ సంస్థ ఏర్పాటు కూడా ఆయన ప్రయత్నాలతో జరిగినదే.

భారత దేశంలో ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయాల మేరకు మేధా సంపత్తి హక్కుల గురించి చర్చలు జరిగి చట్టం చేసినప్పుడు, అందులో రైతులకు హక్కులు ఉండాలని పోరాడి, వాటిని కూడా చట్టంలోకి చేర్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో రైతులు కాపాడుతూ వస్తున్న జీవ వైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేసి, దానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా తన స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా కృషి చేశారు.

వ్యవసాయ సమస్యలపై, పరిష్కారాలపై ఆయన మాట్లాడినంత, రాసినంత ఏ ఇతర వ్యవసాయ శాస్త్రవేత్త కూడా ఈ రోజు వరకు చేయలేదు. ప్రభుత్వాలు చెప్పిందే చేయటం కాకుండా, ప్రభుత్వాలు ఏమి చేయాలో చెప్పి వారి చేత ఒప్పించి అనేక మార్పులు చేయటం అయన చేయగలిగారు. 1972లో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా నియమించబడిన ఆయన, 1979లో ప్రిన్సిపాల్ సెక్రటరీగా కూడా నియమించబడ్డారు. బహుశా అలాంటి గుర్తింపు పొందిన ఏకైక శాస్త్రవేత్త డా॥ స్వామినాథన్.

ఇండియన్ పోలీస్ సర్వీస్‌కి ఎంపిక అయినా, వ్యవసాయ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ రంగంలోకి రావటమే కాకుండా, జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక సంస్థలను స్థాపించారు. సొంతంగా ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్ స్థాపించి అనేక కార్యక్రమాలు చేపట్టారు. తన సొంత ఆస్తిలో చాలా భాగం భూదాన ఉద్యమంలో ఇచ్చివేసిన మనిషి కూడా. ఆయన జీవితం ఎందరికో ప్రేరణ, స్ఫూర్తి. రైతుల తరఫున, వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తల తరఫునా ఆయనకు ఘన నివాళి.

> 1947 ఆగస్ట్ 16న అన్ని పత్రికల మొదటి పేజీలూ ప్రధాని నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగాన్ని కవర్ చేశాయి. రెండో పేజీలో రానున్న ఆహార సంక్షోభం గురించి ఎం.ఎస్. స్వామినాథన్ చేసిన హెచ్చరిక ఉంది. ఆహార భద్రత విషయంలో ఆయన దేశానికి మార్గదర్శనం చేశారు.
>
> – ప్రణవ్ ప్రతాప్ సింగ్, పొలిటికల్ కన్సల్టెంట్

వ్యాసకర్త వ్యవసాయ శాస్త్రవేత్త, కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ, సుస్థిర వ్యవసాయ కేంద్రం

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కార్య సాధకుడు



భారత హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ మరణం నాకు తీవ్రమైన వ్యక్తిగత నష్టం. ఆహార హక్కు విషయంలో ఆయనతో దగ్గరగా పనిచేశాను. ఆయన 'ఎన్ఎఫ్ఐ' (నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా)కి ఫౌండర్ ట్రస్టీ, మాజీ ఛైర్మన్. ఈ సంస్థ స్థాపనలో కీలక భూమిక పోషించారు. మహా మనీషి!

– బిరాజ్ పట్నాయక్, ఎన్ఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అసలైన బలం



'యూఎస్‌ను ఎప్పుడూ నమ్మవద్దు' అంటే ఒప్పుకొంటాను. కానీ ఆర్మేనియాలో జరిగినది చూశాక రష్యాను మాత్రం నమ్ముతారా? తమ స్నేహితులతో ఎలా ప్రవర్తిస్తారు అనేదాన్ని బట్టి మనుషులను అంచనా వేయాలి. స్నేహితుడికి జరిగినది ఒకరోజు మీకు కూడా జరగొచ్చు. అందుకే నేను మన అణ్వాయుధాలను మాత్రమే నమ్ముతాను.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, పరిశోధకుడు

పని చేయదు!



సెప్టెంబర్ 25న జరిగిన భారత వ్యతిరేక ర్యాలీకి టొరంటోలో కేవలం 100 మంది, వాంకోవర్‌లో 200 మంది ఖలిస్తానీలు హాజరయ్యారు. ఇది కెనడాలోని 7.7 లక్షల సిక్కు జనాభాలో 0.038 శాతం. 2024 ఎన్నికల్లో లబ్ధి కోసం సిక్కుల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టేవారు తమను తాము ఆత్మవిమర్శ చేసుకోవాలి.

– జె.ఎస్. సోధీ, లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్)

మేధా చౌర్యం



ఇక్కడ ఒక దొంగతనాన్ని రిపోర్టు చేస్తున్నాను. నా పుస్తకాలను రాయడానికి నా జీవితంలోని మూడు దశాబ్దాలు వెచ్చించాను. ఏఐ (కృత్రిమ మేధ) లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ 'డేటా'ను 'నమలడమో', 'గీరడమో' చేయలేదు. ఏఐ కంపెనీలు నా పనినీ, కాలాన్నీ, సృజననూ దొంగిలించాయి. వాళ్లు నా కథలను దొంగిలించారు. వాళ్లు నాలోని కొంత భాగాన్ని దోచుకున్నారు.

– మిన్ జిన్ లీ, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అమెరికా చదువు సంస్కృతులు

అమెరికా విద్యారంగంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రాజకీయులు ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం వరకు పాఠశాలల నిర్వహణ అద్భుతంగా ఉండేది. యువ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో చనువుగా ప్రవర్తించేవారు. పిల్లల విషయాలను చర్చించడానికి ఒక రోజయినా వారితో గడిపేవారు. నేటి విద్యార్థులు, యువత అతి తక్కువ సమయంలో ఊహించని, తీవ్రమయిన మార్పులకు గురవుతున్నారు. యుక్త వయసులోకి ప్రవేశిస్తున్న వీరు జ్ఞానాన్ని గ్రహించటానికి పెనుగులాడుతున్నారు.

పాఠశాలలకూ సమస్యలున్నాయి. విపరీతంగా సాగదీయబడిన ప్రతిష్ఠాత్మక పునర్నిర్మాణ పథకం, ఆశించిన స్థాయిని అందుకోలేని దూరవిద్య, కరోన మహమ్మారి కాలపు అలవాట్ల నుండి బయటపడలేని దుస్థితి అందులో కొన్ని. విద్యాలయాల వద్ద మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల అమ్మకాలు మరో తీవ్ర సమస్య. బాంబుల, తుపాకుల ఉపయోగ సంస్కృతి సకారాత్మక నిర్ణయాలకు అడ్డుతగులుతున్నాయి.

మహమ్మారి కాలంలో కోల్పోయిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఇప్పుడిప్పుడు నేర్చుకుంటున్నట్లు అనిపిస్తుంది. రెండేళ్లలో తప్పిన సాంఘికీకరణ, పరిపక్వతలను సంపాదిస్తున్నారు. సామాజిక అభివృద్ధిలో విద్యార్థులు రెండేళ్ళు వెనుకబడ్డారని మానసికశాస్త్ర ఉపాధ్యాయుల అభిప్రాయం. అందుకే బళ్ళలో అంతా బాగుందనేవాళ్ళ సంఖ్య తగ్గింది. విద్యారంగం పిచ్చివాళ్ళ, తీవ్రవాదుల హస్తాల్లో చిక్కుకుందని కొన్ని పత్రికలు ప్రచారం కూడా చేస్తున్నాయి.

అమెరికాలో విడాకులు పెరిగాయి. పిల్లలకు ఇద్దరు తల్లిదండ్రుల పెంపక అవకాశం లేదు. తల్లిదండ్రులు ఇద్దరిలో ఎవరో ఒకరే పిల్లలను పెంచవలసి వస్తోంది. 25 శాతం పిల్లలు ఇలాంటివారే. ఏ దేశంలోనూ ఈ స్థితి ఈ స్థాయిలో లేదు. ఈ చేదునిజం అమెరికాలో సింగిల్ పేరెంట్ సంరక్షణ శిశువులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనితో సమాజం నష్టపోతోంది. ఈ పిల్లలు ప్రవర్తనా సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో వీరి సంఖ్య తక్కువ. వారిలో అవగాహన, బోధనాంశాలను అర్థం చేసుకోవడంలో తేడా ఉంటోంది. పిల్లల చదువు, భావిపౌరుల శ్రేయస్సుకు... అమెరికాలో పతనమయిన కుటుంబ, సామాజిక సంబంధాలను మెరుగుపర్చడమే మార్గం.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

సారాంశం

సరికొండ చలపతి

'ఆకాశం'లోకి నేల జారిపోతోంది



వడ్డీల్లో వేతన జీవులు..

హైదరాబాద్‌లో ఓ ఐటీ ఎంప్లాయ్.. ఉద్యోగంలో చేరి మూడేళ్లయ్యింది.

లక్ష దాకా శాలరీ వస్తోంది. ఓ అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడు. అదీ ఆఫీసుకు 20 కిలోమీటర్ల దూరంలో. ఇప్పుడాయన తన శాలరీలో 50 వేలు ఈఎమ్ఐ కడుతున్నాడు. అలా 20 ఏళ్లు కట్టాలి. ఇక మధ్య బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచితే మరో ఐదేళ్లు.. అంటే ఈ కిస్తులు రిటైర్‌మెంట్ దాకా పోయినా ఆశ్చర్యం లేదు. అంటే జీతంలో సగం. అసలే ప్రైవేటు ఉద్యోగం.. ఎప్పుడు పింక్ స్లిప్ వస్తుందో తెలియదు. పప్పు, ఉప్పు లాంటి నిత్యావసర సరుకులు కాసింత పెరిగితేనే నెలాఖరుకు ఇబ్బంది పడే మధ్యతరగతి ఉద్యోగి జీతంలో సగం తలదాచుకోవడానికి పెట్టాల్సివస్తోంది. లైఫ్ క్వాలిటీని నిలువెల్లా తినేస్తోంది.

మధ్యతరగతి జీవితం నుంచి బయటపడాలి, ఐదంకెల జీతం రావాలి అని పాతికేళ్లు చదివి లక్ష రూపాయల ఉద్యోగం దాకా చేరిన వారు... అంతులేకుండా పెరిగిన ఇళ్ల ధరల కారణంగా బొటాబొటి ఆదాయంతోనే బతికే పరిస్థితి వచ్చింది. మళ్లీ అదే మధ్యతరగతి... అదే నెలాఖరు. లోన్లు, వడ్డీలు నడ్డి విరుస్తుంటే జీవితం ఎప్పుడూ చేబదుల్లోనే ఉంటోంది.

....

నిత్యావసరమైన నేల అంగడి సరుకయ్యింది. బంగారంలా పెట్టుబడి అయ్యింది. పేద మధ్య తరగతి కాళ్లకిందనుంచి నేల జారిపోయింది.

....

నేల.. ఓ సేల్ డీడ్

డబ్బు పెరిగి పిల్లలు పెట్టాలంటే ఆర్థిక నిపుణులు మూడు విధాలుగా పెట్టుబడి పెట్టడం మార్గంగా చెబుతున్నారు. ఒకటి రియల్ ఎస్టేట్, రెండవది బంగారం కొనడం, మూడవది షేర్ మార్కెట్‌లో మదుపు చెయ్యడం. ఈ మూడు విధాలుగా దాచే డబ్బు విలువ పెంచుతుంది. ఇప్పుడీ మూడింటిలో మనిషికి నీడనివ్వాల్సిన నేల ధనికుల పెట్టెల్లో షేర్ పత్రాల్లాగా సేల్ డీడ్స్ రూపంలో పడి ఉంటోంది. స్టాక్ మార్కెట్ తర్వాత ఎక్కువ రిటర్న్స్ ఇచ్చే రంగం ఇదే అయ్యింది. ట్యాక్స్ కట్టని నల్లడబ్బు పునాదుల మీద రియల్ ఎస్టేట్ 'హైరైజ్'లో ఉంది.

సర్కార్.. మార్కెటింగ్

రియల్ ఎస్టేట్ మదుపు చేసేవారంతా అవినీతిపరులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలే అని నిర్ధారించడం కాదు... నేల వ్యాపారం అయితే దాని విలువ నిలువ నీడ లేకుండా చేస్తుంది. ఈ ధోరణిని మార్కెట్టే కాదు.. సర్కారు కూడా ఎంకరేజ్ చేస్తోంది.

కోకాపేటలో ఎకరం వందకోట్లు, నియో పోలీస్‌లలో వంద కోట్లు.. బుద్వేల్‌లో 46 కోట్లు.. ఇక్కడ ఎకరం అమ్మితే అక్కడ 10 ఎకరాలు కొనొచ్చు.. ఇవన్నీ నిజంగా గర్వ పడాల్సిన మాటలేనా..? ఈ చుట్టు పక్క ప్రాంతాల వైపు సాధారణ ప్రజలు కన్నెత్తి చూడ లేస్తారా...? పేద, మధ్యతరగతికి ఆరడుగుల నేల దూరం చేసే ధోరణి కాదా...? మెజారిటీ ప్రజలు తమ జీవిత కాలంలో ఒక ఇల్లు కొనుక్కోవటమే గగనం. ఎలాగోలా కష్టపడి కొనుగోలు చేసే వాళ్ళు కూడా ఎక్కువ మొత్తం బ్యాంకు లోన్ తీసుకుంటే తప్ప ఆ ఒక్క ఇల్లు కొనటం కూడా సాధ్యం కాదు. ఓ వంద గజాలు కొనుక్కోవాలంటే ఆ ఇంటి అప్పు తీర్చటానికి జీవిత కాలం పడుతుంది. ఇలాంటి వారికి ఎకరాలు, అవి సర్కారుకు అందిస్తున్న వందల కోట్లు ఆనందాన్నిస్తాయా...? రాష్ట్రం ప్రగతి పథంలో పడుతుందన్న సంబురాన్నిస్తుందా? తలదాచుకోవడానికి ఉపయోగపడాల్సిన నేల, ఇల్లు .. రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారి దానిలోకి నేరుగా ప్రభుత్వాలే దిగడం మరింత ఆందోళనకరం. ఇది క్రమంగా రాజకీయాలకు అవసరంగా, ఎన్నికల ఇంధనంగా మారిపోయింది. క్రమంగా స్థిరాస్తి రంగం అన్ని రంగాలను శాసిస్తోంది. పెద్ద పెద్ద తలకాయలు అన్ని దీనిలో తలదూర్చాయి. మెజారిటీ ప్రజల మీద వీర విహారం చేస్తున్నాయి.

ఈ ధోరణి నగరాల నుంచి క్రమంగా పల్లెల మీద పడింది. వ్యవసాయ భూముల్లో కలుపు మొక్కల్లాగా పెరుగుతోంది. స్టీల్, సిమెంట్, ఇసుక, ఇటుక, టైల్స్, గ్రానైట్, ఒకటేమిటి... చాలా రంగాలు, వ్యాపారాలు రియల్ ఎస్టేట్‌తో ముడిపడి ఉన్నాయి. రియల్ ఎస్టేట్ అన్ని రంగాలను శాసిస్తోంది. ఇప్పుడివన్నీ రాజకీయ నాయకులు, పెద్దల చేతుల్లోకి వెళ్లి పోయాయి..

....

30 మంది.. 8,000 ఇళ్లు..

ఇది మన ఒక్కరి సమస్యే కాదు. ఉదాహరణగా, ఈ వార్త చూడండి..

దక్షిణ కొరియాకు సంబంధించినది.

30 మంది వ్యక్తులు ఐదున్నర సంవత్సరాల కాలంలో 8,000 ఇళ్ళు కొనుగోలు చేశారు. వీటి మొత్తం విలువ మన భారతీయ కరెన్సీలో 7,446 కోట్ల రూపాయలు. 2018 సంవత్సరం నుంచి 2023 జూన్ మధ్య కాలంలో ఈ ముప్పై మంది 8,000 ఇళ్ళు కొనుగోలు చేశారు.

చైనాలో 100 కోట్ల ఇళ్లు ఖాళీ..

మితి మీరిన వ్యాపారం ఎక్కడికి దారి తీస్తుందో చైనా వార్త చెబుతుంది.

ఇక్కడ దాదాపు 100 కోట్ల ఇళ్లు ఖాళీగా ఉన్నాయట. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్మాణాల్లో ఉన్న నివాస గృహాలన్నీ అందుబాటులోకి వస్తే 300 కోట్ల మందికి సరిపోతాయట. చైనా దేశ స్టాటిస్టిక్స్ బ్యూరో మాజీ డిప్యూటీ హెడ్ హే కేంగ్ స్వయంగా చెప్పిన విషయం ఇది. చైనా జీడీపీలో 30 శాతం రియల్టీదే. ఇప్పుడా రంగమే చైనాకు పెను భారమైంది. వ్యాపార కాంక్షతో హైదరాబాద్ చుట్టూ ఆకాశం దాకా విస్తరిస్తున్న కాంక్రిట్ జంగిల్‌కు ఇదో హెచ్చరిక.

స్థలాలు, గృహాల ధరలు పరిమితికి మించి పెరిగిపోవడంతో హైదరాబాద్ నగరంలో ఇళ్లు, ఫ్లాట్ల కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ అంచనా ప్రకారం.. 2022 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య ఆరు నెలల్లో 1,460 కొత్త ఇళ్లు అమ్ముడవగా.. 2023లో ఇదేకాలానికి 720 ఇళ్లే అమ్ముడయ్యాయి.

స్థలాలు, ఇళ్ల ధరలు పెరిగిపోవడమే దీనికి కారణమని రియల్ ఎస్టేట్ వర్గాలే చెప్తున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో మూడు, నాలుగేళ్ల కింద వెయ్యి చదరపు అడుగుల ఫ్లాట్ సుమారు రూ. 50 లక్షల్లో వస్తే.. ఇప్పుడది రూ. 70 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు పెరిగిందని అంటున్నాయి.

వీధుల్లో పేదలు...

వేతన జీవుల పరిస్థితి ఇలా ఉంటే.. ఇక పేదల పరిస్థితి ఏమిటి..?

- 27 సభ్యదేశాలున్న ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ గణాంకాల ప్రకారం.. ప్రతి లక్ష మందికి ఫ్రాన్స్‌లో 217 మంది, యూఎస్‌లో 177, చిలీలో 155, ఐర్లాండ్‌లో 78, స్పెయిన్ లో 49, పోర్చుగల్‌లో 20 మంది పూర్తిగా నిరాశ్రయులే.
- సొంత ఇల్లు, ఉపాధి లేక.. షెల్టర్లలో ఆశ్రయం పొందినవారూ ఈ దేశాల్లో ఉన్నారు. యూకేలో 7.7 శాతం, యూఎస్‌లో 6.2 శాతం, ఇటలీలో 4 శాతం, బెల్జియంలో 3.4 శాతం, జర్మనీలో 2.4 శాతం మంది తాము జీవితంలో ఒకసారైనా ఇలాంటి పరిస్థితిని అనుభవించామని ఒక సర్వేలో వెల్లడించారు.
- ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. జపాన్‌లో నిరాశ్రయుల సంఖ్య అతి తక్కువ. ఉత్తమ గృహ కల్పన విధానాలు, డ్రగ్స్ నియంత్రణ, మానసిక ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటివి దీనికి కారణం.
- ప్రపంచంలో నిరాశ్రయుల సంఖ్య అతిఎక్కువగా ఉన్న దేశం నైజీరియా. అక్కడి జనాభాలో 12 శాతం వరకు నిరాశ్రయులే.
- మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నా, యూఎన్ మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ నివేదిక ప్రకారం... మన దేశ జనాభాలో 6.7 శాతం నిరుపేదలే. వీరిలో చాలా మంది నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న వారే. దీనికి సంబంధించి 'కోల్డ్ అండ్ అన్ కేర్డ్ ఫర్ (సీఏయూఎఫ్) సొసైటీ' తమ నివేదికలో పలు కీలక అంశాలను వెల్లడించింది.
- దేశంలోని చాలా నగరాల్లో ఇళ్లు, స్థలాల ధరలు పేదలకు అందుబాటు ధరల్లో లేకపోవడం సమస్యగా మారింది. కనీసం అద్దెలను కూడా భరించలేని పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆదాయ అసమానతలు, ఉద్యోగ–ఉపాధి అవకాశాల్లో వివక్ష వంటివి కూడా.. ఇళ్లు కొనలేకపోవడానికి కారణమవుతున్నాయి.
- దేశంలో ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి పెద్ద నగరాల్లో ఇళ్లులేని పేదల సంఖ్య ఎక్కువగా ఉంది.

....

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** పౌర్ణమి సా.4.10 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.1.21 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.11.50 నుండి 1.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.14 నుండి 1.04 వరకు, **అమృతఘడియలు:** రా.8.48 నుండి 10.20 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.53, **సూర్యాస్తమయం:** 5.51.

క్లుప్తంగా...

తెలంగాణకు కేంద్రం న్యాయం చేస్తోంది: అరుణ



పాలమూరు: కేంద్ర ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు కృష్ణాజలాల వాటా పంపిణీలో తెలంగాణకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా 575 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎందుకు ఒప్పుకుని సంతకం పెట్టారో ప్రజలముందు వివరించాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలలో ఒక్క మోటార్ ప్రారంభించి సీఎం కేసీఆర్ ప్రాజెక్టు పూర్తయ్యిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఒక్క మోటారే ప్రారంభించి పాలమూరు ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఎక్కువ సీట్లివ్వాలి

- ఠాక్రేకు నివేదిక అందించిన బీసీ రాజ్యాధికార సమితి



ఠాక్రేకు నివేదిక అందించిన సమితి నేతలు

సాక్షి, హైదరాబాద్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలని, బీసీల జనాభా 60%పైనున్న 42 నియోజకవర్గాలు, 50% పైచిలుకు జనాభా ఉన్న 72 స్థానాల వివరాల నివేదికను బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేకు అందించారు. బీసీల ఓట్లతో బాటు బీసీల నాయకత్వాన్ని సైతం గౌరవించి కాంగ్రెస్ కొత్త అధ్యాయాన్ని సృష్టించాలని కోరారు. బీసీ నాయకత్వం బలంగా ఉన్నప్పటికీ ఆర్థికంగా బలంగా లేని బీసీ నాయకులకు వారికి విజయానికి కాంగ్రెస్ అండగా నిలబడాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, బీసీ కులగణనకు ప్రయత్నాలను కాంగ్రెస్ ముమ్మరం చేయాలని కోరారు. బీసీల ఆధిపత్య స్థానాల వివరాలను కాంగ్రెస్ కేంద్ర వర్కింగ్ కమిటీకి నివేదిస్తానని, తప్పకుండా బీసీలకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశించిన మేరకు సీట్లు అందేలా కృషి చేస్తానని దాసు సురేశ్ బృందానికి మాణిక్ రావు ఠాక్రే హామీనిచ్చారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి పద్మావతి, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్ భోగ శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ పైరసాని దుర్గేశ్, ఉపాధ్యక్షురాలు ఉమా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖర్గే, రాహుల్‌తో కాంగ్రెస్ ఓబీసీ నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ నేతలు శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీలను కలవనున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓబీసీలకు తగిన సంఖ్యలో టికెట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా కనీసం 34 అసెంబ్లీ స్థానాలను కేటాయించాల్సిందిగా వారు అధిష్టానాన్ని కోరనున్నట్లు తెలిసింది. గురువారం రాత్రి ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో వీరు సమావేశమయ్యారు. అధిష్టానం పెద్దల వద్ద ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. భేటీలో మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, కత్తి వెంకటస్వామి, డా.కొనగల మహేశ్, జగదీశ్వరరావు, చెరుకు సుధాకర్, మెట్టు సాయికుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్నికలకు బీజేపీ కేంద్ర కమిటీ

- 26 మంది ఉన్న కమిటీలో సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, 8మంది కేంద్రమంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన బీజేపీ 26 మంది ముఖ్య నేతలతో కేంద్ర కమిటీని ఏర్పాటు చేసింది. ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నేతలకు ఆ కమిటీలో బీజేపీ జాతీయ నాయకత్వం చోటు కల్పించింది. ఏపీ నుంచి సోమువీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డిలకు అవకాశం ఇచ్చారు. ఇక ఆ కమిటీలోని 26 మందిలో 8 మంది కేంద్రమంత్రులను పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ కమిటీ ఎన్నికల ప్రచారం, అభ్యర్థులకు తోడ్పాటు, జాతీయ నేతల బహిరంగ సభల నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు తెలంగాణలోనే ఉంటూ పనిచేసేలా పార్టీ అధినాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా అక్టోబర్ 5 న తెలంగాణ ఎన్నికల కేంద్ర కమిటీతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం కానున్నారు.

ఒక్కో టికెట్‌కు ఐదెకరాలు, రూ.10కోట్లు

- టీపీసీసీ అధ్యక్షుడు అమ్ముకుంటున్నట్టు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మతకలహాలు, కొట్లాటలు జరుగుతాయి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



ములుగు జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ కవిత తదితరులు

సాక్షి, మహబూబాబాద్/ములుగు/నర్సంపేట: టీపీసీసీ అధ్యక్షుడు ఒక్కో టికెట్ రూ.10కోట్లు, ఐదుఎకరాల భూమికి అమ్ముకుంటున్నాడని, ఆ పార్టీ నాయకులే బాహాటంగా ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటి వారికి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సైతం అమ్మేస్తారని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఆయన పర్యటించారు. ములుగు, నర్సంపేటలలో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు, మరిపెడ, తొర్రూరులో వంద పడకల ఆస్పత్రుల భవనాలకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గృహలక్ష్మి, దళితబంధు ప్రొసీడింగ్ కాపీలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అయాచోట్ల ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు పథకాలు అమలు కావని, ఆరుగురు ముఖ్యమంత్రులు మారుతారన్నారు. రాష్ట్రంలో మత కలహాలు, కొట్లాటలు సైతం జరుగుతాయని చెప్పారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ.600 పింఛన్ ఇస్తుంటే, తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో మెడికల్ కళాశాలలు లేక విదేశాలకు వెళ్లి చదవాల్సిన దుస్థితి ఉండేదని, ఇప్పుడు డాక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణ ప్రథమస్థానంలో నిలవనుందన్నారు. ఒకప్పుడు ఏజెన్సీ గ్రామాల్లో ఇనుప చప్పుళ్లు, ఎన్‌కౌంటర్లు విన్నామని, ఇప్పుడు గలగల పారే నీళ్లు, ఉచిత కరెంట్‌తో పచ్చని పంటలు చూస్తున్నామని చెప్పారు. గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వకపోడానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీఓనే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 3లక్షల మందికి మాత్రమే పట్టాలు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం 4.06లక్షల మందికి పట్టాలు ఇచ్చి, ఎనిమిది రకాల సౌకర్యాలు అందిస్తుందని చెప్పారు.

రైతు విలువ పెంచిన సీఎం కేసీఆర్

కాంగ్రెస్ పాలనలో కరువు కాటకాలు, వర్షాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతూ.. వర్షం కురవాలని కప్పతల్లి ఆటలు.. శివుడిగుడిలో పూజలు చేసేవారని,. నేడు సీఎం కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరంతో నేడు కళకళలాడే పచ్చటి భూములకు నిలయంగా తెలంగాణ ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. నాడు ఎకరం రూ.20వేలు ఉన్న భూమి విలువ ఇప్పుడు రూ.30లక్షలకు పెరిగిందని.. భూమి విలువే కాకుండా..రైతు విలువను కూడా సీఎం కేసీఆర్ పెంచారన్నారు.

మోదీ వచ్చి ఏం చెబుతారు?

రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు అమలు చేయడం చేతకాని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి వచ్చి ఏం చెబుతారన్నారని మంత్రి ప్రశ్నించారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఎందుకు మంజూరు చేయలేదన్నారు.ఆయా కార్యక్రమాల్లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియ, సీతక్క, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాత మధు, జెడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ప్రావీణ్య, శశాంక తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపూర్ వద్ద కిటెక్స్ గ్రూప్స్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి తదితరులు

మన పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శం

- రాష్ట్రానికి దేశ, విదేశీ పెట్టుబడుల వరద
- 2 నెలల తర్వాత తిరిగి అధికారంలోకి వస్తాం: మంత్రి కేటీఆర్

షాబాద్: తెలంగాణలో నూతన పారిశ్రామికవిధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్‌లో 250 ఎకరాల్లో రూ.1,200 కోట్లతో కిటెక్స్ గ్రూప్స్ రెండో యూనిట్, చందనవెల్లిలో రూ.272 కోట్లతో సింటెక్స్ మూడో యూనిట్‌కు గురువారం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రోహిత్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తోందని, సీఎం కేసీఆర్ చేస్తున్న కృషికి ఇదే నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో సీతారాంపూర్, చందనవెల్లి గ్రామాలు పారిశ్రామిక ఖిల్లాలుగా మారుతాయని, ప్రపంచ చిత్రపటంలో ఇవి మార్మోగుతాయని చెప్పారు. షాబాద్‌లో తయారు చేసిన సింటెక్స్ డబ్బాలు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలున్నాయన్నారు. టెక్స్‌టైల్స్, నాపరాయి పరిశ్రమలు పూర్తయితే వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతకుముందు ఆయన సీతారాంపూర్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రెండు నెలల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతో తెలంగాణలో పారిశ్రామిక విధానం ముందుకు సాగుతోందని అన్నారు. త్వరలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ సంస్థ అధినేత బాలకృష్ణ గోయెంకా, కిటెక్స్ జాకబ్, జిల్లా కలెక్టర్ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

రంగంలోకి రాహుల్!

- కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీని చక్కదిద్దేందుకు చర్యలు
- అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో చర్చలు
- కేసీ వేణుగోపాల్, సునీల్ కనుగోలుతోనూ సమాలోచనలు
- గెలుపు గుర్రాలనే ఎంపిక చేయాలని ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో రోజురోజుకూ రాజుకుంటున్న టికెట్ల పంచాయితీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీనే స్వయంగా రంగంలోకి దిగారు. కుల సమీకరణలు, రాజకీయ అనుభవం, వలసవాదులు, కాంగ్రెస్ వాదులు, సీనియర్లు, జూనియర్లు అంటూ రోజుకోవాదం తెరపైకి వస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక తీరుతెన్నులపై రాహుల్ గాంధీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు సహా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నుంచి రాహుల్ వివరాలు సేకరించారు. తెలంగాణలో పార్టీ గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక ఉండాలనే సంకేతాలను రాహుల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

చేరికలపై సమాలోచనలు...

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహా ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో అదే స్థానంలో టికెట్ కోరుతున్న సీనియర్ నేత నందికంటి శ్రీధర్‌ను వెంటపెట్టుకొని రాహుల్ గాంధీ వద్దకు వెళ్లిన రేవంత్‌రెడ్డి ఆయనతో విడిగా భేటీ అయ్యారు. సుమారు అరగంటపాటు అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, కొత్త చేరికల అంశంపై చర్చించారు. సగానికిపైగా స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై స్క్రీనింగ్ కమిటీలో తలెత్తిన భిన్నాభిప్రాయాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన బలమైన అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాల్సిన అవసరాన్ని రేవంత్ నొక్కిచెప్పినట్లు సమాచారం. అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకొని కాంగ్రెస్‌లోకి వస్తున్న నేతలకు టికెట్ల విషయంలో సమతౌల్యం లోపిస్తే పార్టీ గెలుపు అవకాశాలకు భారీగా గండి పడుతుందన్న విషయాన్ని వివరించినట్లుగా తెలుస్తోంది. ఇక సామాజిక న్యాయం జరిగేలా బీసీలకు టికెట్ల కేటాయింపు అంశం సైతం ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు సమాచారం. ముదిరాజ్, గౌడ, యాదవ వర్గానికి అధిక టికెట్లు ఇచ్చేలా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నామని, బీఆర్ఎస్‌కన్నా కనీసం 6 నుంచి 8 టికెట్లు అధికంగా ఇచ్చే ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు రేవంత్ వివరించారు. ఈ భేటీ అనంతరం నియోజకవర్గాలవారీగా అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు రేవంత్‌రెడ్డితో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో రాహుల్ సైతం పాల్గొన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా నియోజకవర్గాలవారీగా పార్టీ అభ్యర్థుల గెలుపోటముల అంశాన్ని సునీల్ వివరించారు. ఇతర అంశాల జోలికి వెళ్లకుండా గెలుపు ప్రాతిపదికనే అభ్యర్థుల ఎంపిక ఉండాలని రాహుల్ వారికి సూచించినట్లుగా తెలుస్తోంది.

రాజకీయ భవిష్యత్తుకు మాది భరోసా...

మైనంపల్లి చేరికతో టికెట్ కోల్పోతున్న నందికంటి శ్రీధర్‌కు రాహుల్ గాంధీ స్వయంగా భరోసా కల్పించినట్లు సమాచారం. భవిష్యత్తులో పార్టీ పదవుల్లో మంచి అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక మెదక్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి హైకమాండ్ నుంచి పిలుపు రావడంతో ఆయన ఢిల్లీకి వచ్చినా ఎవరినీ కలవకుండానే తిరిగి హైదరాబాద్ వెళ్లినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి

- వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు కూడా..
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మల్లికార్జున ఖర్గే
- రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించిన నేతలు



ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్. చిత్రంలో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావుఠాక్రే, పొంగులేటి, షబీర్ అలీ, చిన్నారెడ్డి, వంశీచందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ సీట్ల కేటాయింపు విషయంలో అసంతృప్తికి గురై సంచలన వ్యాఖ్యలు చేసి బీఆర్ఎస్‌ను వీడిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరారు. మైనంపల్లితో పాటు ఆయన కుమారుడు రోహిత్‌రావు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరికి చెందిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుమారు గంటన్నర పాటు మైనంపల్లి, రేవంత్‌రెడ్డి, ఠాక్రే, షబ్బీర్ అలీ, వంశీచంద్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నాయకులు ఖర్గేతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలి అనే అంశంపై చర్చించారు. మల్కాజిగిరి, మెదక్, నకిరేకల్ సహా పలు నియోజకవర్గాల్లోని పరిస్థితిపై ఖర్గే ఆరా తీశారు. అధికార బీఆర్ఎస్‌ను గద్దె దింపేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించారని సమాచారం.

భవిష్యత్తు బ్రహ్మాండంగా ఉండబోతోంది: మైనంపల్లి

భేటీ అనంతరం ఖర్గే నివాసం వద్ద మైనంపల్లి మీడియాతో మాట్లాడారు. 'నా రాజకీయ భవిష్యత్తు బ్రహ్మాండంగా ఉండబోతోంది. అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ గాలి వీస్తోంది. తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. కాంగ్రెస్ హైకమాండ్ సర్వే నివేదికల ఆధారంగా టికెట్లు ఇస్తోంది. వాటి ఆధారంగా మాకు టికెట్లు వస్తాయని అనుకుంటున్నాను. ప్రజలు, కేడర్ నాతో ఉన్నారు..'అని అన్నారు. మళ్లీ సొంత గూటికి చేరడంతో సంతోషంగా ఉందని కుంభం అనిల్‌కుమార్ అన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో మరోసారి అధికారంలోకి వస్తాం

- బీజేపీ, కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు తిరస్కరిస్తారు
- తెలంగాణపై మోదీకి ఎందుకో కక్ష
- పీటీఐ ఇంటర్వ్యూలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇస్తోందని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని జోస్యం చెప్పారు. గురువారం పీటీఐ వార్త సంస్థ ఇంటర్వ్యూలో కవిత బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తెలంగాణ ప్రజలు తిరస్కరిస్తారని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చిందని, ఆ పార్టీ మాటలు నమ్మశక్యం కావన్నారు. గత 10 ఏళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ప్రధాని మోదీకి తెలంగాణ అంటే ఎందుకు కక్షనో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటుపై పార్లమెంటులో మోదీ అంత పెద్ద మాట అంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను గవర్నర్ తిరస్కరించడంపై స్పందిస్తూ గవర్నర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రధాని మోదీ ముఖ్యమంత్రిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, ఏ రాష్ట్రంలో చూసినా ఇదే వైఖరిని అవలంబిస్తున్నారని కవిత విమర్శించారు. ఇలాంటి చర్యలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నది గుర్తుంచుకోవాలన్నారు. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. కేంద్రం తలుచుకుంటే అమలు చేయవచ్చని కానీ బీజేపీ ప్రభుత్వం అమలు చేయబోదని మహిళలకు అర్థమైందని, మహిళా బిల్లు సాధనకు ఉద్యమించిన తరహాలో త్వరగా అమలు చేయాలని కూడా ఉద్యమిస్తామని ప్రకటించారు. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లలో కోటా కోసం కూడా మా పోరాటం సాగుతుందని కవిత తెలిపారు.

'ప్రజల మేలు కోరి సమర్థించి తీరుతాం'

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ సమాజంలో అత్యధిక ప్రజల ధోరణి ఈ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వదిలించుకోవాలి. ఈ దొరహంకార దుర్మార్గ పరిపాలన అంతం కావాలి అని కోరుకుంటున్నట్టు అభిప్రాయం వినబడుతున్నది'అని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యురాలు విజయశాంతి ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొన్నారు. పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, తాము జరుపుతున్న భేటీలపై ఆమె పరోక్షంగా స్పందిస్తూ గురువారంరాత్రి ఈ ట్వీట్ చేశారు. ఈ నిజమైన ప్రజాభావాలను దశాబ్దాల తెలంగాణ ఉద్యమకారిణిగా ప్రజల మేలు కోరుతూ సమర్థించి తీరుతానని పేర్కొన్నారు. 'గత కొన్నిరోజులుగా సమావేశమవుతున్న బీజేపీ నేతలందరం.. ప్రజాకంటక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బీజేపీ తొలగించగలదనే విశ్వాసంతోనే బీజేపీలో చేరినం. అందుకు మేం సాధ్యమైనంతవరకు అన్నివిధాలుగా ప్రయత్నించడం సహజం. పార్టీకి కూడా అదే తెలియజేసినం. నిజానిజాలు తెలుసుకోగలిగిన విజ్ఞత తెలంగాణ బిడ్డలకు ఎప్పుడూ ఉంటుందని నా విశ్వాసం. ఇదే సత్యం'అని విజయశాంతి ట్వీట్ చేశారు.

అధిక శాతం ఓటర్లను ఆకర్షించాలి

- బీఆర్ఎస్ సర్కార్‌పై వ్యతిరేకతను కూడా సొమ్ము చేసుకోవాలి
- వ్యూహాలు, కార్యాచరణపై బీజేపీ స్పెషల్ ఫోకస్
- పార్టీలో, కేడర్‌లో స్తబ్దత తొలగించేలా ప్రత్యేక ప్రణాళికలు
- మోదీ, నడ్డా పర్యటనలతో ఊపు వస్తుందనే అంచనాల్లో నేతలు
- 6న నడ్డా వివిధ అంశాలపై స్పష్టత ఇచ్చే అవకాశం





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌పై వివిధ వర్గాల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించడంతో పాటు అధిక శాతం ఓటర్లను తమ వైపు తిప్పుకునే వ్యూహాల రూపకల్పనపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్న నేపథ్యంలో.. అధ్యక్షుడి మార్పు, ప్రత్యక్ష, పరోక్ష రూ పాల్లో ప్రభావం చూపిన ఇతర అంశాలతో పార్టీలో, కేడర్‌లో ఏర్పడిన స్తబ్దత తొలగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పార్టీపరంగా, సొంతంగా వివిధ స్వతంత్ర సంస్థలు, ఏజెన్సీల ద్వారా పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, తదితరులు నిర్వహించిన సర్వేల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టుగా తేలిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేంత బలా న్ని ఇంకా సమకూర్చు కోలేదన్న విషయం కూడా స్పష్టమైన ట్టు విశ్వేశ్వర్‌రెడ్డి వంటి నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని బీజేపీ భావిస్తోంది.

6న నడ్డా దిశానిర్దేశం

ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే అక్టోబర్ 6న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం ఇక్కడకు వస్తుండడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ విస్తృత సమావేశంలో పాల్గొననున్న నడ్డా..పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల కార్యాచరణ విషయంలో స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికలు–పార్టీకి ముడిపడిన అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించడంతో పాటు రాష్ట్రంలో జాతీయ పార్టీ అనుసరించబోతున్న ఎన్నికల వ్యూహాన్ని కూడా స్పష్టం చేయనున్నట్టు తెలిసింది. ఈ భేటీ సందర్భంగా పార్టీ ఎన్నికల రోడ్‌మ్యాప్ ఖరారు, పార్టీ మేనిఫెస్టో, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై పూర్తి స్పష్టత ఇవ్వనున్నట్టు ముఖ్యనేతలు తెలిపారు. పార్టీ ముఖ్యనేతల మధ్య సమన్వయం, ఐక్యంగా ముందు కెళ్లడం, అసంతృప్త నేతలు కలిసి పనిచేయడంపై నడ్డా పలు సూచనలు చేయనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు పూర్తిగా అనుకూల పరిస్థితులున్నాయని, వాటిని సరైన పద్ధతుల్లో ఉపయోగించుకుని, ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగించే దిశలో కేంద్ర మంత్రులు మొదలు సామాన్య కార్యకర్త దాకా అంకితభావంలో పని చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తామంటూ నడ్డా హితవు పలికే అవకాశం ఉందని అంటున్నారు. వచ్చేనెలలో వరుసగా నిర్వహించే ఎన్నికల ప్రచార సభల్లో భాగంగా నడ్డాతో పాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, యూపీ సీఎం యోగి, అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇతర ప్రముఖులు పాల్గొనేలా కార్యక్రమాలు ఖరారు చేస్తున్నట్టు పార్టీవర్గాల సమాచారం.

మోదీ సభలతో ఊపు!

అక్టోబర్ 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు బహిరంగ సభల ద్వారా ప్రధాని మోదీ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుండటం పార్టీకి కచ్చితంగా కలిసి వస్తుందని బీజేపీ ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు. రాష్ట్రానికి, వివిధ వర్గాలు, రంగాలకు ప్రయోజనం చేకూర్చే చర్యలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు లాంటివి చేయడం ద్వారా రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి తప్పకుండా ఎన్నికల్లో బీజేపీ పట్ల ప్రజల్లో సానుకూలతను పెంచుతుందని భావిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీకి ఈ పాజిటివ్ ఓటింగ్ కచ్చితంగా మంచి ఫలితాలను తెచ్చిపెడుతుందని నేతలు విశ్వసిస్తున్నారు.

సీపీ.. సింపుల్‌గా!




సాక్షి, హైదరాబాద్: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తన ఇంటి వినాయకుడిని నిరాడంబరంగా గురువారం ఉదయం నిమజ్జనం చేశారు. ఇంట్లో దాదాపు అడుగు ఎత్తున్న మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన ఆనంద్ కుటుంబీకులు పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం విగ్రహాన్ని ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చిన ఆనంద్ ఆ ప్రాంగణంలోనే ఖాళీ పూల కుండీలో ఉంచి నీళ్ల పోశారు. నిమజ్జనం అనంతరం గణేషుడిని పూజించారు. ఈ వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసిన సీపీ... 'ఇంట్లోనే మట్టి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశా. కుండలో మిగిలిన మట్టిలో నా భార్య ఒక చెట్టును నాటారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుంది' అని ట్వీట్ చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ఆకలి లేని సమాజమే ఆయన కల

దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసిన ఎం.ఎస్.స్వామినాథన్

గోధుమ, వరి వంగడాల అభివృద్ధితో వ్యవసాయ రంగానికి ఎనలేని మేలు

సుస్థిర ఆహార భద్రతలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు



దేశానికి స్వాతంత్య్రం వచ్చిన(1947) తర్వాత దేశంలో వ్యవసాయ రంగం నిస్తేజంగా మారింది. బ్రిటిష్ వలస పాలనలో ఈ రంగంలో అభివృద్ధి నిలిచిపోయింది. వనరులు లేవు, ఆధునిక విధానాలు లేవు. తిండి గింజలకు కటకటలాడే పరిస్థితి. గోధుమలు, బియ్యం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే తప్ప ప్రజలకు నాలుగు మెతుకులు అందించలేని దురవస్థ ఉండేది. ఇలాంటి తరుణంలో స్వామినాథన్ రంగ ప్రవేశం చేశారు. హరిత విప్లవానికి బీజం చేశారు. మొదట పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి పెట్టారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే వంగడాలు సరఫరా చేశారు. ప్రభుత్వ సాయంతో తగిన సాగు నీటి వసతులు కల్పించారు. ఎరువులు అందించారు. కొద్ది కాలంలోనే సత్ఫలితాలు రావడం మొదలైంది. 1947లో దేశంలో గోధుమల ఉత్పత్తి ఏటా 60 లక్షల టన్నులు ఉండేది. 1962 నాటికి అది కోటి టన్నులకు చేరింది. 1964 నుంచి 1968 దాకా వార్షిక గోధుమల ఉత్పత్తి కోటి టన్నుల నుంచి 1.70 కోట్ల టన్నులకు ఎగబాకింది. దాంతో దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. మనకు అవసరమైన ఆహారాన్ని మనమే పండించుకోగలమన్న నమ్మకం పెరిగింది. గోధుమల తర్వాత స్వామినాథన్ నూతన వరి వంగడాలపై తన పరిశోధనలను కేంద్రీకరించారు. అమెరికాతోపాటు ఐరోపా దేశాల్లో విద్యాసంస్థలతో కలిసి పనిచేశారు. 1954లో కటక్‌లోని సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. నూతన వరి వంగడాలను సృష్టించారు. దేశీయ రకాలను సంకరీకరించి, కొత్త వంగడాలను అభివృద్ధి చేశారు. స్వామినాథన్ పలువురు మాజీ ప్రధానమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి పనిచేశారు. హరిత విప్లవాన్ని విజయవంతం చేయడానికి శ్రమించారు. గోధుమ వంగడాల అభివృద్ధి కోసం ప్రముఖ అమెరికా శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్‌తోనూ స్వామినాథన్ కలిసి పనిచేశారు. సుస్థిర ఆహార భద్రత విషయంలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందారు.

సివిల్ సర్వీసు వదులుకొని వ్యవసాయం వైపు..

మాన్‌కోంబు సాంబశివన్ స్వామినాథ్ 1925 ఆగస్టు 7న తమిళనాడు రాష్ట్రంలో కావేరి డెల్టా ప్రాంతంలోని కుంభకోణం పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ ఎం.కె.సాంబశివన్ వైద్యుడు. తల్లి పార్వతీ తంగమ్మల్ గృహిణి. 11వ ఏట తండ్రిని కోల్పోయారు. తన మామయ్య సంరక్షణలో పెరిగిన స్వామినాథన్ కుంభకోణంలో మెట్రిక్యులేషన్, త్రివేండ్రంలో జంతుశాస్త్రంలో డిగ్రీ చేశారు. తర్వాత కోయంబత్తూరు అగ్రికల్చరల్ కాలేజీ నుంచి అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ సాధించారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో పీజీ పూర్తి చేశారు. యునెస్కో ఫెలోషిప్‌తో నెదర్లాండ్స్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో చేరి, బంగాళదుంప జన్యు పరిణామంపై అధ్యయనం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా, జన్యు శాస్త్రవేత్తగా ఎదిగి, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరారు. స్వామినాథన్ తొలుత సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ, తండ్రి బాటలో వైద్య వృత్తిలో అడుగుపెట్టాలని భావించారు. అయితే, అప్పట్లో ఆకలి చావులను చలించిపోయారు. వ్యవసాయ పరిశోధనా రంగంలో అడుగు పెట్టారు. ఆకలి లేని సమాజాన్ని కలగన్నారు. ప్రజల ఆకలి తీర్చడమే కాదు, పౌష్టికాహారం అందించాలని సంకల్పించారు.

కరువు పరిస్థితులు చూసి..

వ్యవసాయ రంగాన్ని ఎంచుకోవడానికి కారణాలను స్వామినాథన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. '1942–43లో బెంగాల్‌లో భయంకరమైన కరువు సంభవించింది. తిండి లేక దాదాపు 30 లక్షల మంది చనిపోయారు. దేశం కోసం నేనేమీ చేయలేనా? అని ఆలోచించా. ప్రజల ఆకలి బాధలు తీర్చాలంటే వ్యవసాయ రంగమే సరైందని నిర్ణయానికొచ్చా. మెడికల్ కాలేజీకి వెళ్లడానికి బదులు కోయంబత్తూరులో వ్యవసాయ కళాశాలలకు చేరిపోయా. వ్యవసాయ పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టా. ఎక్కువ మందికి ఆహారం అందించాలంటే అధిక దిగుబడినిచ్చే వంగడాలు కావాలి. అందుకే జెనెటిక్స్, బ్రీడింగ్‌పై పరిశోధనలు చేశా. కరువు పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించా. వీటితో రైతులు లాభం పొందారు. ప్రజలకు తగినంత ఆహారం దొరికింది' అని స్వామినాథన్ పేర్కొన్నారు.

కనీస మద్దతు ధరపై కీలక సిఫార్సు

స్వామినాథన్ 2004 నుంచి 2006 దాకా 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్' అధినేతగా వ్యవహరించారు. పంటలకు కనీస మద్దతు ధరపై ప్రభుత్వానికి విలువైన ప్రతిపాదనలు చేశారు. పంటల ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతాన్ని కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని సూచించారు.

కొంతకాలం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేసిన స్వామినాథన్ 1954లో మళ్లీ భారత్‌లో అడుగు పెట్టారు. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా పరిశోధనలపై దృష్టి పెట్టారు. 1972–79లో ఇండియన్

ఎన్నో పదవులు

కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. 1979లో కేంద్ర ప్రభుత్వం ఆయనను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 2007 నుంచి 2013 దాకా రాజ్యసభలో నామినేటెడ్ ఎంపీగా సేవలను అందించారు. స్వామినాథన్ దేశ విదేశాల్లో ఎన్నో ప్రఖ్యాత సంస్థలకు నాయకత్వం వహించారు.

- 1981 నుంచి 1985 దాకా ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ స్వతంత్ర చైర్మన్
- 1984 నుంచి 1990 దాకా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ద కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ అధ్యక్షుడు
- 1982 నుంచి 1988 దాకా ఫిలిప్పీన్స్‌లోని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్
- 1989 నుంచి 1996 దాకా వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్(ఇండియా) అధ్యక్షుడు
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్



వరించిన అవార్డులు

- 1967లో పద్మశ్రీ
- 1971లో రామన్ మెగసెసే
- 1972లో పద్మభూషణ్
- 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్
- 1989లో పద్మవిభూషణ్
- ప్రపంచవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల నుంచి 84 గౌరవ డాక్టరేట్లు


నేల సారాన్ని కాపాడుకోకపోతే ఎడారే

హరిత విప్లవం వల్ల లాభాలే కాదు, నష్టాలూ ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. నూతన వంగడాలతో సంపన్న రైతులకే లబ్ధి చేకూరుతోందన్న వాదనలు వినిపించాయి. వీటితో నేల సారం దెబ్బతింటోందని, సంప్రదాయ దేశీయ వంగడాలు కనుమరుగైపోతున్నాయని నిపుణులు హెచ్చరించారు. పురుగు మందులు, ఎరువుల వాడకం మితిమీరుతుండడంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. హరిత విప్లవం ప్రతికూలతలను స్వామినాథన్ 1968లోనే గుర్తించారు. ఆధునిక వంగడాలతోపాటు సంప్రదాయ వంగడాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. నేల సారాన్ని కాపాడుకోకుండా విచ్చలవిడిగా పంటలు సాగుచేస్తే పొలాలు ఎడారులవుతాయని చెప్పారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంపై నియంత్రణ ఉండాలన్నారు. అంతేకాకుండా భూగర్భ జలాల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

70 శాతానికిపైగా భూభాగంలో కరువు పరిస్థితులు

భారత్‌లో వాతావరణ పరిస్థితిపై 'డౌన్ టు ఎర్త్' సంస్థ విశ్లేషణ



న్యూఢిల్లీ: భారత్‌లోని 718 జిల్లాలకుగాను 500కుపైగా జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని డౌన్ టు ఎర్త్ అనే సంస్థ అంచనావేసింది. భారత్‌లో పర్యావరణ సంబంధ రాజకీయాలు, అభివృద్ధిపై ఈ సంస్థ పరిశోధన చేస్తోంది. భారత్‌లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై డౌన్ టు ఎర్త్ సంస్థ ఒక నివేదిక విడుదలచేసింది. నివేదిక ప్రకారం..

- 718 జిల్లాలకుగాను 500 జిల్లాల్లో అంటే 70శాతానికిపైగా భూభాగంలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి.
- ఈశాన్య భారతం, తూర్పుభారతంలో కొన్ని ప్రాంతాలు, జమ్మూ కశ్మీర్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కోస్తాతీరం సహా దక్షిణ భారతంలోని చాలా ప్రాంతాల్లో మధ్యస్థ/తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి.
- 'ఈసారి రుతుపవనకాలంలో ఆగస్టులో ప్రతి రోజూ కురవాల్సిన వర్షాలు ఆగి ఆగి కొద్దిరోజులు విరామాలు ఇస్తూ పడ్డాయి. ఇలా 'బ్రేక్'లు ఇస్తూ పడిన వర్షాలే భారత్‌లో కరువుకు 70 శాతం కారణం' అని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ చెప్పారు.
- 53 శాతం జిల్లాల్లో మధ్యస్థ కరువు పరిస్థితులు ఉన్నాయి.
- ఈ ఏడాది ఆగస్టులో ఎక్కువ రోజులు వర్షాలు పడనేలేదు. ఏడో తేదీ నుంచి 18వ తేదీ వరకు పొడి వాతావరణం నెలకొంది. ఈనెలలో ఇన్ని రోజులపాటు వర్షాలు లేకపోవడం అనేది 21వ శతాబ్దిలో మూడో అతిపెద్ద విరామంగా రికార్డులకెక్కింది. గత 123 సంవత్సరాల చరిత్రలో ఆగస్టులో ఇంతటి పొడివాతావరణం నెలకొనడమూ ఇదే తొలిసారి.
- '2022 ఏడాదిలో పోలిస్తే 2023లో సాగు విస్తీర్ణం 33 శాతం పెరిగినా.. తగ్గిన వర్షాల కారణంగా దిగుబడి పెరుగుతుందో, తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి' అని క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్ పేర్కొంది.
- ప్రతిఏటా 'సాధారణ వర్షపాతం' కేటగిరీ కింద ఉండే దాదాపు 20 రాష్ట్రాల్లో ఈసారి సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదవడం గమనార్హం.
- 1971–2020 సుదీర్ఘకాలం నుంచి చూస్తే ఈసారి వర్షపాతంలో లోటు ఐదు శాతం కనిపిస్తోంది.

భారతీయులకు 10 లక్షల వీసాల జారీ

- ఈ ఏడాది లక్ష్యాన్ని ఇప్పటికే సాధించామన్న అమెరికా ఎంబసీ
- రంజు సింగ్‌కు 10 లక్షలవ వీసా అందజేసిన రాయబారి గార్సెట్టి
- అమెరికా వీసా దరఖాస్తుల్లో 10% భారతీయులవేనని వెల్లడి



రంజు సింగ్

న్యూఢిల్లీ: భారత్‌లో 2023లో 10 లక్షల నాన్ ఇమిగ్రంట్ వీసాలను జారీ చేయాలన్న లక్ష్యాన్ని అధిగమించినట్లు అమెరికా ఎంబసీ తెలిపింది. ఇదే ఒరవడిని ఇకపైనా కొనసాగిస్తామని ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో తమ కుమారుడి స్నాతకోత్సవానికి హాజరవుతున్న పునీత్ దర్గన్, డాక్టర్ రంజుసింగ్ దంపతులకు 10 లక్షలవ వీసాను గురువారం భారత్‌లో తమ రాయబారి గార్సెట్టి అందజేశారని వెల్లడించింది. లేడీ హార్డింజ్ కాలేజీలో సీనియర్ కన్సల్టెంట్ అయిన డాక్టర్ రంజు సింగ్‌కు 10 లక్షలవ వీసా, ఆమె భర్త పునీత్ దర్గన్‌కు ఆ తర్వాతి వీసా జారీ అయ్యాయని వివరించింది. ప్రపంచదేశాల నుంచి అమెరికాకు అందే మొత్తం వీసా దరఖాస్తుల్లో 10 శాతం భారత్ నుంచే అని ఎంబసీ ప్రకటించింది. మొత్తం విద్యార్థి వీసాల్లో 20 శాతం, హెచ్ అండ్ ఎల్ కేటగిరీ(ఉద్యోగాలు)లో 65 శాతం భారతీయులవేనని కూడా తెలిపింది. 2019 కోవిడ్‌కి ముందు కంటే ఈసారి 20 శాతం ఎక్కువగా వీసాలను జారీ చేసినట్లు పేర్కొంది. గత ఏడాది 12 లక్షల మంది భారతీయులు అమెరికాను సందర్శించారని పేర్కొంది. కోవిడ్ కారణంగా వీసాల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో తలెత్తిన డిమాండ్‌ను అధిగమించేందుకు చెన్నై కాన్సులేట్‌లో అదనపు సిబ్బంది నియామకం, హైదరాబాద్‌లో విశాలమైన భవనంలో నూతన కాన్సులేట్‌ను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా వీసాల జారీ ప్రక్రియను వేగవంతం చేయగలిగామని వివరించింది.

క్లుప్తంగా...

కమి రితా షెర్పా రికార్డు



కఠ్మాండు: నేపాలీ పర్వతారోహకుడు కమి రిటా షెర్పా(53) సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఎనిమిది వేల మీటర్లు పైబడి ఎత్తయిన పర్వత శిఖరాలను 42సార్లు అధిరోహించిన ఘనతను ఆయన సాధించారు. 8 వేల మీటర్లకంటే మించి ఎత్తయిన శిఖరాలను 41 పర్యాయాలు అధిరోహించిన మరో ప్రముఖ నేపాలీ పర్వతారోహకుడు నిమ్స్ పుర్జా పేరిట ఉన్న రికార్డును తాజాగా కమి రిటా బద్దలు కొట్టారు. ప్రపంచంలోని ఎనిమిదో ఎత్తయిన మౌంట్ మనస్లును మంగళవారం ఉదయం కమి రిటా షెర్పా అధిరోహించారని సెవెన్ సమిట్ ట్రెక్స్ అనే పర్వతారోహక సంస్థ తెలిపింది. ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని కమి రిటా 1994లో మొదటిసారి అధిరోహించారు. అది మొదలు ఇప్పటిదాకా 28 సార్లు ఎక్కారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా(రాజస్తాన్): పోటీ పరీక్షల శిక్షణకు నిలయమైన రాజస్తాన్‌లోని కోటాలో మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూపీలోని మహరాజ్‌గంజ్‌కు చెందిన తస్వీర్ ఖాన్(20) తాముంటున్న ఇంట్లో బుధవారం ఉరేసుకుని తనువు చాలించాడని పోలీసులు తెలిపారు. మృతికి కారణంపై దర్యాప్తు చేపట్టామని, ఎటువంటి సూసైడ్ లేఖ దొరకలేదన్నారు. తస్వీర్ తండ్రి, సోదరితోపాటు కృష్ణ విహార్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటర్ పూర్తి చేసిన తస్వీర్‌కు ఇటీవల ఓ ప్రైవేట్ కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ కూడా వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ కావాలన్న తండ్రి సూచన మేరకు ఇంట్లో ఉండే చదువుకుంటున్నాడు. అతడి తండ్రి ఓ కోచింగ్ సెంటర్‌లో కెమిస్ట్రీ బోధిస్తుంటారు. తాజాగా, తస్వీర్ మరణంతో కోటాలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల సంఖ్య 27కు చేరుకుంది.

బిధూరి వివాదం కమిటీకి

న్యూఢిల్లీ: బీఎస్పీ లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీపై బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారాన్ని పార్లమెంట్ హక్కుల కమిటీకి అప్పగించినట్లు స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. డానిష్ అలీని అవమానించిన బీజేపీ ఎంపీ బిధూరిపై చర్యలు తీసు కోవాలంటూ కాంగ్రెస్, డీఎంకే తదితర ప్రతి పక్షాలతోపాటు బీజేపీకి చెందిన నిశికాంత్ దుబే వంటి వారు సైతం స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఓం బిర్లా ఈ ఫిర్యాదులన్నిటినీ బీజేపీ ఎంపీ సునీల్ కుమార్ సింగ్ సారథ్యంలోని హక్కుల కమిటీకి పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఎం.ఎస్. స్వామినాథన్ కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

మృతిచెందారు. భారత్‌లో 1960వ దశకం నుంచి హరిత విప్లవానికి బాటలు వేసి, ఆహారం, పౌష్టికాహార భద్రత కోసం అలుపెరుగని కృషి చేసిన స్వామినాథన్‌ను ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్, రామన్ మెగసెసే, మొట్టమొదటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్ సహా ఎన్నెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. స్వామినాథన్ పార్థివదేహాన్ని చెన్నై తేనాంపేట రత్నానగర్‌లో ఉన్న నివాసం నుంచి గురువారం రాత్రి తరమణిలోని ఎం.ఎస్.స్వామినాథన్ ఫౌండేషన్‌కు తరలించారు. శుక్రవారం అప్తులు, ప్రముఖుల సందర్శనార్థం పార్థివ దేహాన్ని ఇక్కడే ఉంచుతారు. విదేశాల్లో ఉన్న కుమార్తె చెన్నైకి రావాల్సి ఉండడంతో శనివారం స్వామినాథన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సన్నిహితులు చెప్పారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఎం.ఎస్.స్వామినాథన్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. మానవాళి కోసం భద్రమైన, ఆకలికి తావులేని భవిష్యత్తును అందించే దిశగా ప్రపంచాన్ని నడిపించడానికి మార్గదర్శిగా పనిచేశారని స్వామినాథన్‌పై రాష్ట్రపతి ముర్ము ప్రశంసల వర్షం కురిపించారు. స్వామినాథన్ మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మన దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన హరిత విప్లవానికి నాంది పలికారని, కోట్లాది మంది ఆకలి తీర్చారని, దేశంలో ఆహార భద్రతకు పునాది వేశారని కొనియాడారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కృషితో కోట్లాది మంది జీవితాలు మారాయని మోదీ గుర్తుచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు గురువారం స్వామినాథన్ పార్థివదేహానికి అంజలి ఘటించారు. ఆయన మరణం దేశానికి, రైతు ప్రపంచానికి తీరని లోటు అని పేర్కొన్నారు. స్వామినాథన్ మరణం పట్ల తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేశ్ తికాయత్ తదితరులు సంతాపం ప్రకటించారు.



ఢిల్లీలోని కీర్తినగర్ ఫర్నీచర్ మార్కెట్‌లో వడ్రంగి పని చేస్తున్న రాహుల్

వడ్రంగులతో రాహుల్ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలోని కీర్తినగర్ ఫర్నీచర్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వడ్రంగులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి కొన్ని రకాల కలప సామాగ్రిని తయారు చేసేందుకు ప్రయత్నించారు. వడ్రంగులు కుటుంబ పోషణ కోసం కష్టపడి పని చేస్తున్నారని, వారిలో గొప్ప కళా నైపుణ్యం ఉందని రాహుల్ ప్రశంసించారు. అందమైన కలప సామాగ్రి తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. వారి నుంచి నైపుణ్యాలు నేర్చుకొనేందుకు తాను ప్రయత్నించానని, కొంతవరకు సఫలమయ్యానని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర కొనసాగుతూనే ఉందని స్పష్టం చేశారు.

కోలుకుంటున్న 'ఉజ్జయిని' బాలిక

ఉజ్జయిని: మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురై అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో సాయం కోరుతూ తిరుగాడిన బాలిక కోలుకుంటోంది. ఇండోర్‌లోని మహారాజా టుకోజీరావ్ హోల్కార్ మహిళా ఆస్పత్రిలో వైద్య నిపుణుల బృందం ఆమెకు వైద్య చికిత్సలు అందిస్తోంది. పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాలను చెప్పలేకపోతోందని, అయితే ఆమెది సత్నా జిల్లా అని తెలుస్తోందని కౌన్సిలింగ్ నిపుణులు గురువారం తెలిపారు. బాధిత బాలిక పరిస్థితి కొద్దికొద్దిగా మెరుగవుతోందని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ సభ్యురాలు డాక్టర్ దివ్యా గుప్తా తెలిపారు. ఈ అంశంపై రాజకీయ పార్టీల నేతలు సున్నితత్వం ప్రదర్శించాలని, బాధిత బాలిక చికిత్స పొందే ఆస్పత్రి వద్ద గుమికూడడం వంటివి చేయరాదని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో కోరారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి భరత్ సోని అనే రిక్షావాలాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైమ్ సీన్ రిక్రియేషన్ కోసం జీవన్ ఖేది ప్రాంతానికి గురువారం పోలీసులు తీసుకెళ్లగా పారిపోయే ప్రయత్నంలో గాయపడ్డాడు. పన్నెండేళ్ల బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో రెండున్నర గంటలపాటు సాయం కోరుతూ ఇల్లిల్లూ తిరిగినా పట్టించుకోకపోవడం అమానవీయమని ఎస్పీ సచిన్ శర్మ అన్నారు. 'నా వెనుక ఎవరో వస్తున్నారు. నేను ప్రమాదంలో ఉన్నాను' అని ప్రాధేయపడిందే తప్ప ఆమె డబ్బులు అడగలేదన్నారు. 'కొందరు ఛీత్కరించినా, కొందరు రూ.50, రూ.100 వరకు ఇచ్చారు. అదేదారిలో ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది కొంత డబ్బు, బట్టలు ఇచ్చారు. చివరికి ఆశ్రమంలో ఆశ్రయం పొందింది. వారామెను దగ్గరకు తీసి, మాకు సమాచారం అందించారు' అని ఎస్పీ వివరించారు..

నిరసనలతో దద్దరిల్లిన ఇంఫాల్

- డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విధ్వంసం
- రెండు వాహనాలకు ఆందోళనకారులు నిప్పు

ఇంఫాల్: మణిపూర్‌లో యువ జంట హత్యతో మొదలైన నిరసనలు గురువారం సైతం కొనసాగాయి. ఆందోళనకారులు ఇంఫాల్ వెస్ట్‌లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంపై దాడికి దిగారు. అక్కడున్న రెండు కార్లకు నిప్పుపెట్టారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బుధవారం రాత్రి పలు చోట్ల నిరసనకారులు భద్రతా బలగాలపై దాడులకు దిగారు. దీంతో, బలగాలు టియర్ గ్యాస్‌ను ప్రయోగించాల్సి వచ్చిందని అధికారులు చెప్పారు. పోలీసు వాహనానికి నిప్పుపెట్టడంతోపాటు పోలీసు వద్ద ఉన్న ఆయుధాన్ని లాక్కెళ్లారు. థౌబల్ జిల్లా ఖోంగ్‌జమ్‌లో బీజేపీ కార్యాలయానికి దుండగులు నిప్పుపెట్టారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్ ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. గురువారం రాత్రి సీఎం బీరేన్ సింగ్ పూర్వీకుల ఇంటిపై దాడికి జరిగిన ప్రయత్నాన్ని పోలీసులు వమ్ము చేశారు.

మా వాళ్ల మృతదేహాలు ఎక్కడున్నాయో గుర్తించండి

దుండగుల చేతుల్లో దారుణ హత్యకు గురైన తమ పిల్లల మృతదేహాల జాడ చెబితే అంత్యక్రియలు జరుపుకుంటామని వారి తల్లిదండ్రులు పోలీసులను కోరారు. మెయితీ వర్గానికి చెందిన యువతి, యువకుడు జూన్‌లో గుర్తు తెలియని దుండగుల చేతుల్లో హత్యకు గురి కావడం, వారి ఫొటోలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడం తెలిసిందే. ఈ హత్య ఘటన మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలకు కారణమైంది. మెయితీల ఆచారం ప్రకారం..అంతిమ సంస్కారాలు జరపడానికి మృతులు ధరించిన దుస్తులకు సంబంధించిన చిన్న గుడ్డ ముక్కయినా ఉండాలి. అంత్యక్రియలు జరిపేవరకు వారి ఫొటోల వద్ద మృతుల తల్లులు అగరొత్తులు, క్యాండిల్ వెలిగిస్తూ రోజూ ఆహారం నివేదన చేస్తూ ఉండాలి. వారి లేని లోటు ఎవ్వరూ పూడ్చలేరు. కనీసం వారికి తగు గౌరవంతో అంత్యక్రియలు జరపాలనుకుంటున్నామని యువతి తండ్రి హిజామ్ కులజిత్ చెప్పారు. తాజాగా, సీబీఐ దర్యాప్తుతోనయినా తమ కోరిక నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

మణిపూర్‌కు శ్రీనగర్ ఎస్ఎస్‌పీ బల్వాల్ బదిలీ

న్యూఢిల్లీ: ఉగ్ర సంబంధ కేసులను డీల్ చేయడంలో సమర్థుడిగా పేరున్న శ్రీనగర్ సీనియర్ ఎస్పీ రాకేశ్ బల్వాల్‌ను కేంద్రం మణిపూర్‌కు బదిలీ చేసింది. మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, శాంతిభద్రతలు దారుణంగా దెబ్బతినడంతో కేంద్రం ఈ చర్య తీసుకుంది. 2012 ఐపీఎస్ అధికారి అయిన రాకేశ్ బల్వాల్‌ను డిసెంబర్ 2021లో అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు మార్చారు. తాజాగా ఆయన్ను మణిపూర్ కేడర్‌కు మారుస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన హోం వ్యవహారాల శాఖ ప్రతిపాదనకు నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మణిపూర్‌లో ఆయన కొత్త బాధ్యతలను చేపడతారని తెలిపింది. జమ్మూలోని ఉధంపూర్‌కు చెందిన బల్వాల్ మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌కు 2017లో సీనియర్ ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది.

రూ.18 లక్షల నగదును చెద పురుగులు తినేశాయి



లక్నో: బ్యాంకు లాకర్‌లో దాచిన రూ.18 లక్షల నగదును చెద పురుగులు తినేసిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని మొరాబాద్‌లో జరిగింది. మొరాదాబాద్‌కు చెందిన మహిళ అల్కా పాఠక్ తన కుమార్తె పెళ్లి కోసం పొదుపు చేసిన రూ.18 లక్షల నగదును గత ఏడాది అక్టోబర్‌లో బ్యాంకు ఆఫ్ బరోడా శాఖలోని లాకర్‌లో భద్రపర్చింది. లాకర్ అగ్రిమెంట్‌ను నవీకరించుకోవాలని, కేవైసీ వివరాలు ఇవ్వాలని ఇటీవల బ్యాంకు సిబ్బంది ఆమెకు ఫోన్ చేసి చెప్పారు. అల్కా పాఠక్ బ్యాంకుకు వెళ్లి తన లాకర్‌ను తెరిచి చూసు కోగా, చెత్తాచెదారమే కనిపించింది. నగదును చెదపురుగులు కొరికేసి ముక్క లు ముక్కలు చేశాయి. మొత్తం సొమ్మంతా పనికి రాకుండా పోయింది. ఈ ఘటనపై బ్యాంకు సిబ్బంది స్పందించారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేశామని అన్నారు. అల్కా పాఠక్‌కు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఆర్‌బీఐ తాజా నిబంధనల ప్రకారం.. బ్యాంకు లాకర్లలో నగదు భద్రపర్చడానికి వీల్లేదు. నగలు, డాక్యుమెంట్లు మాత్రమే భద్రపర్చుకోవాలి.

స్వదేశీ జలాంతర్గామిని తయారుచేసిన తైవాన్



కవోసియంగ్(తైవాన్): తరచూ నావికాదళాలతో తమ వైపు దూసుకొస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడే చైనాను అడ్డుకునేందుకు తైవాన్ తొలిసారిగా జలాంతర్గామిని తయారుచేసుకుంది. ప్రస్తుతం ఈ సబ్‌మెరైన్ పరీక్ష దశలో ఉంది. పరీక్షల్లో విజయవంతమై తైవాన్ అమ్ములపొదిలో చేరితే ఆ దేశ సైనిక స్థైర్యం మరింత ఇనుమడించనుంది. 'గతంలో దేశీయంగా జలాంతర్గాముల తయారీ అనేది అసాధ్యం. కానీ ఈరోజు స్వదేశీ జలాంతర్గామి మీ కళ్ల ముందు ఉంది' అని నౌకాతయారీకేంద్రంలో నూతన జలాంతర్గామి ఆవిష్కరణ కార్యక్రమంలో తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్–వెన్ వ్యాఖ్యానించారు. 'దేశ పరిరక్షణకు ప్రతినబూనిన మా సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం ఈ సబ్‌మెరైన్. వ్యూహాలు, యుద్ధతంత్రాల్లో నావికాదళం సన్నద్ధతలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది' అని ఆమె అన్నారు. కొత్త జలాంతర్గామికి హైకున్ అని పేరుపెట్టారు. చైనా ప్రాచీనగాథల్లో హైకు అంటే అద్వితీయమైన శక్తులు గలది అని అర్థం. హార్బర్, సముద్ర పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాక నావికాదళానికి అప్పగిస్తారు. 2027 ఏడాదికల్లా రెండు సబ్‌మెరైన్‌లను నిర్మించి దళాలకు ఇవ్వాలని తైవాన్ యోచిస్తోంది. తైవాన్ సమీప సముద్ర జలాల్లో తరచూ నేవీ, ఎయిర్‌ఫోర్స్ యుద్ధవిన్యాసాలు చేస్తూ ఉద్రిక్త పరిస్థితులను కల్పిస్తున్న చైనాకు ఈ పరిణామం మింగుడుపడనిదే.

ట్రాఫిక్‌లో కదిలేలోపే పిజ్జా డెలివరీ వచ్చేసింది

బెంగళూరు: ఉద్యానవనాల నగరంగా, ఐటీకి తలమానికంలా పేరు తెచ్చుకున్న బెంగళూరు తరచూ భారీ ట్రాఫిక్ జామ్‌లతో పరువుమాస్తున్న సంగతి తెల్సిందే. ట్రాఫిక్‌లో కారులో చిక్కుకున్న వారు వెంటనే ఎటూ కదల్లేని పరిస్థితి ఉందని తెలిపే మరో ఘటన తాజాగా బెంగళూరులో వెలుగుచూసింది. దీనికి సంబంధించిన వివరాలను రిషి అనే డిజైన్ ఇంజనీర్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్‌చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. బుధవారం రిషి బెంగళూరు అవుటర్ రింగ్ రోడ్డుపై భారీ ట్రాఫిక్‌లో కారులో స్నేహితులతో చిక్కుకుపోయాడు. ఎలాగూ ముందుకు కదిలే అవకాశం లేదనుకుని తినడానికి ఆన్‌లైన్‌లో పిజ్జా ఆర్డర్‌చేశారు. 'నిర్ణీత 30 నిమిషాల డెలివరీ సమయంలోపే మా పిజ్జా మాకు వచ్చేసింది. అద్భుతం. డెలివరీ బాయ్ బైక్ మీద చకచకా ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ మమ్మల్ని చేరుకున్నాడు' అంటూ రిషి ఆ వీడియోలో ఆనందం వ్యక్తంచేశారు. ఈ వీడియోను ఆన్‌లైన్‌లో ఇప్పటికే లక్షలాది మంది చూసి షేర్‌చేశారు.

హృదయం.. పదిలమేనా?

లబ్.. డబ్.. లబ్.. డబ్.. శబ్దంలో తేడా వస్తోంది. మనిషి శరీరంలో కీలక అవయవమైన హృదయం పదిలమేనా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రాణాన్ని కాపాడటంలో నిరంతరం అలుపు లేకుండా, విరామం ఎరుగకుండా పనిచేస్తున్న గుండెను పట్టించుకోవడంలో మనిషి నిర్లక్ష్యం చేస్తున్నాడు. దాని పనితీరుకు సహకరించకుండా మితిమీరి తింటూ, కష్టపడకుండా దానికి తీవ్ర శ్రమ కల్పిస్తున్నాడు. ఫలితంగా రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడి, గుండె కొట్టుకోవడం ఆపేస్తోంది. మనిషి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నాడు. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో..



న్యూస్‌రీల్

స్వామినాథన్ మృతి తీరని లోటు: మంత్రి గంగుల



కరీంనగర్: భారత హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. మన దేశానికి తన పరిశోధనలతో ఎంతో సేవ చేశారని, ఆయన కృషితో నేడు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సాధించిన ఘనత స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తోందని కొనియాడారు. స్వామి నాథన్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశభక్తికి ప్రతిరూపం భగత్ సింగ్



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ చరిత్ర చైతన్యవంతమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ పట్టణంలోని భగత్‌నగర్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. దేశభక్తికి ప్రతిరూపం భగత్ సింగ్ అన్నారు. 23 ఏళ్ల వయసులో ఉరితాడును ముద్దాడిన విప్లవ వీరుడు, దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన భరత మాత ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్, నాయకులు కటకం లోకేశ్, నాంపల్లి శ్రీనివాస్, బల్బీర్ సింగ్, మోతె గంగారెడ్డి, కెంచ శేఖర్, చాడ ఆనంద్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రిసోర్స్‌పర్సన్లు

కరీంనగర్: మెప్మా రిసోర్స్‌పర్సన్లకు గతంలో రూ.4 వేల గౌరవ వేతనం ఉండగా ఈ నెల 26న రూ.2 వేలు పెంచి, రూ.6 వేలుగా నిర్ణయించడం పట్ల రిసోర్స్ పర్సన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షబానా బేగం, ఉపాధ్యక్షురాళ్లు శంకరి, రమ, కోశాధికారి సునీత, కార్యదర్శి సరళ, లక్ష్మి, చంద్రకళ, సరిత, అనిత, లలిత, రాధ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

రామడుగు: మండలంలోని పందికుంటపల్లి గ్రామ పంచాయతీ పరిధి కుర్మపల్లిలో మొగుళ్ల సతీశ్‌కు చెందిన 20 గొర్రెలు గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో మేతకు వెళ్లిన గొర్రెలపై అకస్మాత్తుగా పిడుగు పడటంతో చనిపోయినట్లు పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పరిహారం అందించి, ఆదుకోవాలని కోరాడు. గొర్రెలు మృతి చెందిన విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాడు.



టీచర్ల ర్యాంకుల్లో గోల్‌మాల్!

జీహెచ్‌ఎం పదోన్నతుల్లో కొన్ని పొరపాట్లు

సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
734	75	చూపించలేదు
736	182	158
743	217	175
762	300	194

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2,163
జగిత్యాల	25	685	2,191
జగిత్యాల	31	334	681
సిరిసిల్ల	01	430	507
సిరిసిల్ల	02	221	568
సిరిసిల్ల	06	683	751

- 317 జీవో టైంలో ఒకలా, పదోన్నతులు, బదిలీల్లో మరోలా!
- పొరపాటైతే సవరణకు, స్కాం అయితే విచారణకు టీచర్ల డిమాండ్
- తప్పుడు సీనియారిటీ చూపించినవారి పదోన్నతి రద్దు
- 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

విద్యాశాఖ చేపట్టిన పదోన్నతులు, బదిలీలు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన విద్యాశాఖ కమిషనర్ దేవసేన చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇది మరవరకముందే.. మరిన్ని వివాదాలు విద్యాశాఖను చుట్టుముడుతున్నాయి. ఓవైపు పదోన్నతులు, బదిలీల్లో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమయ్యేందుకు కారణమవుతోంది. తాజాగా నిర్మల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓస్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లేకున్నా.. పదోన్నతి పొందిన విషయమై ఆర్జేడీకి బాధిత టీచర్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, పొరపాటు గ్రహించిన అధికారులు పదోన్నతి రద్దు చేసి, అర్హుడైన ఉపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు. సీనియారిటీలో వెనకబడి ఉన్నా.. పదోన్నతి ఎలా వచ్చిందో 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని సదరు టీచర్‌ను ఆర్జేడీ ఆదేశించారు.



జగిత్యాల డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పదోన్నతుల్లో ప్రామాణికం..

2021లో 317 జీవో అమలులో భాగంగా పలువురు టీచర్లను సీనియారిటీ ఆధారంగా వివిధ జిల్లాలకు కేటాయించారు. అప్పుడున్న లిస్టులో డీఎస్సీ ర్యాంకులు స్థానికత నిర్ధారణలో కీలకంగా వ్యవహరించాయి. తాజాగా బదిలీలు, పదోన్నతుల్లోనూ అధికారులు వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే, చాలా జిల్లాల్లో ఈ ర్యాంకులు 317 జీవో సమయంలో ఒకలా, ప్రస్తుతం మరోలా ఉండటం చూసి తోటి టీచర్లు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో ర్యాంకులకు, 317 జీవో సందర్భంగా జరిగిన కేటాయింపుల సమయంలో ఉన్న ర్యాంకుల్లో వ్యత్యాసాలు ఎందుకు వచ్చాయి? అన్న విషయం చర్చానీయాంశంగా మారింది. ముఖ్యంగా కరీంనగర్, పెద్దపల్లికి సంబంధించిన బదిలీల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకున్నా.. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మాత్రం టీచర్ల ర్యాంకుల విషయంలో గతానికి, ప్రస్తుతానికి భారీ వ్యత్యాసాలు వెలుగుచూశాయి. దీనిపై అర్హులైన ఉపాధ్యాయులంతా అభ్యంతరం తెలియజేస్తూ.. తప్పులు సవరించాలని డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉన్నతాధికారులు ఏం చెబుతారో?

317 జీవో అమలు సందర్భంగా స్థానికత విషయంలో టీచర్లకు అనేక చిక్కులు ఎదురయ్యాయి. ఆ సమయంలో డీఎస్సీ ర్యాంకులను కూడా ప్రామాణికంగా తీసుకుని జిల్లాలకు కేటాయించారు. తాజా పదోన్నతులు, బదిలీలకూ అవే కీలకం. ఈ రెండింటిలో భారీ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోన్న వేళ.. ఏ ర్యాంకులు నిజం? అన్న ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానమివ్వాల్సి ఉంది. ఒకవేళ 317 బదిలీల్లో ఉపయోగించిన ర్యాంకులే పొరపాటైతే.. జిల్లాలకు జరిగిన టీచర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగి ఉంటాయని టీచర్లు అనుమానిస్తున్నారు. లేదా ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల్లో చూపించిన ర్యాంకుల్లో తప్పులు ఉంటే.. సవరించి న్యాయం చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు వివరాలిచ్చారా?

317 జీవో సమయంలో విద్యాశాఖ టీచర్ల ర్యాంకులు పొందుపరిచింది. తాజా పదోన్నతులు, బదిలీల్లో మాత్రం హెచ్‌ఆర్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో స్వయంగా నమోదు చేసుకున్న ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందువల్ల ఈ పొరపాట్లు, వ్యత్యాసాలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు నమోదు చేసిన టీచర్లపై, సదరు సమాచారాన్ని ధ్రువీకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నైట్‌ఫుడ్ బజార్ రెడీ



శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేస్తున్న నైట్ ఫుడ్ బజార్

- నగరంలో నయా కల్చర్
- నిమజ్జనం తరువాత మరూ!
- స్మార్ట్ సిటీలో భాగంగా నిర్మాణం

కరీంనగర్ కార్పొరేషన్:

నగరవాసులను ఊరిస్తున్న నైట్‌ఫుడ్ బజార్ అందుబాటులోకి రావడానికి సిద్ధమవుతోంది. శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేస్తున్న నైట్ బజార్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తికాగా, విద్యుత్‌కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. వినాయక నిమజ్జనం తర్వాత ఫుడ్ బజార్‌ను ప్రారంభించేందుకు నగరపాలకసంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్మార్ట్‌సిటీ నిధులతో..

- సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల స్మార్ట్ సిటీ నిధులతో బజార్ నిర్మాణాన్ని చేపట్టారు. విద్యానగర్ నుంచి మల్కాపూర్ ప్రధాన రోడ్డు వెంట ఏర్పాటు చేస్తున్న ఈ ఫుడ్ బజార్ ప్రజలను ఆకట్టుకునేలా అన్ని హంగులతో రూపుదిద్దుకొంటోంది.
- రాత్రివేళల్లో నగర ప్రజలకు శుచి, రుచితో కూడుకున్న ఆహారపదార్థాలు ఈ ఫుడ్ బజార్‌లో అందించనున్నారు. ఇందుకోసం నాలుగు నాన్‌వెజ్, నాలుగు వెజ్ స్టాల్స్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.
- వీటితో పాటు ఫుట్‌పాత్‌పై కూర్చొని తినేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు చేశారు. లైటింగ్ సిస్టం, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి సదుపాయం, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు ఏర్పాటు చేశారు.
- ఫుడ్ బజార్ అంతా ఆకర్షణీయ రంగులతో ఆధునిక లైటింగ్‌తో తీర్చిదిద్దారు. కాగా టైల్స్, స్టాల్స్, సీటింగ్, లైటింగ్ నిర్మాణాలు పూర్తయ్యాయి.
- వినాయక నిమజ్జనం తరువాత నైట్ ఫుడ్ బజార్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.
- ఇప్పటికే నగరంలో కేబుల్ బ్రిడ్జి, వివిధ కూడళ్లు పర్యాటక కేంద్రాలుగా మారగా, నైట్ ఫుడ్ బజార్ కూడా నగరవాసులకు మరో పర్యాటక కేంద్రంగా మారనుంది.
- ఇదిలాఉంటే శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన నైట్ ఫుడ్ బజార్‌కు నగరవాసుల నుంచి వచ్చే ఆదరణ ఆధారంగా కేబుల్ బ్రిడ్జి సమీపంలో మరో బజార్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

ఆకర్షణీయంగా..



నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేస్తున్న నైట్ ఫుడ్ బజార్ ఆకర్షణీయంగా ఉంటుంది. ప్లాస్టిక్ రహితంగా నైట్ ఫుడ్ బజార్ పరిశుభ్రంగా ఉంటుంది. ప్రజలు రాత్రి వేళల్లో కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో అవసరమైన ఫుడ్‌ను తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నం. నాలుగైదు రోజుల్లో నైట్ ఫుడ్ బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– యాదగిరి సునీల్‌రావు, నగర మేయర్

హ్యాపీ బర్త్‌డే

కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు బర్త్‌డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగరంలోని మీసేవ కార్యాలయంలో బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి మేయర్ సునీల్‌రావు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మేయర్ సునీల్‌రావుకు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్కను అందించి మంత్రి నుంచి మేయర్ ఆశీర్వాదం తీసుకున్నారు.

– కరీంనగర్ కార్పొరేషన్



మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న మేయర్ సునీల్‌రావు

అభివృద్ధిపై చర్చకు రెడీ

- బండి సంజయ్ సవాల్ స్వీకరిస్తున్నాం
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విసిరిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామని, తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మి, కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయాలలో ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. నాలుగేళ్లలో ఎంపీగా పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఒక్కరోజు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని డబ్బుల వసూళ్లకు పాల్పడడంతోనే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, భాస్కర్‌రావు, గాలి రవియాదవ్ పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

ఊడ్చేదెవరు.. కడిగేదెవరు?

- స్వీపర్లు లేరు.. స్కావెంజర్లు లేరు
- ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- చేతులెత్తేస్తున్న జీపీ పారిశుధ్య సిబ్బంది
- ప్రైవేటు వ్యక్తులను నియమించుకుంటున్న టీచర్లు
- ఉమ్మడి జిల్లాలో దుస్థితి

'ప్రభుత్వ పాఠశాలలకు రూ.వేల కోట్లు కేటాయించి, మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో స్వీపర్లు, స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలు అపరిశుభ్రతకు చిరునామాగా మారాయి. ఈ ఫొటోలో కనిపిస్తున్నది కరీంనగర్‌లోని మంకమ్మతోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మూత్రశాలలు. కడిగేవారు లేకపోవడంతో చెత్తతో నిండిపోయి, నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మారుమూల మండలాల్లో ఉన్న స్కూళ్ల స్థితి ఏమిటో ఊహించుకోవచ్చు.'



మంకమ్మతోట బాలికల ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రంగా మూత్రశాలలు

కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మొత్తం 2,320 ఉన్నాయి. వీటిల్లో 2.32 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని స్కూళ్లలో మాత్రమే అటెండర్లు, స్వీపర్లు, పార్ట్‌టైం స్వీపర్లు ఉండగా చాలాచోట్ల సిబ్బంది కొరత ఉండేది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా 2015లో అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి, రూ.2 వేల నుంచి రూ.2,500 వేతనం ఇస్తున్నాయి. 2020 తర్వాత ఉమ్మడి జిల్లాలోని 5,432 మంది స్కావెంజర్లు, స్వీపర్లను తొలగిస్తూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పారిశుధ్య సిబ్బందికి పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యత అప్పగించారు. కానీ, అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. ఈ తరుణంలో పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నెలలో ఒకటి, రెండుసార్లే..

కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని, సర్పంచ్‌లు, కౌన్సిలర్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తేనే నెలలో ఒకటి, రెండుసార్లు మాత్రమే పాఠశాలల ఆవరణ, మైదానాలు శుభ్రం చేయిస్తున్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను పట్టించుకునేవారు కరువయ్యారు. పలు స్కూళ్లలో టీచర్లే తలా కొంత డబ్బు పోగేసుకొని, పారిశుధ్య సిబ్బందిని నియమించుకుంటున్న దుస్థితి నెలకొంది.

మూడేళ్లుగా తీరని సమస్య..

మన ఊరు–మన బడి పథకానికి ఎంపికైన పాఠశాలల్లో నీటి సంపులు, విద్యుదీకరణ చేపడుతున్నారు. ఇక్కడ కూడా మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసేవారు కనిపించడం లేదు. దీనిపై పలుమార్లు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశాల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మూడేళ్లుగా సమస్య తీరడం లేదు. మరోవైపు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు, ఉన్నత పాఠశాలల్లో టైం పేస్కేల్‌పై పని చేస్తున్న కార్మికులు కొన్ని రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఫలితంగా పంచాయతీ కార్మికులపై ఆధారపడిన ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సమస్య మరింత జటిలంగా మారింది. అధికారులు స్పందించి స్వీపర్లు, స్కావెంజర్లు, నైట్ వాచ్‌మన్లను నియమించాలని టీచర్లు కోరుతున్నారు.

వెంటనే నియమించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, స్కావెంజర్లను తొలగించడం బాధాకరం. స్కూళ్లలో చెత్తాచెదారం తొలగించేవారు, మరుగుదొడ్లు కడిగేవారు లేరు. ప్రభుత్వం వెంటనే స్వీపర్లు, స్కావెంజర్లను నియమించాలి.

– టేకుమల్ల సమ్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్కూల్ స్వీపర్స్, స్కావెంజర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)

చాలా ఇబ్బందిగా ఉంది

పాఠశాలల శుభ్రత బాధ్యత గ్రామ పంచాయతీ సిబ్బందికి బాధ్యత అప్పగించినా వారు స్కూల్ వైపు కన్నెత్తి చూడటం లేదు. పాఠశాల ఆవరణలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రెండు, మూడు రోజులకోసారి ప్రైవేట్ వ్యక్తులతో శుభ్రం చేయించాల్సి వస్తోంది. విద్యార్థులు, టీచర్లందరం కలిసి శుభ్రం చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

– నర్సింగరావు, ప్రధానోపాధ్యాయుడు

ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ



కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగిన మైనారిటీ గురుకుల విద్యార్థుల ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి జిల్లాలోని 19 మైనారిటీ గురుకులాల నుంచి దాదాపు 800 మంది పాల్గొనగా వీరు అండర్–17 విభాగంలో 11, అండర్–14 విభాగంలో 3 బహుమతులు సాధించి, ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ మంకమ్మతోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్–16 సబ్ జూనియర్ బాలబాలికలకు జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సర్వర్ తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలతో మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలన్నారు. పోటీల్లో రాణించిన వారిని ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2 వరకు బొల్లారంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 62810 68475 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నల్లా సంపులో పడి వ్యక్తి మృతి

మానకొండూర్: ప్రమాదవశాత్తు నల్లా సంపులో పడి, ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన మంద రాజయ్య(45) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి అధికంగా మద్యం తాగి, ఇరుగుపొరుగు వారిని దూషిస్తున్నాడని బంధువులు చెప్పగా అతని భార్య భారతి వీధుల వెంట గాలించింది. అయినా అతని ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఇంటి వెనకాల పాత నల్లా సంపులో చూడగా రాజయ్య మృతదేహం కనిపించింది. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2న జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ ఖోఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–17 బాలబాలికల జిల్లాస్థాయి ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి పోతన శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 16 మండలాలకు చెందిన జట్లు ఉదయం 9 గంటలకు ధువపత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు.

జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్: ఈ నెల 25, 26 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలను మొగలిపాలెంలో నిర్వహించారు. అండర్–17, 14 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి, జిల్లాస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 బాలుర విభాగంలో కబడ్డీలో సాయికుమార్, చైతన్య, బాలాజీ, బాలికల విభాగంలో సాయిసుధ, వర్షిత, ఖోఖోలో అశ్విత, నజీమా, వాలీబాల్‌లో దేవేందర్, చైతన్య, 100 మీటర్ల రన్నింగ్‌లో విష్ణువర్ధన్, షాట్‌పుట్‌లో సాయికుమార్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్–14 బాలుర విభాగంలో కబడ్డీలో చెన్నకేశవ, జగదీశ్, దినేశ్, ఖోఖోలో రోషన్, బాలికల విభాగంలో అపూర్వ, యశస్విని, సాయి శరణ్య ఎంపికైనట్లు తెలిపారు. వీరిని సర్పంచ్ సుస్మితారెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియా రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేముల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

గణేశ్ నిమజ్జనంలో తప్పిపోయిన బాలుడు



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం వినాయక నిమజ్జన వేడుకల్లో గుర్తు తెలియని ఐదేళ్ల బాలుడు తప్పిపోయాడు. స్థానిక బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్ బాలుడిని పోలీసులకు అప్పగించాడు. బాలుడి తనకు సంబంధించిన వివరాలు చెప్పలేకపోతున్నాడు. బాలునికి సంబంధించిన వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలని పోలీసులు కోరుతున్నారు.

హృదయమా.. పదిలమేనా?

- జిల్లాలో పెరుగుతున్న గుండె జబ్బుల బాధితులు
- ప్రతినెలా 100కు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు.. 500కు పైగా స్టంట్‌లు
- 20 నుంచి 40 ఏళ్ల వయసు వారిలోనూ సమస్యలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- నేడు వరల్డ్ హార్ట్ డే



కరీంనగర్‌టౌన్: గుండె లయ తప్పుతోంది. మనిషి శరీరంలో కీలక అవయవమైన హృదయం పదిలమేనా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రాణాన్ని కాపాడటంలో నిరంతరం అలుపు లేకుండా పనిచేస్తున్న గుండెను పట్టించుకోవడంలో మనిషి నిర్లక్ష్యం చేస్తున్నాడు. దాని పనితీరుకు సహకరించకుండా మితిమీరి ఆహారం తింటూ, కష్టపడకుండా దానికి తీవ్ర శ్రమ కల్పిస్తున్నాడు. ఫలితంగా రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడి. గుండె కొట్టుకోవడం ఆపేస్తోంది. మనిషి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నాడు. నేడు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ కారణం..

20 ఏళ్ల క్రితం వరకు కరీంనగర్ జిల్లాలో గుండెకు సంబంధించిన సమస్యలున్నవారు అంతగా కనిపించేవారు కాదు. కానీ, ప్రస్తుత కంప్యూటర్ యుగంలో తెలియకుండానే మనిషిని హార్ట్ ఎటాక్ దెబ్బతీస్తోంది. ఆహారంలో మార్పులు, కాలగమనంలో తేడా వల్ల మనిషి జీవనశైలి దారితప్పి, గుండె జబ్బులు వస్తున్నాయని వైద్యులు అంటున్నారు. జిల్లాలో 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారికీ గుండెపోటు వస్తోందని చెబుతున్నారు. గుండె సమస్యలకు గురవుతున్న వారిలో 35 శాతం మందికి మధుమేహం, మరో 25 శాతం మందిలో అధిక రక్తపోటు, 20 శాతం మందిలో చెడు కొలెస్ట్రాల్ కారణమని పేర్కొంటున్నారు.

పోస్టు కోవిడ్ సమస్యలూ తోడు

మద్యం, ధూమపానం తదితర అలవాట్లతోపాటు గతంలో కోవిడ్ బారిన పడినవారిని గుండె సమస్యలు వేధిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. 10 నుంచి 15 శాతం ఒత్తిడి కారణంగా చెబుతున్నారు. రక్తనాళాల్లో 50 నుంచి 60 శాతం పూడికలు ఉన్నా సాధారణంగానే కనిపిస్తారని, ఒత్తిడికి గురైనప్పుడు అకస్మాత్తుగా హార్ట్‌ఎటాక్ వస్తుందని అంటున్నారు.

గుండె వైద్యానికి కేరాఫ్.. కరీంనగర్

కరీంనగర్ జిల్లా కేంద్రం గుండె వైద్యానికి కేరాఫ్‌గా మారింది. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరుగెత్తాల్సి వచ్చేది. మార్గమధ్యలో ఏం జరిగినా దిక్కులేని పరిస్థితి. కానీ, గత ఐదేళ్లలో కరీంనగర్ గుండె జబ్బుల వైద్యంలో నంబర్ వన్‌గా ఎదిగింది. ఉత్తర తెలంగాణలో ఏ జిల్లాలో లేనంతగా ప్రతినెలా 100కు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు, 500కు పైగా స్టంట్‌లు వేస్తున్నారు. ప్రతిమ, చల్మెడ మెడికల్ కళాశాలలు, మెడికవర్, అపోలో రీచ్, సన్‌షైన్, రెనీ, మురుగన్ ఆస్పత్రుల్లో గుండె వైద్య సేవలు అందిస్తున్నారు.

ఈసీజీ తీయించుకోవాలి



చాలా మందికి గుండెలో నొప్పి వస్తున్నప్పటికీ అది గ్యాస్టిక్ సమస్య అనుకుంటూ నిర్లక్ష్యం చేస్తారు. వైద్యుడిని సంప్రదించకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. గ్యాస్ట్రిక్ సమస్యలాగానే గుండె జబ్బు ఇబ్బంది పెడుతుంది. ఈసీజీ తప్పనిసరిగా తీయించుకోవాలి. గోల్డెన్ అవర్‌లో మేము ప్రాణాలు కాపాడగలం. అనుమానం వస్తే వెంటే వైద్యుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ సదాశివ్ తమగొండ, కార్డియోథొరాసిక్ సర్జన్

ఏబీసీ సక్రమంగా ఉండాలి



గుండె జబ్బులు రావొద్దంటే జాగ్రత్తలు తీసుకోవాలి. బీపీ పెరగొద్దంటే ఆహారంలో ఉప్పు తగ్గించాలి. ఏబీసీ సక్రమంగా ఉండాలి. ఏ అంటే హెచ్‌బీఏ1సీ. ఇది 7 శాతానికి మించకూడదు. బీ అంటే బీపీ. ఇది 120/80 ఉండాలి. సీ అంటే చెడు కొలెస్ట్రాల్. ఇది 70 (ఎంజీ/డీఎల్) మించకూడదు. అధిక క్యాలరీలు, కొవ్వు శాతం తక్కువ ఉండే ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ కొండపాక కిరణ్‌కుమార్, కార్డియాలజిస్టు

ప్రజల ఐక్యతకు ఉద్యమించిన భగత్ సింగ్







భగత్ సింగ్ విగ్రహాలు, చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు

కరీంనగర్: బ్రిటిష్ పాలన నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి 23 ఏళ్ల చిరుప్రాయంలో ప్రాణాలర్పించిన గొప్ప యోధుడు భగత్ సింగ్ అని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. ఆయన విగ్రహాన్ని పార్లమెంటులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా కరీంనగర్ భగత్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. స్వార్థ రాజకీయాలను విఫలం చేసి, ప్రజల ఐక్యతకు జీవితాంతం ఉద్యమించారని కొనియాడారు. నేడు పాలకులు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. వెంటనే పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. నాయకులు నరేశ్, రాజ్‌కుమార్, బాలు, అరవింద్, విజయ్, అజయ్, శ్రావణ్, రాకేశ్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ నగర ఉపాధ్యక్షుడు ఇషాక్ అన్నారు. బీసీ సంక్షేమ కళాశాల హాస్టల్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులో ఉరితాడును ముద్దాడారని తెలిపారు. బ్రిటీషర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సందేశ్, రాకేశ్, సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బోయవాడలోని భగత్ సింగ్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగశీలి, నేటి యువతకు ఆదర్శప్రాయుడు భగత్ సింగ్ అని కొనియాడారు. 1929లో బ్రిటిష్ అసెంబ్లీలో పొగబాంబు విసిరిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు బ్రిటిష్ పాలకులనే గడగడలాడించారని పేర్కొన్నారు. దేశ సంపదను ప్రజలందరికీ చెందేలా సమరశీల పోరాటాలు చేయడమే భగత్‌సింగ్ వంటి విప్లవ కిశోరాలకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచుల మురళి, నాయకులు వెంకటేశ్, శ్రీకాంత్, భాస్కర్, రాజు, సన్నీ, సదాశివ్, రమేశ్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన దిశగా ‘టాస్క్’



శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఇంటర్వ్యూకు ఎంపికైన విద్యార్థులు

- విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
- కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం
- కరీంనగర్‌లో 62 కాలేజీల అనుసంధానం
- రిజిస్ట్రేషన్ ఈ నెల 30తో ముగింపు

కరీంనగర్ సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సాంకేతికతో పాటు, పర్సనల్ డెవలప్‌మెంట్, వృత్తి నైపుణ్యాలకు అవకాశాలు పెరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు పర్సనల్ డెవలప్‌మెంట్, సంస్థాగత నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించే లక్ష్యంగా టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)ను ఐటీ విభాగం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 2021లో ప్రారంభించింది. రాష్ట్ర ఐటీ శాఖ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన టాస్క్ ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలలో శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు సాధించే దిశగా సన్నద్ధం చేస్తున్నారు. ప్రారంభమైన అనతికాలంలోనే పెద్ద ఎత్తున విద్యార్థులు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు దోహదం చేసింది.

టాస్క్ లక్ష్యం..

ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగు పర్చడంతో పాటు పర్సనల్ డెవలప్‌మెంట్, సాంకేతిక శిక్షణ ఇస్తుంది. కార్పొరేట్ కంపెనీలతో నిత్యం సమాచారం మార్పిడి చేసుకుంటూ మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా నూతన కోర్సులు పరిచయం చేస్తారు. ఆయా కార్పొరేట్ కంపెనీలు కోరుకున్న స్థాయిలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులు ఉద్యోగాలు పొందేందుకు సాయం చేస్తారు. శిక్షణ పొందాలనుకునే విద్యార్థులు టాస్క్ సైట్‌లో నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 62 ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలు నమోదు కాగా ఈ ఏడాది వీటి నుంచి రెసిడెన్సియన్ కాలేజీల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా నుంచి 14, కరీంనగర్ 29, పెద్దపల్లి 13, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 కాలేజీలు టాస్క్‌లో రిజిష్టర్ అయ్యాయి. ఇప్పటికే సుమారు 5,800 మంది టాస్క్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిసింది. ఈ ఏడాది గడువులోగా సుమారు 1,200 మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుంటారని అంచనా వేస్తున్నారు. కరీంనగర్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఐటీ టవర్‌లో 2021లో టాస్క్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ నుంచి ఇప్పటి వరకూ 35 బ్యాచుల్లో 1,200 మందికి శిక్షణ ఇవ్వగా, 650 మంది వరకు ఉద్యోగాలు సాధించినట్లు టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా తెలిపారు.

30 వరకు గడువు

2023–24 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల రిజిస్ట్రేషన్ ఈ నెల 30తో ముగియనుంది. ఇప్పటికే పలు కాలేజీ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారని టాస్క్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గంగాప్రసాద్ తెలిపారు.

ఉద్యోగాలు సాధించేలా శిక్షణ



విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా టాస్క్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటి వరకు వందల సంఖ్యలో ఇంటర్వ్యూలు నిర్వహించాం. టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఏడాదికి కావాలిన్సన క్యాలెండర్ రూపొందించింది అమలు చేస్తున్నాం.

– గంగాప్రసాద్, టాస్క్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్

టాస్క్‌తో లక్ష్యానికి చేరువగా..



టాస్క్‌లో ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణతో ఇంటర్వ్యూల సమయంలో ఇబ్బందులను అధిగమించి సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వడం ఉపయోగకరంగా ఉంటోంది.

– ఆర్.సారిక, బీఫార్మసీ, వాగేశ్వరీ కాలేజీ, కరీంనగర్

ఆత్మవిశ్వాసంతో ముందుకు



టాస్క్‌లో సాధారణ కోర్సులతో పాటు పర్సనల్ డెవలప్‌మెంట్, స్కిల్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇవి ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన ఆత్మవిశ్వాసాన్ని ఇస్తున్నాయి. ప్రాజెక్టుల తయారీకి టాస్క్ అందిస్తున్న గ్రూప్ డిస్కర్షన్ ఉపయోగకంగా ఉంటున్నాయి.

– ఎం.పూజిత, ఈసీఈ, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీ

ఇస్రో సైంటిస్టుగా సిరిసిల్ల కుర్రాడు

- తిరువనంతపురంలో నియామకం
- విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై మక్కువ



తల్లిదండ్రులు సుధారాణి-రాజేశంలతో సుశాంత్‌వర్మ

సిరిసిల్ల: సిరిసిల్ల చిన్నోడు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)లో సైంటిస్టుగా నియామకమయ్యారు. సిరిసిల్లకు చెందిన మంచికట్ల సుశాంత్ వర్మ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సైంటిస్టుగా ఉద్యోగం సాధించారు. సుశాంత్‌వర్మ ప్రాథమిక విద్య కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో పూర్తి చేశారు. వివేకానంద కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశారు. బీటెక్ పూర్తికాగానే సుశాంత్‌వర్మ మెరిట్ విద్యార్థిగా ఇస్రోలో సైంటిస్టుగా ఉద్యోగం సాధించాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో సైంటిస్టుగా నియమితులైన సుశాంత్‌వర్మ చిన్నప్పటి నుంచి పరిశోధనలపై ఆసక్తి కనబరిచేవారు. సుశాంత్ తల్లి సుధారాణి బోయినపల్లి మండలం వర్దవెల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా.. తండ్రి రాజేశం సిరిసిల్ల మున్సిపల్ మెప్మా విభాగంలో కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సుశాంత్‌వర్మ సైంటిస్టుగా ఇస్రోలో ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు సుధారాణి, రాజేశం గురువారం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

చెవిలో పూలతో ఆశవర్కర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

కరీంనగర్: ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆశవర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు చెవిలో పూలు పెట్టుకొని, నిరసన తెలిపారు. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజిత, శ్రీలత మాట్లాడుతూ.. ఆశవర్కర్లు నిత్యం పని ఒత్తిడి తట్టుకొని, సేవలందిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది స్కీం వర్కర్లకు కనీస వేతనం నిర్ణయించాలని ఆందోళన చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. బంగారు తెలంగాణలో ఆశాలకు కనీస వేతనం ఇవ్వలేని మీరు దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌తోపాటు ఇతర పనులకు చేయిస్తున్న పాలకులు వారిని ఎందుకు గుర్తించటం లేదన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, శోభ, విజయలక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, పద్మ, శోభ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- 31 మొక్కలు 17 కిలోలు
- సీజ్ చేసిన పోలీసులు



గంజాయి మొక్కలను సీజ్ చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని ఇంద్రానగర్‌కాలనీకి చెందిన వృద్ధుడు మహ్మద్ హైదర్ తన ఇంటి ముందు మొండిగోడల మధ్య ఉన్న పది అడుగుల స్థలంలో కొన్ని రోజులుగా గంజాయి సాగుచేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మండల పోలీసులు గురువారం సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడి చేశారు. పది అడుగుల స్థలంలో సాగుచేసిన 31 గంజాయి మొక్కలను సీజ్ చేసి హైదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి మొక్కలు 17 కిలోలు ఉన్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ఐ మధు, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ప్రశాంత్, ప్రశాంత్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

- పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు



రక్తపు మడుగులో పడి ఉన్న ప్రసాద్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్‌లో పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయగా, మరొకరు సహకరించినట్లు సమాచారం. మండలంలోని కొలనూర్‌కు చెందిన మేర్గు కనకయ్య–కనకవ్వ దంపతుల కుమారుడు ప్రసాద్(28)పై అదే గ్రామానికి చెందిన మేర్గు బుచ్చిరాములు అతని కుమారులు తిరుపతి, అశోక్‌తో బుధవారం రాత్రి వాగ్వాదం జరిగింది. దీంతో ముగ్గురు కలిసి గొడ్డలి, కత్తులతో ప్రసాద్‌పై దాడిచేశారు. ఈ దాడిలో ప్రసాద్ నడుము, చేయి విరుగగా, తల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు దవడ పగిలి, పళ్లు రాలిపోయాయి. దాడికి పాల్పడిన వారికి గ్రామానికి చెందిన మరొకరు సహకరించారని సమాచారం. దాడి చేసిన తర్వాత ఈ నలుగురు మద్యం తాగినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మేర్గు బుచ్చిరాములు, తిరుపతి, అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుని ఆత్మహత్య



ఎల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన వృద్ధుడు ఆలకుంట ఎల్లయ్య(60) అప్పుల బాధ భరించలేక గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లయ్య తన కొడుకు నవీన్‌ను గల్ఫ్ దేశాలకు పంపడానికి, కూతురు వివాహానికి, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యేవాడు. పని ఉందని బుధవారం ఉదయం బయటకు వెళ్లిన ఎల్లయ్య మధ్యాహ్నం ఇంటికొచ్చి వాంతులు చేసుకున్నాడు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు నవీన్, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలే నర్సింగాపూర్‌లో చోరీ

- రూ.15వేలు, 20 తులాల వెండి పట్టగొలుసులు చోరీ



చిందరవందరగా పడేసిన ఇంట్లోని సామగ్రి

చందుర్తి(వేములవాడ): దొంగలు బరితెగించారు. మండలంలో వరుస దొంగతనాలతో రెచ్చిపోతున్నారు. పట్టపగలే నర్సింగాపూర్‌లోని ఓ ఇంట్లో చొరబడి రూ.15వేలు నగదు, 20 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన బైరగోని దేవేంద్ర కరీంనగర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి పది రోజుల క్రితం వెళ్లింది. కొద్ది రోజులుగా తాళం వేసి ఉన్నట్లు గమనించిన దొంగలు పట్టపగలే ఇంట్లో చొరబడి రూ.15వేల నగదు, 20 తులాల వెండి పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. ఇప్పటికే మండలంలోని మల్యాల, గోస్కులపల్లె గ్రామాల్లో దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తుండగా.. నర్సింగపూర్‌లో దొంగతనం జరగడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

దొంగతనం వేధింపులు భరించలేక హత్య



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): దొంగతనం చేస్తున్నావని తరచూ వేధించడాన్ని తట్టుకోలేకనే బాలుడు(17) పులి గంగారంను హత్య చేశాడని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. హోటల్ పని చేసుకుని జీవించే గంగారం మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఓ షట్టర్ ముందు నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన బాలుడు బండరాయితో మోది హత్య చేశాడు. అనుమానం రాకుండా ఉండేందుకు గ్రామంలోని ఓ ప్రజాప్రతినిధి భర్తకు ఫోన్‌చేసి షట్టర్ ముందు ఎవరో పడిపోయి ఉన్నాడని తెలిపాడు. నిందితుడైన మైనర్‌ను అరెస్టు చేసి, వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.

ఏర్పాటు సరే.. నిర్వహణే ప్రశ్నార్థకం

- భద్రత, నేరాల నియంత్రణకు 32వ డివిజన్‌లో 54 సీసీ కెమెరాలు
- టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనంలో డీవీఆర్
- సీసీ ఫుటేజీల కోసం స్థానిక నాయకులకు తలనొప్పి
- కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని ప్రజల విజ్ఞప్తి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని 32 డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు స్థానిక నాయకులకు తలనొప్పిగా మారింది. సొంతంగా లక్షలు వెచ్చించి కొన్ని, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మరికొన్ని సీసీ కెమెరాల పనితీరు ప్రశ్నార్థకమైంది. వివిధ కాలనీల్లో ప్రజల భద్రతతో పాటు నేరాలు జరిగినప్పుడు నిందితులను తొందరగా పట్టుకునేందుకు పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడంతో కార్పొరేటర్లు, నాయకులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా 32 డివిజన్ కార్పొరేటర్ మర్రి భావన సతీశ్ రూ.5.5 లక్షలు, కాలనీల పెద్దలు రూ.లక్ష వరకు కలిపి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.


32వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నెరవేరని పోలీసుల హామీ

డివిజన్‌లోని మహాలక్ష్మీనగర్, బంగారు మైసమ్మవాడ, వివేకానందకాలనీ, భవానీనగర్‌కాలనీ, రాంపూర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియా, సరస్వతీనగర్, దుర్గాదేవినగర్, గిద్దెపెరుమాళ్లనగర్, భద్రమారుతినగర్, జయశంకర్‌కాలనీ, శ్రీనివాసనగర్, వినాయకనగర్, ముదిరాజ్‌వీధి, బృందావన్‌కాలనీలను కలుపుకొని ఆయా కూడళ్లలో అవసరాన్ని బట్టి 54 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఫుటేజీలు నిక్షిప్తమయ్యే డీవీఆర్‌ను ఓ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటి పోలీసు అధికారులతో సీసీ కెమెరాలు ప్రారంభించి డీవీఆర్‌ను కమిషనరేట్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే చేస్తామని చెప్పినా పోలీసుల మాట ఇప్పటి వరకు నెరవేరలేదు. కానీ నేరాలు జరిగినప్పుడు పోలీసులు ప్రజాప్రతినిధులు, నాయకుల వద్దకు సీసీ ఫుటేజీలు పంపిస్తుండడంతో నాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ చిన్న కేసుకు సంబంధించి ఫుటేజీల కోసం పోలీసులు సంప్రదించడం తలనొప్పిగా మారిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిద్దె పెరుమాళ్ల మైదానంలో మరిన్ని ఏర్పాటు..

గిద్దెపెరుమాళ్ల మైదానంలో చాలా మంది వాకింగ్, ఆటలు ఆడుతుంటారు. రాత్రివేళ మైదానంలో గంజాయి సేవించడం మందుబాబులు వాకింగ్ ట్రాక్‌పై మద్యం బాటిళ్ల వేయడం వంటివి చేస్తున్నారని స్థానికులు మేయర్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మైదానం చుట్టూ ప్రహరీ, లైట్లు, గేట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నట్లు తెలిసింది. గిద్దెపెరుమాళ్ల నగర్‌లో మూడు ద్వారాల వద్ద సీసీ కెమెరాలు గతంలోనే ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరికొన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అన్ని సీసీల ఫుటేజీల నిక్షిప్తం చేసే డీవీఆర్‌ను పోలీసు కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయాలని కార్పొరేటర్‌తో పాటు ప్రజలు కోరుతున్నారు. కరీంనగర్ సీపీకి విన్నవిస్తామని స్థానికులు తెలిపారు.


గిద్దె పెరుమాళ్ల మైదానం

కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానించాలి



డివిజన్‌లో ప్రజల భద్రత, నేరాలు జరిగిన సమయంలో నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి సొంత డబ్బులతో పాటు కాలనీలోని కొంతమంది దాతల సహాయంతో మొత్తం 52 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. డీవీఆర్‌ను స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనంలో పొందుపరిచాం. పోలీసులు వాటిని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని కోరుతున్నాం.

– మర్రి భావనసతీశ్, కార్పొరేటర్

ఫొటోస్టోరీ



డంపింగ్‌యార్డులా ఇరుకుల్ల వాగు

కరీంనగర్ మండలం ఇరుకుల్ల వాగు డంపింగ్‌యార్డుగా మారుతోంది. పట్టణంతోపాటు సమీప గ్రామాల నుంచి భవన నిర్మాణ, హోటళ్లు, ఆస్పత్రులు, పండ్ల గోదాముల నుంచి వ్యర్థాలను వాహనాల్లో తీసుకొచ్చి వాగులో పడేస్తున్నారు. దీంతో దుర్శేడ్, నల్లగుంటపల్లి, మొగ్దుంపూర్, మందులపల్లి గ్రామాల తాగునీటి బావులు కలుషితమవుతున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఇరుకుల్లవాగులో చెత్తాచెదారం వేయకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – కరీంనగర్‌రూరల్

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

రెండోరోజూ కొనసాగిన శోభాయాత్ర

కొత్తపల్లి: వినాయక నిమజ్జన వేడుకలు రెండో రోజు కొనసాగాయి. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణేశుడి నిమజ్జన వేడుకలు బుధవారం ప్రారంభమై గురువారం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కొత్తపల్లి చెరువుతో పాటు మండలంలోని చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నిమజ్జనం చేశారు. కొత్తపల్లి చెరువు వద్ద సుమారు 500 పైగా పెద్ద విగ్రహాలు, 600 పైచీలుకు చిన్న ప్రతిమలు, చింతకుంట కెనాల్ వద్ద 505 పెద్ద, 510 చిన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన శోభాయాత్రలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని వీడ్కోలు పలికారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో గురువారం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ వినాయకుడి తరహాలో ఎస్సీకాలనీలో కొన్నేళ్లుగా పదోరోజున నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. డప్పుచప్పుళ్ల మధ్య యువత ఆటపాటలతో శోభాయాత్ర వైభవంగా సాగింది. మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, దుర్శేడ్ తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గురువారం తెల్లవారు జాము వరకు సాగింది.


చామనపల్లిలో చివరిపూజలు


కొత్తపల్లి చెరువు వద్దకు వినాయక శోభాయాత్ర

క్లుప్తంగా

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం


రోగులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి జ్వరపీడితులతో కిక్కిరిసిపోతోంది, సౌకర్యాలు సరిపోవడం లేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రోగులకు చికిత్స, సౌకర్యాలు తెలుసుకోవడానికి నాయకులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. జ్వరంతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయకపోవడం, ఇంటి పరిసరాలలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని, నిధులు కేటాయించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంట దన్న సింగ్, జీడి రమేశ్, పొరండ్ల రమేశ్, షబానా మహ్మద్, ముల్కల కవిత, అన్నే జ్యోతి, స్వరూప, మహమ్మద్ భారీ, బషీర్, మెతుకు కాంతయ్య, ముక్క భాస్కర్‌లున్నారు.

ఆర్థికసాయం


నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గుండ్రాతి కనుకమ్మ, చిట్కూరి ఓదెలు కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి గురువారం స్థానిక నాయకుల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర నారాయణగౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మహేశ్, రమేశ్, తిరుపతి, మహేందర్, ఆంజనేయులు, ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ మట్టి తరలింపు అడ్డగింత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం ఎస్సీ కాలనీ యువకులు, మహిళలు అడ్డుకొని ఆందోళన చేశారు. ఎంపీపీ లక్ష్మయ్య చామనపల్లిలో డ్రైనేజీ నిర్మాణానికి మట్టిని బహదూర్‌ఖాన్‌పేటలోని గుట్టనుంచి తరలిస్తుండగా అడ్డుకున్నారు. మట్టి తరలించొద్దంటూ ట్రాక్టర్ డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. ఎంపీపీ సూచనల మేరకు సర్పంచ్ తప్పెట్ల భూమయ్య కాలనీవాసులతో చర్చించారు. అనంతరం మట్టిని అక్కడే అన్‌లోడింగ్ చేయడంతో వివాదం సద్దుమణిగింది.


ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

‘టెట్ ఉత్తీర్ణులైతేనే పదోన్నతి అనడం విచారకరం’

కరీంనగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పేపర్ 2 ఉత్తీర్ణులైన వారికే పదోన్నతి ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటం విచారకరమని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హైకోర్టు తీర్పును పునఃపరిశీలన చేసి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 23 ఆగస్టు 2010కి ముందే సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించబడిందని, ఆ తర్వాత ప్రత్యక్ష నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేశారని అదే ఉద్దేశంతో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుడు ఎవరూ టెట్ రాయలేదన్నారు. హఠాత్తుగా టెట్ ఉత్తీర్ణులైతేనే పదోన్నతి అనడం పదోన్నతుల కోసం ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న సీనియర్ టీచర్లకు అశనిపాతమైందన్నారు. పోస్టులకు సరిపడా అభ్యర్థులు కూడా లభ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్పుపై పునఃసమీక్షకు అప్పీల్ చేయాలని, పదోన్నతుల షెడ్యూల్ కొనసాగించాలని కోరారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు

మానకొండూర్: మానకొండూర్ చెరువు కట్ట వద్ద వినాయక నిమజ్జనం గురువారం మధ్యాహ్నం వరకు జరిగింది. కరీంనగర్ నుంచి భారీసంఖ్యలో గణనాథులు నిమజ్జనానికి తరలాయి. భారీ క్రేన్ల సాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. 620 నుండి 800పైగా వినాయకులను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. సీఐ రాజ్‌కుమార్, ఇంద్రసేనా రెడ్డి భారీ బందోబస్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కరించి న్యాయం చేయాలి

తిమ్మాపూర్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బక్కి వెంకటయ్యను జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు ఆంజనేయులు గురువారం మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కమిషన్ చైర్మన్‌ను ఆంజనేయులు కోరారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆంజనేయులు

సమాచారం

నేడు జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె. దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డీజిల్ మెకానిక్, డిప్లొమా మెకానికల్ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9133398820, 7893082090 నంబర్లను సంప్రదించాలన్నారు.

నియామకం



కొత్తపల్లి: తెలంగాణ ముదిరాజ్ మహాసభ కొత్తపల్లి యువజన విభాగం అధ్యక్షుడిగా మండలంలోని బద్దిపల్లి గ్రామానికి చెందిన పోలు దాసరి శరత్ ముదిరాజ్ నియామకమయ్యారు. ముదిరాజ్‌ల అభ్యున్నతి, పురోగతి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తూ సంఘం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని శరత్ పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: బీఎంఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ సంఘ్, ఆటో ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ మహాసభ నిర్వహించనున్నారు. గురువారం జిల్లా వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ప్రతినిధులు రవికుమార్, రవీంద్రరాజువర్మ, శ్యాంరావు, బండి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులతో ప్రిన్సిపాల్ చంద్రమోహన్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు బొమ్మకల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 19 మైనార్టీ గురుకుల పాఠశాలల నుంచి దాదాపు 800 మంది విద్యార్థులు పాల్గొనగా అండర్–17 విభాగంలో 11, అండర్–14 విభాగంలో 3 బహుమతులు సాధించి ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ గెలుపొందారని వివరించారు. గురువారం పతకాలు సాధించిన విద్యార్థులు, పీఈటీలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కశ్మీర్‌గడ్డ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ కశ్మీర్‌గడ్డ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను మేయర్ కట్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు మధుసూదనాచారి, నారాయణ, సలీం, బాబా, ఆది శ్రీనివాస్, రామకృష్ణ, సైఫొద్దీన్, వంగపల్లి సూర్యప్రకాశ్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.


మేయర్‌కు కమిషనర్, అధికారుల శుభాకాంక్షలు


తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న మేయర్


భగత్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న మేయర్


మేయర్‌కు కేక్ తినిపిస్తున్న మంత్రి గంగుల

హ్యాపీ బర్త్‌డే.. మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగర మేయర్ యాదగిరి సునీల్ రావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 56వ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు, వాకర్స్, యువజన, మైనార్టీ, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, కేక్ కటింగ్, సామాజిక సేవలు నిర్వహించారు. మీ సేవా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి సునీల్‌రావు కేక్ కట్ చేశారు. మంత్రి కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపగా మేయర్ పూలమొక్క అందించి మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం భగత్‌నగర్‌లోని అయ్యప్పదేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, మేయర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది, లయన్స్ క్లబ్, టీఎన్జీవో సంఘాలు, నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మేయర్ కేక్ కట్ చేశారు. కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, గందె మాధవి మహేశ్, గంట కల్యాణి శ్రీనివాస్, లెక్కల స్వప్న వేణు, తుల శ్రీదేవి, బండారి వేణు, చాడగొండ బుచ్చిరెడ్డి, వాల రమణారావు, జంగిలి సాగర్, తోట రాములు తదితరులు గజమాలతో మేయర్‌ను సత్కరించారు. ఉద్యోగులు, అధికారులు పూలమొక్కలు, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగర పాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, డీసీపీ సుభాష్ తదితరులు మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని క్యాన్సర్ హాస్పిటల్‌లో కార్పొరేటర్ నేతికుంట యాదయ్య, సవరన్ స్ట్రీట్ నెహ్రూ విగ్రహం వద్ద కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మేయర్ అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఉయ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన 56 కిలోల భారీ కేక్‌ను సునీల్‌రావు కట్‌చేశారు. ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్ వద్ద ఖాలీద్, సంజీవ్‌నగర్‌లో షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. తిరుమలనగర్‌లో రవివర్మ ఆధ్వర్యంలో బేబీ స్టూడియోలో కేక్ కట్ చేశారు. పెద్దమ్మ దేవాలయం సమీపంలో జైభూన్ యూత్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో ముస్లింలకు అన్నదానం, అనారోగ్యంతో బాధపడుతున్న ఓ నిరుపేదకు మేయర్ 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఎంఏ ఖరీమ్ రూపొందించిన పాటను మేయర్ విడుదల చేశారు. అనంతరం దాండియా ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు.

రక్తకణాలు దానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీతో బాధపడుతున్న మహిళకు అత్యవసరంగా రక్తకణాలు అవసరం కాగా కుటుంబ సభ్యులు, చిరంజీవి యువత ప్రతినిధులు వేల్పుల వెంకటేశ్, గాలిపల్లి కుమార్‌ను సంప్రదించారు. బొమ్మకల్‌కు చెందిన వందన సకాలంలో రక్తకణాలు దానం చేసి ప్రాణాలను కాపాడారు. వందనను కుటుంబసభ్యులు అభినందించారు.

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన గౌతమ్ అదానీ


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ

సాక్షి, అమరావతి: అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ గురువారం సాయంత్రం తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గంగవరం పోర్టుకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. వీరి మధ్య రాష్ట్రంలో అదానీ కంపెనీ పెట్టుబడులకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం.

మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త: సీఎం జగన్

సాక్షి, అమరావతి: ప్రపంచ శాంతి కోసం మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త అని ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. 'నేడు ఆయన జన్మదినం సందర్భంగా ఆ అల్లాహ్ దీవెనలు మన రాష్ట్రంపై ఉండి, అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ముస్లిం సోదరసోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు' అంటూ గురువారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బాబు ఎస్‌ఎల్‌పీలో మా వాదనలూ వినాలి

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం కేవియట్

సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ ఎస్‌ఎల్‌పీలో ఏపీ ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంలో తమ వాదనలు కూడా వినాలని సుప్రీంకోర్టును కోరింది. చంద్రబాబు దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీ బుధవారం విచారణకు వచ్చినప్పటికీ ధర్మాసనంలో సభ్యుడిగా ఉండడానికి న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నిరాకరించిన విషయం విదితమే. దీంతో ఈ వ్యాజ్యాన్ని అక్టోబరు 3న తగిన ధర్మాసనం ముందు జాబితా చేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పడంతో ఏపీ ప్రభుత్వం తమ వాదనలు కూడా వినాలని కోరుతూ కేవియట్ దాఖలు చేసింది.

'వర్గీకరణపై చావోరేవో'



మందకృష్ణ

షాద్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయంలో మాదిగలు కేంద్రంపై యుద్ధానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలో గురువారం మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులతో మాదిగల విశ్వరూప పాదయాత్రల రాష్ట్ర స్థాయి సన్నాహక సదస్సు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ వరంగల్ సభలో ప్రధాని మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 4న అలంపూర్ నుంచి మహాపాదయాత్ర చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందునరేశ్ మాదిగ, కర్ణాటక ఇన్‌చార్జి నరేంద్రబాబు మాదిగ పాల్గొన్నారు.

పేదలను బెదిరించారు.. 'అసైన్డ్' కాజేశారు

పక్కా స్కెచ్‌తో బడుగుల భూములు కొల్లగొట్టిన బాబు ముఠా

- వాటికి ప్యాకేజీ లేదని బెదిరించి మరీ హస్తగతం
- 1954 తరువాత భూపంపిణీ రికార్డులు లేవని కోర్టుకు బురిడీ
- ఆ కుట్రతో 617.70 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు, నారాయణ బ్యాచ్ హస్తగతం


1954 తరువాత భూపంపిణీ లేదని టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానానికి ఇచ్చిన నివేదిక

(వడ్డాది శ్రీనివాస్/సాక్షి, అమరావతి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ముసుగులో చంద్రబాబు బరితెగించి పాల్పడిన భారీ భూదోపిడీ బండారం బట్టబయలైంది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు కేటాయించిన అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు పక్కాగా అమలుచేసిన కుతంత్రం ఆధారాలతో సహా నిగ్గుతేలింది. ఏకంగా రూ.3,737.30 కోట్ల విలువైన 617.70 ఎకరాల అసైన్డ్ భూదోపిడీ విస్మయపరుస్తోంది. ఈ భూములకు పరిహారం ఇవ్వబోమని అప్పట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను బెదిరించి వారి భూములను చంద్రబాబు, నారాయణ, తదితర టీడీపీ పెద్దలు 814 మంది బినామీల ముసుగులో హస్తగతం చేసుకుని దేశ చరిత్రలోనే అత్యంత భారీ అసైన్డ్ భూకుంభకోణానికి తెగబడ్డారు. చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌ల కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సాగిన ఈ అసైన్డ్ భూదోపిడీ ఆధారాలతో సహా బట్టబయలైంది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు 'సాక్షి'సేకరించింది. పచ్చ గద్దల అసైన్డ్ భూదోపిడీపై 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనాల్లో మొదటి భాగం ఇది..

జీఓ–1తో భయపెట్టి.. జీఓ–41తో దోపిడీ

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పేరిట భారీ భూదోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను బెదిరించి మరీ వారి అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. అందుకోసం పక్కా పన్నాగంతో రాజధాని కోసం భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జీఓ నంబరు 1ను జారీ చేశారు. ఆ జీఓలో అమరావతిలోని ప్రైవేటు భూములకు మాత్రమే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ప్రకటించలేదు. అనంతరం.. చంద్రబాబు, నారాయణ తమ బినామీలు, ఏజెంట్లను అమరావతి గ్రామాల్లోకి పంపి ప్రభుత్వం అసైన్డ్ భూములను ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా ఉచితంగా తీసుకుంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయపెట్టారు. కాబట్టి తమకు ఆ భూములు విక్రయిస్తే ఎంతోకొంతైనా డబ్బులు వస్తాయని మభ్యపెట్టారు. అందుకోసం ఆర్కే హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతోపాటు తమ బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారి ఏజెంట్లను గ్రామాల్లోకి పంపించి దుష్ప్రచారం చేయించారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన పేద రైతులు అత్యంత తక్కువ ధరకు అంటే ఎకరాకు కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు సేల్‌డీడ్ల ద్వారా తమ అసైన్డ్ భూములను విక్రయించారు. అలా.. ఆ ముఠా ఏడాదిపాటు తమ పన్నాగాన్ని పక్కగా అమలుచేసి అసైన్డ్ భూములన్నింటినీ తమ బినామీల పరం చేశారు. ఆ తరువాత చంద్రబాబు అసలు కుట్రను తెరపైకి తెచ్చారు. అసైన్డ్ భూములకు కూడా ఆరు కేటగిరీల కింద విభజించి 2016, ఫిబ్రవరి 17న జీఓ నంబరు 41 ద్వారా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అంటే.. అప్పటికే అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట ఉండటంతో వారికే భూసమీకరణ ప్యాకేజీ దక్కేలా చూసుకున్నారు.

ఉన్నతాధికారుల అభ్యంతరాలు బేఖాతరు..

నిజానికి.. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్ట విరుద్ధం. అలా చట్ట విరుద్ధంగా కొనుగోలు చేసిన వారికి భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడానికే వీల్లేదు. చట్ట ప్రకారం దేశంలో 1954కు ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు పంపిణీ చేసిన భూములను ఇతరులకు విక్రయించుకునే అవకాశముంది. 1954 తరువాత పంపిణీ చేసిన అసైన్డ్ భూములను కొనుగోలు చేయడంగానీ విక్రయించడంగానీ చట్ట విరుద్ధం. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ రెవెన్యూ ఉన్నతాధికారులు అసైన్డ్ భూముల బదలాయింపును గుర్తిస్తూ వారికి కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడాన్ని వ్యతిరేకించారు. ఈ మేరకు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్‌తోపాటు సీఆర్‌డీఏ, సీసీఎల్‌ఏ అధికారులు తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా వ్యక్తంచేశారు. కానీ, అప్పటి మున్సిపల్–సీఆర్‌డీఏ శాఖ మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణ ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'అది మీకు సంబంధంలేని వ్యవహారం. మేం చెప్పినట్లు చేయండి. పైస్థాయిలో నేను మాట్లాడతాను'.. అని వారికి హుకుం జారీచేశారు. అప్పటి అడ్వకేట్ జనరల్ కూడా అసైన్డ్ భూముల అన్యాక్రాంతాన్ని గుర్తించడానికి చట్టం అనుమతించదని స్పష్టంచేశారు. ఈ మేరకు అప్పటి కలెక్టర్, సీఆర్‌డీఏ, రెవెన్యూ, న్యాయ శాఖ ఉన్నతాధికారులు, అడ్వకేట్ జనరల్ తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలిపారు. కానీ, చంద్రబాబు బేఖాతరు చేశారు.

కోర్టును సైతం మోసం చేసి మరీ..

అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఏకంగా న్యాయస్థానాన్నే మోసం చేయడం విస్మయపరుస్తోంది. చట్ట ప్రకారం 1954 తరువాత పంపిణీ చేసిన భూములను విక్రయించడం, కొనుగోలు చేయకూడదు. కానీ, తమ కుట్రను అమలుచేసేందుకు ఏకంగా అమరావతి పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను చంద్రబాబు, నారాయణ మాయం చేశారు. 1954 తరువాత భూపంపిణీ రికార్డులు ఏమీలేవని అమరావతి పరిధిలోని మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ మండల రెవెన్యూ అధికారులతో ఓ నివేదిక ఇప్పించారు. ఆ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అంటే.. అమరావతి పరిధిలో ఉన్న అసైన్డ్ భూములన్నీ కూడా 1954కు ముందు పంపిణీ చేసినవే తప్ప.. ఆ తరువాత 2015లోగా అసలు భూపంపిణీయే చేయలేదని న్యాయస్థానాన్నే పక్కదారి పట్టించారు. కానీ, 1954 తరువాత చాలాసార్లు పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కూడా 2004–05లో అసైన్డ్ భూములు పంపిణీ చేశారు.

రూ.3,737.30 కోట్ల అసైన్డ్ భూదోపిడీ

నాలుగు కేటగిరీ కింద దోపిడీ చేసిన 617.70 ఎకరాల అసైన్డ్ భూములకు చంద్రబాబు, నారాయణ గ్యాంగ్ ప్యాకేజీ ద్వారా ఏకంగా రూ.3,737.30 కోట్లు దక్కించుకుంది. ఎందుకంటే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించిన తరువాత అమరావతిలో నివాస స్థలం చ.గజం మార్కెట్ ధర కనీసం రూ.30వేలు, వాణిజ్య స్థలం మార్కెట్ ధర చ.గజం కనీసం రూ.50వేలు చొప్పున విక్రయాలు సాగాయి. ఇక అమరావతి నిర్మించిన తరువాత వాటి విలువ మరింత పెరుగుతుంది కూడా. ఇక భూసమీకరణ ప్యాకేజీలో కనీస విలువగా ఎకరా ప్యాకేజీ ప్రకటించారు. అంటే.. ఎకరా లోపు భూమిని తీసుకున్నా సరే ఎకరాకు ప్యాకేజీ ఇచ్చారు. ఎందుకంటే చంద్రబాబు, నారాయణ తమ బినామీలు ఎక్కువ మంది ద్వారా చిన్న చిన్న కమతాలను చేజిక్కించుకున్నారు. తద్వారా ప్రతీ బినామీకి కనీసం ఎకరా ప్యాకేజీ వచ్చేలా చేశారు.

పత్రాలు వెలుగులోకి.. పచ్చ కుట్ర బట్టబయలు

ఎంత మసిపూసి మారేడుకాయ చేయాలని చూసినా చంద్రబాబు భూదోపిడీ కుట్ర బట్టబయలైంది. అమరావతిలోని అసైన్డ్ భూములలో 1954కు తరువాత పంపిణీ చేసిన భూములు ఉన్నాయన్న రికార్డులు వెలుగులోకి వచ్చాయి. వాటిలో 1987, 2004–05లలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు కూడా ఉన్నాయని తేలింది. దీనిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమగ్ర విచారణలో మొత్తం భూబాగోతం వెలుగుచూసింది. అమరావతి పరిధిలో 1954 తరువాత కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. 2014–19 మధ్య జరిగిన అసైన్డ్ భూముల అన్యాక్రాంతం కుంభకోణంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని కూడా లిఖితపూర్వకంగా నివేదించారు. సిట్ బృందాలు అమరావతి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నిర్వహించడంతోపాటు సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాయి. దాంతో గణాంకాలతో సహా పూర్తి ఆధారాలతో అసైన్డ్ భూముల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అసైన్డ్ భూముల రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లు, సీఆర్‌డీఏ ప్రకటించిన భూసమీకరణ ప్యాకేజీలోని అసైన్డ్ రైతుల పేర్లను సరిపోల్చి చూడగా అసలు బండారం బయటపడింది. 617.70 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ ముఠా కొల్లగొట్టిందన్నది తేలిపోయింది.

కేటగిరీలూ అనుకూలంగానే..

ఇక జీఓ–41 ప్రకారం ఆరు కేటగిరీల కింద నాటి ప్రభుత్వం ప్యాకేజీని ప్రకటించింది. వాటిలో నాలుగు కేటగిరీల కింద చంద్రబాబు, నారాయణ తమ బినామీల పేరిట అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. ఆ నాలుగు కేటగిరీలకు జరీబు భూములకు చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన భూసమీకరణ ప్యాకేజీ ఇలా ఉంది..

కేటగిరీ	భూసమీకరణ ప్యాకేజీ
1	వేయి చ.గజాల నివాస స్థలం + 450 చ. గజాల వాణిజ్య స్థలం
2	వేయి చ.గజాల నివాస స్థలం + 450 చ. గజాల వాణిజ్య స్థలం
3	800 చ. గజాల నివాస స్థలం + 200 చ. గజాల వాణిజ్య స్థలం
4	500 చ. గజాల నివాస స్థలం + 100 చ. గజాల వాణిజ్య స్థలం

సీఆర్‌డీఏ భూ సమీకరణ ప్యాకేజీ కేటగిరీల ప్రకారం చంద్రబాబు ముఠా కొల్లగొట్టిన అసైన్డ్ భూముల జాబితా, భూసమీకరణ ప్యాకేజీ ప్రకారం వాటి విలువ ఇలా..

కేటగిరీ	చంద్రబాబు, నారాయణ బినామీ రైతులు	కొల్లగొట్టిన అసైన్డ్ భూములు (ఎకరాల్లో)	భూసమీకరణ ప్యాకేజీ ప్రకారం విలువ (రూ.కోట్లలో)
1	23	17.35	120.75
2	567	493.10	2,976.75
3	137	69.91	465.80
4	87	37.34	174.00
మొత్తం	814	617.70	3,737.30

కారు చివరి సీట్లు ఖరారు

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్, బీజేపీలు కూడా అభ్యర్థుల ఎంపిక కసరత్తును ప్రారంభించిన నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులపై స్పష్టత వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ గతంలో ప్రకటించిన తొలి జాబితాలో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్, బీజేపీల్లోని కీలక అసమ్మతి నేతలను ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ గూటికి చేర్చే వ్యూహానికి పార్టీ అధినేత కేసీఆర్ పదును పెడుతున్నట్లు సమాచారం.

ముగ్గురికి పచ్చజెండా

బీఆర్‌ఎస్ గత నెల 21న రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు గాను 115 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకే మరోసారి అవకాశం ఇచ్చింది. అయితే ఆయన కాంగ్రెస్ గూటికి చేరడంతో, ఈ నియోజకవర్గంతో పాటు గతంలో పెండింగులో పెట్టిన జనగామ, నర్సాపూర్, గోషామహల్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల పేర్లను కేసీఆర్ ఖరారు చేశారు. వారు క్షేత్రస్థాయిలో పని చేసుకునేందుకు పచ్చజెండా ఊపారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ), సునీత లక్ష్మారెడ్డి (నర్సాపూర్), మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజిగిరి), నందకిషోర్ వ్యాస్ బిలాల్ (గోషామహల్) పేర్లను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఇక నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థి విషయంలో కసరత్తు కూడా ఒకటి రెండు రోజుల్లో కొలిక్కిరానుంది.

గులాబీ గూటి నుంచి బయటకు..

బీఆర్‌ఎస్ నుంచి అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన పలువురు ముఖ్య నేతలకు సర్ది చెప్పేందుకు పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ అధిష్టానానికి సన్నిహితం ఉండే నేతలు చేస్తున్న ప్రయత్నాలు కొన్నిచోట్ల ఫలించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆయా పార్టీల టికెట్ ఆశిస్తూ బీఆర్‌ఎస్‌ను వీడుతున్న నేతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వివిధ కారణాలతో ఇప్పటివరకు సుమారు 20 మంది ముఖ్య నేతలు పార్టీని వీడారు. మాజీ మంత్రులు జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), తుమ్మల నాగేశ్వర్ రావు (పాలేరు) లాంటి వారు ఇందులో ఉన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కూడా ఇటీవల అసంతృప్తి రాగం అందుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేవలం మూడు నెలల కాలంలోనే మనసు మార్చుకుని తిరిగి కాంగ్రెస్‌లో చేరారు.

పలువురు ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు కూడా..

బీఆర్‌ఎస్ టికెట్ దక్కని ఎమ్మెల్యేలు రేఖా నాయక్ (ఖానాపూర్), రాథోడ్ బాపూరావు (బోథ్)తో పాటు టికెట్ దక్కినప్పటికీ మైనంపల్లి హన్మంతరావు (మల్కాజిగిరి) పార్టీని వీడారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి పార్టీకి దూరమయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు (చెన్నూరు), ఆరేపల్లి మోహన్ (మానకొండూరు), వేముల వీరేశం (నకిరేకల్), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), తాటి వెంకటేశ్వర్లు (అశ్వారావుపేట) కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు జడ్పీ చైర్మన్లు కోరం కనకయ్య (భద్రాద్రి కొత్తగూడెం), నల్లాల భాగ్యలక్ష్మి (మంచిర్యాల), సరిత (గద్వాల) కూడా వేర్వేరు సందర్భాల్లో కారు దిగేశారు.

పదవులు, బుజ్జగింపులతో కట్టడి యత్నం

ఎన్నికల సమయంలో నేతలు పార్టీలు మారడం అత్యంత సహజమని చెప్తూనే అసంతృప్తులకు కళ్లెం వేసేందుకు బీఆర్‌ఎస్ మరింత ముమ్మర ప్రయత్నాలు సాగిస్తోంది. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో పాటు ప్రవీణ్ (బెల్లంపల్లి), నరోత్తమ్ (జహీరాబాద్), గోలి శ్రీనివాస్‌రెడ్డి (కల్వకుర్తి), బక్కి వెంకటయ్య (దుబ్బాక) తదితరులకు ఇటీవల ప్రభుత్వ పదవులను అప్పగించారు. టికెట్ దక్కని ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు (ఆసిఫాబాద్), ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి (జనగామ), తాటికొండ రాజయ్య (స్టేషన్ ఘనపూర్)కు కూడా కీలక పదవులు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే టికెట్ దక్కని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి (ఉప్పల్)తో పాటు నేతలు గడ్డం అరవింద్ రెడ్డి (మంచిర్యాల), నీలం మధు (పటాన్‌చెరు), మన్నెం రంజిత్ యాదవ్, బుసిరెడ్డి పాండురంగారెడ్డి (నాగార్జునసాగర్) చందర్‌రావు (కోదాడ) తదితరులు అభ్యర్థులను మార్చాలని ఒత్తిడి పెంచుతుండటం గమనార్హం.



సాధారణంగా ఏ ఊరెళ్లినా.. కుక్కలు ఉన్నాయ్ జాగ్రత్త అనో.. దొంగలున్నారు జాగ్రత్త అనో బోర్డులు చూస్తుంటాం. కానీ దక్షిణ ఆస్ట్రేలియాలోని కూబర్ పెడీ పట్టణానికి వెళ్తే.. రంధ్రాలున్నాయ్ జాగ్రత్త అనే బోర్డులు దర్శన మిస్తాయ్. ఇంతకీ అక్కడ రంధ్రాలు ఎందుకు ఉన్నాయ్? లోపల ఏం జరుగుతోంది? ఆ పట్టణ కథాకమామీషు ఏమిటి తెలుసుకోవాలని ఉందా? అయితే చలో కూబర్ పెడీ..

రంధ్రాలున్నాయ్ జాగ్రత్త!




మైనింగ్ నుంచి మొదలై..

కూబర్ పెడీ.. దక్షిణ ఆస్ట్రేలియాలోని ఓ మైనింగ్ క్షేత్రం. ఒపాల్ (రత్నం వంటి విలువైన రాయి) గనులకు నిలయంగా పేరొందిన ఈ ప్రదేశం అడిలైడ్‌కు వాయువ్యంగా 590 మైళ్ల దూరంలో స్టువర్ట్ హైవేపై ఉంది. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఒపాల్స్‌లో ఎక్కువ భాగం ఈ గ్రేట్ విక్టోరియా ఎడారి అంచున ఉన్న స్టువర్ట్ శ్రేణిలోని మైనింగ్ సైట్ నుంచే వస్తుంది. అసలు ఇక్కడ ఒపాల్‌ను కనుక్కోవడం కూడా చాలా విచిత్రంగా జరిగింది. 1915లో విల్లీ హచిసన్ అనే బాలుడు తన తండ్రి జేమ్స్‌తో కలిసి గోల్ఫ్ ప్రాక్టీసింగ్ కోసం ఈ ప్రాంతానికి వచ్చాడు. గోల్ఫ్ ఆడే క్రమంలో ఓ చోట ఒపాల్‌ను చూశాడు. అంతే.. అప్పటివరకు నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతం క్రమంగా పెద్ద పట్టణంగా మారిపోయింది. 1920లో ఈ ప్రాంతానికి కూబర్ పెడీ అని పేరు పెట్టారు. 1960లో దీనిని పట్టణంగా గుర్తించారు. అప్పటి నుంచి ఇది బాగా అభివృద్ధి చెందింది. స్థానికులు అక్కడే ఉంటూ మైనింగ్ చేసేవారు.

వేడి నుంచి తప్పించుకోవడానికి..

ఎడారి ప్రాంతం కావడంతో అక్కడ వేసవికాలం ఉండే నాలుగు నెలల కాలం భగభగా మండిపోయేది. ఆ నాలుగు నెలలు ఏకంగా 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. ఈ వేడి నుంచి తప్పించుకోవడానికి అక్కడివారంతా మైనింగ్ గనుల్లో ఉండేవారు. అనంతరం ఆ భూగర్భంలోనే తాము ఉండటానికి వీలుగా ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్లంటే ఏదో సాదాసీదా నిర్మాణాలనుకుంటే పొరపడినట్టే. కోటలను తలపించేలా విలాసవంతమైన ఇళ్లు కట్టుకున్నారు. అంతేకాదు.. హోటళ్లు, స్టోర్లు, లైబ్రరీలు, షాపింగ్ సెంటర్లు, క్రీడా ప్రదేశాలు, ఈత కొలనులు, విశాలమైన స్నానపు గదులు, చర్చిలు.. ఇలా ఒకటేమిటి? భూమిపై పెద్ద పెద్ద నగరాల్లో ఉండే వసతులన్నీ అక్కడ ఉన్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం, నీటి వసతి, డ్రైవ్ ఇన్ మూవీ థియేటర్, గడ్డి లేని గోల్ఫ్ కోర్సు కూడా ఏర్పాటు చేసుకున్నారు. సూర్యకాంతి మినహా సమస్తమూ భూమిపై ఉన్నట్టే ఉంటుంది. కూబర్ పెడీని పై నుంచి చూస్తే.. బోలెడు రంధ్రాలు కనిపిస్తాయి. వీధులన్నీ దుమ్ముతో ఉంటాయ్. రంధ్రాలున్నాయ్ జాగ్రత్త.. అనే హెచ్చరిక బోర్డులు కనిపిస్తాయి. కానీ ఆ రంధ్రాల లోపల ఓ భూగర్భ స్వర్గం ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. అక్కడ భూమిపై 52 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే.. లోపల 23 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉంటుంది. ఇక లోపల కరెంటు అవసరాలను సొంతంగానే తీర్చుకుంటున్నారు. 70 శాతం కరెంటును గాలి, సౌరశక్తి ద్వారా సమకూర్చుకుంటున్నారు. ఈ భూగర్భ పట్టణ జనాభా దాదాపు 2500 మంది.





నాలుగు మీటర్ల లోతులో..

కూబర్ పెడీలో భూగర్భ భవనాలు తప్పనిసరిగా నాలుగు మీటర్లు (13 అడుగులు) లోతులో ఉండాలి. పైకప్పులు కూలిపోకుండా చూసుకునేందుకే ఈ నాలుగు మీటర్ల నిబంధన విధించారు. ఈ రాతి కింద ఎల్లప్పుడూ 23 డిగ్రీల ఉష్ణోగ్రతతో తేమగా ఉంటుంది. అక్కడ నేలపై వేసవిలో విపరీతమైన వేడి.. శీతాకాలంలో భరించలేని చలి ఉంటుంది. ఒక్కోసారి రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. కానీ భూగర్భ గృహాలు కచ్చితమైన గది ఉష్ణోగ్రత వద్ద సంవత్సరం పొడవునా ఉంటాయి. పైగా ఇందులో ఇళ్లు చాలా సరసమైన ధరకే లభిస్తాయండోయ్. మూడు పడక గదుల ఇల్లు దాదాపు 26వేల అమెరికా డాలర్లకు వచ్చేస్తుంది. మన రూపాయల్లో చెప్పాలంటే... దాదాపు రూ.21.62 లక్షలు. అదే సమీపంలోని అడిలైడ్‌లో సగటు ఇంటి ధర 4.57 లక్షల అమెరికా డాలర్లు(దాదాపు రూ.3.80 కోట్లు). చూశారా ఎంత వ్యత్యాసం ఉందో?



ప్రయోజనాలివీ..

భూగర్భ పట్టణంలో నివసించడం వల్ల భూకంపాల నుంచి కొంత వరకు రక్షణ లభిస్తుంది. ఈగలు, దోమల, ఇతరత్రా కీటకాల బెడద ఉండదని స్థానిక నివాసి రైట్ వెల్లడించారు. అవి చీకటి, చలిలోకి రావడానికి ఇష్టపడవని వివరించారు. మనం కూడా ప్రస్తుతం అటు వేడితోనూ.. ఇటు దోమలతోనూ చాలా ఇబ్బందులు పడుతున్నాం.. ఇలాంటి భూగర్భ ఇళ్లేవో ఇక్కడ కూడా ప్లాన్ చేసుకుంటే బాగుంటుందేమో కదా?

- సాక్షి సెంట్రల్ డెస్క్

కేవైసీ కోసం క్యూ...

రేషన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరే!

- రేషన్ దుకాణాల వద్ద బారులుతీరుతున్న లబ్ధిదారులు
- ఈ–కేవైసీ సమస్యలపై కేంద్రానికి రాష్ట్రం లేఖ
- పట్టించుకోని కేంద్రం



సాక్షి, హైదరాబాద్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాల నుంచి బియ్యం, ఇతర సరుకులు తీసుకునేందుకు కేవైసీ (నో యువర్ కస్టమర్– మీ వినియోగదారుని తెలుసుకోండి) నమోదు తప్పనిసరి కాబోతుంది. రేషన్ దుకాణాల్లో అప్‌డేట్ చేసిన ఈపాస్ మిషన్ల ద్వారా కార్డులో నమోదైన వారందరి వేలి ముద్రలు తీసుకొని, వారి వివరాలు నమోదు చేసుకునే ప్రక్రియ ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో కూడా ఈ కేవైసీకి ఈనెల 5వ తేదీ నుంచి శ్రీకారం చుట్టారు. వేలి ముద్రలు వేయకుంటే రేషన్ కార్డులో పేరుండదు అనే ప్రచారం నేపథ్యంలో జిల్లా కేంద్రాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా వచ్చి ఈ కేవైసీ కోసం రేషన్ దుకాణాల వద్ద బారులుతీరి మరీ పేర్లు నమోదు చేయించుకుంటున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కూడా కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా ఈపాస్ మిషన్లను అప్‌గ్రేడ్ చేసి, కార్డుదారుల వేలి ముద్రలు తీసుకోవలసిందిగా అన్ని జిల్లాల అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో రేషన్ దుకాణాల్లో కార్డు దారుల వేలి ముద్రలు తీసుకుంటున్నారు.

మంత్రి లేఖకు స్పందించని కేంద్రమంత్రి

రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న వారంతా వేలిముద్రలు వేయాల్సిన నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉన్న వారు రాలేకపోతున్నారు. ఈ మేరకు ఈ కేవైసీ వల్ల తలెత్తుతున్న సమస్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఇటీవల సుదీర్ఘ లేఖ రాసి, ప్రభుత్వ ప్రతినిధి ద్వారా ఢిల్లీలో అందజేశారు. అయితే కేంద్రం నుంచి ఎలాంటి ప్రత్యుత్తరం రాలేదు. కాగా ఈ విషయమై మంత్రి గంగుల మాట్లాడుతూ రాష్ట్రంలోని రేషన్‌కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని , కార్డుదారుల పేర్లు ఎవరివీ తొలగించడం జరగదని స్పష్టం చేశారు. కేవైసీ విషయంలో మరోసారి సీఎంతో చర్చించి తమ నిర్ణయాన్ని కేంద్రానికి తెలియజేస్తామని తెలిపారు.

గడువు తేదీ ఏమీ లేదు: అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

ఈ కేవైసీకి తుది గడువు అంటూ ఏమీ లేదని పౌరసరఫరాల సంస్థ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ 'సాక్షి'కి తెలిపారు . కేవైసీలో వివరాలు ఇవ్వని కార్డుదారుల పేర్ల విషయంలో ఎలాంటి ఆదేశాలు లేవని, దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగానే వేలి ముద్రలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్డుల నుంచి ఎవరి పేర్లు తొలగించబోమని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు.









స్టోన్ స్టార్స్

ఫ్యాషన్

ఆభరణాలలో రాళ్లు అనగానే
మనకు వజ్ర వైఢూర్యాలు గుర్తుకు వస్తుంటాయి.
సంప్రదాయ ఆభరణాలలో పొదిగిన
రత్నాలు కళ్లముందు కనిపిస్తుంటాయి.
కానీ, వేషధారణలో ఇండోవెస్ట్రన్ స్టైల్‌ని ఇష్టపడినట్టే
ఆభరణాలనూ వెస్ట్రన్ లుక్‌ను తీసుకువస్తున్నారు డిజైనర్లు.
ధరించిన వెస్ట్రన్ డ్రెస్‌కు మరిన్ని హంగులు తీసుకురావడానికి
రంగు రంగుల రాళ్లతో ఫ్యాషన్ జ్యువెలరీ రూపుదిద్దుకుంటోంది.
స్టోన్ జ్యువెలరీని ధరించినవారు వేడుకలో ఎక్కడ ఉన్నా
స్టార్‌లలా మెరిసిపోతున్నారు.
స్టోన్ స్టార్స్ అని కితాబులు అందుకుంటున్నారు.




ఇటీవల అట్రాక్ట్ చేస్తున్న ఫ్యాషన్ జ్యువెలరీలో స్టోన్ ముందువరసలో ఉన్నాయి. వెడల్పాటి స్టోన్స్, బీడ్స్ కాంబినేషన్‌లో వస్తున్న జ్యువెలరీని నవతరం మరింతగా ఇష్టపడుతుంది.



బ్రాస్ మెటల్‌తో...

రాళ్లను పట్టి ఉంచాలంటే అందుకు తగిన గట్టి తీగల అల్లిక కూడా ఉండాలి. దానికి అనువైన లోహంగా ఇత్తడి డిజైనర్ల చేతిలో కొత్తగా మెరుస్తోంది. దీనితో స్టోన్ జ్యువెలరీని ఇండోవెస్ట్రన్ దుస్తులకు తగ్గట్టు ధరించేలా విన్నూతమైన డిజైన్స్‌ని మన ముందు కనువిందు చేస్తున్నాయి.. వందల రూపాయల నుంచి వేల రూపాయల వరకు ధర పలుకుతున్నాయి ఈ డిజైన్స్.











రంగు రాళ్లు

అచ్చమైన బంగారు ఆభరణాల్లో రత్నాలను పొదగడం చూస్తుంటాం. అయితే, ఇప్పుడు ఫ్యాషన్ జ్యువెల్రీలో రంగు రాళ్లను ఉపయోగించి డిజైన్స్ రూపొందిస్తున్నారు. సిల్వర్, స్టీల్ మెటల్‌తోనూ రంగు రాళ్లు కనువిందు చేస్తున్నాయి. తక్కువ ధరలో అతివల చూపులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

రాళ్లలోనూ రెప్లికా..

రాతి యుగంలో తమను తాము కాపాడుకోవడానికి రకరకాల లోహాలు, జంతువుల ఎముకలు, రంగు రాళ్లను ఆభరణాలుగా వాడుతూ వచ్చేవారు. నాగరికత మారుతున్న కొద్దీ డిజైన్స్‌లో మార్పులు వచ్చాయి కానీ, రాతి రూపం అలాగే ఉంటోంది. పిన్స్, బ్రోచెస్, రింగ్స్, పెండెంట్స్, నెక్లెస్‌లు, పొడవైన హారాలు, రాళ్ల వరసలు .. వీటిలో పూసలు కూడా జత చేరి మరింత హంగులతో స్టోన్ జ్యువెలరీ ముస్తాబు అవుతోంది. ఖరీదు ఎక్కువైన రత్నాలనే కాదు వాటి రెప్లికాలుగా రంగు రాళ్లతోనూ సంప్రదాయ, ఇండోవెస్ట్రన్ డిజైన్లు సృష్టిస్తున్నారు డిజైనర్లు.


బయోగ్రఫీ

'సావిత్రిబాయి పూలే ప్రతిరోజూ సంచిలో అదనంగా చీర పెట్టుకుని స్కూల్‌కు వెళ్లేవారు. దారిలో ఎవరో ఒకరు ఆమె మీద పేడ విసిరితే కడుక్కుని కట్టుకోవడానికి' అని రాస్తుంది రీతా రామస్వామి గుప్తా. నిమ్న వర్గాల ఆడపిల్లల విద్యకు జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలేమీద ఎన్నో పుస్తకాలు వచ్చాయి. కాని రచయిత్రి రీతా రామస్వామి మరిన్ని జీవిత చిత్రాలను సేకరించి తెచ్చిన పుస్తకం 'సావిత్రిబాయి పూలే' తాజాగా విడుదలైంది. రీతా రామస్వామి గురించి, పుస్తకంలో ఉన్న విశేషాల గురించి...

మహిళా విద్యకు తొలి వెలుతురు



సావిత్రిబాయి పూలే



'ఇవాళ బాలికల విద్య అనగానే ప్రపంచానికి మలాలా పేరు గుర్తుకొస్తుంది. కాని బాలికల విద్య కోసం జీవితాన్ని అర్పించిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే. మన దేశంలో ఆమె తొలి మహిళా ఉపాధ్యాయిని. ఆడపిల్లల చదువును ప్రచారం చేయడానికి ఆమె ఎదుర్కొన్న వ్యతిరేకత అంతా ఇంతా కాదు' అంటుంది రీతా రామస్వామి గుప్తా.

గతంలో నటుడు సంజీవ్ కుమార్‌పై రాసిన బయోగ్రఫీతో పాఠకులకు తెలిసిన రీతా రామస్వామి ఆ తర్వాత 'రంగ్ దే బసంతి' దర్శకుడు ఓం ప్రకాష్ మెహ్రాతో కలిసి అతని జీవిత సంగ్రహం రాసింది. 'ఇలా ఇంకొన్ని పుస్తకాలు రాయాలనుకుంటుండగా నా 18 ఏళ్ల కుమార్తె- అమ్మా... ఎందుకు నువ్వు ఎప్పుడూ మగ వాళ్ల గురించే రాస్తావు. నువ్వు రాయదగ్గ స్త్రీలు లేరా? అని ప్రశ్నించింది. ఆ ప్రశ్న నన్ను ఆలోచింపచేసింది. దానికి జవాబే నా కొత్త పుస్తకం- సావిత్రిబాయి పూలే.. హర్ లైఫ్.. హర్ రిలేషన్‌షిప్స్.. హర్ లెగసీ' అంది రీతా రామస్వామి. హార్పర్ కాలిన్స్ ఇండియా ప్రచురణ సంస్థ నుంచి ఈ పుస్తకం తాజాగా విడుదలైంది.



రీతా రామస్వామి

బలహీనులకు అందని విద్య

'బ్రిటిష్ వారు 1813లో క్రైస్తవ మిషనరీల ద్వారా మన దేశంలో పాశ్చాత్య విద్యకు అంకురార్పణ చేశారు. అయితే వారి ఉద్దేశాలు వేరే. తమ వ్యవహారాల కోసం ఇంగ్లిష్ తెలిసిన కొంతమంది ఉద్యోగులు అవసరం కనుక పై వర్గాల వారికి చదువు నేర్పిస్తే వారి నుంచి కింది వర్గాల వారికి చదువు అందుతుంది అని భావించారు. కాని పై వర్గాలకు మొదలైన చదువు కింది వర్గాల వరకూ చేరలేదు. కింది వర్గాల వారికి పాఠశాలల్లో అనుమతి లేని పరిస్థితి. అంటరానితనం విస్తృతంగా ఉండేది. ఇక చదువుకు ఆడపిల్లలు నిషిద్ధం చేయబడ్డారు. ప్రభుత్వ టీచర్లకు ఇంగ్లిష్ వచ్చి ఉండాలన్న నియమం కూడా బ్రిటిష్ ప్రభుత్వం పెట్టింది. వీటన్నింటినీ దాటి సావిత్రిబాయి పూలే టీచర్ అయ్యింది. జ్యోతిబా పూలేతో కలిసి 1848లో బ్రిటిష్ వారితో సంబంధం లేని, మిషనరీలతో సంబంధం లేని బాలికల తొలి పాఠశాలను మొదలెట్టింది. దిగువ వర్గాల బాలికల విద్య కోసం పోరాడింది' అంటుంది రీతా రామస్వామి.

ఆ ఇద్దరు

'సావిత్రిబాయి పూలే హర్ లైఫ్, హర్ రిలేషన్‌షిప్స్, హర్ లెగసీ'... పుస్తకంలో రీతా రామస్వామి కేవలం సావిత్రిబాయి పూలే గురించే రాయలేదు. ఆమెను ఆదర్శంగా తీసుకుని బాలికల విద్య కోసం తోడైన తొలి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ గురించీ... సావిత్రి, ఫాతిమా కలిసి మహారాష్ట్రలో బాలికల విద్య కోసం స్కూళ్లు స్థాపించి నిర్వహించ దానికి పడిన ఆరాటం గురించి కూడా రాసింది. 'ఫాతిమ షేక్ తొలి క్వాలిఫైడ్ ముస్లిం ఉమెన్ టీచర్ మన దేశంలో. ఆమె సావిత్రిబాయి పూలేకి బాసటగా నిలిచింది. ఒక దశలో సావిత్రిబాయి సుదీర్ఘకాలం జబ్బు పడితే స్కూళ్ల నిర్వహణభారం మోసింది. ఆ వివరాలన్నీ నా పుస్తకంలో ఉన్నాయి' అని తెలిపింది రీతా రామస్వామి.

ఎన్నెన్నో అవమానాలు

'దిగువ వర్గాల వారిలో ఆడపిల్లలకు చదువెందుకు అనే భావన విపరీతంగా ఉండేది. వాళ్లకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేసే వారు. కాని వారి ఇళ్లకు వెళ్లి బడికి పంపమని కోరేది సావిత్రి. వారు శాపనార్థాలు పెట్టేవారు. దారిన పోతూ ఉంటే రాళ్లు విసిరేవారు. దానికి తోడు పేద వర్గాల వారిని చదివిస్తున్నందుకు అగ్ర వర్ణాలు కక్ష కట్టి సావిత్రిబాయి మీద పేడనీళ్లు చల్లేవారు. అందుకని ఆమె స్కూలుకు వెళుతున్నప్పుడు తన సంచిలో చీర అదనంగా పెట్టుకునేది. ఎవరైనా పేడ నీళ్లు చల్లినా వెరవకుండా స్కూలుకు వెళ్లి చీర మార్చుకుని పాఠాలు చెప్పేది. ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగడం వల్ల మన దేశంలో బాలికల విద్య గణనీయంగా పెరిగింది. చదువులో ఉద్యోగాల్లో అమ్మాయిలు గొప్పగా రాణిస్తున్నారు. వారంతా తప్పక తెలుసుకోవాల్సిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే' అంది రీతా రామస్వామి.

వంటిల్లు



ఆకు రుచులు

పిల్లల నుంచి
పెద్దల వరకు ఆకుకూర అనగానే...
ఆమడ దూరం పరిగెడతారు.
పోషకాలు ఎక్కువగా ఉండే ఆకుకూరలను
ఎలాగైనా మీ వాళ్లకు తినిపించాలనుకుంటున్నారా?
అయితే ఈ వారం మన 'వంటిల్లు'ను
ఫాలో అయిపొండి...

తోటకూర ఉండలు



కావలసినవి: తోటకూర తరుగు – మూడు కప్పులు; సెనగపిండి – అరకప్పు; పచ్చిమిర్చి – నాలుగు; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా. తాలింపు కోసం: నువ్వులు – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఎండు మిర్చి – రెండు; ఆవాలు – అర టీస్పూను; ఇంగువ – చిటికెడు; నూనె – రెండు టీస్పూన్లు.

తయారీ: ● పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోవాలి ● ఒక గిన్నెలో తోటకూర తరుగు, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, కారం, జీలకర్ర, సెనగపిండి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దగా కలపాలి ● పిండి ముద్దను మీడియం సైజు ఉండలుగా చుట్టి సలసలా కాగుతున్న నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి ● ఇప్పుడు తాలింపు కోసం తీసుకున్న దినుసులతో తాలింపు పెట్టాలి● వేయించి పక్కన పెట్టుకున్న తోటకూర ఉండలను ఈ తాలింపులో వేసి ఉండలకు తాలింపు గింజలు పట్టేటట్లు కలపాలి ● చివరిగా పచ్చికొబ్బరి తురుమును ఉండలపై చల్లాలి ● వేడివేడి మసాలా టీతో ఈ తోటకూర ఉండలు చాలా రుచిగా ఉంటాయి.

పెసర-పాలకూర ఇడ్లీ



కావలసినవి: పెసరపప్పు – కప్పు; పాలకూర – కప్పు; నూనె – రెండు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కారం – పావు టీస్పూను; వంట సోడా – పావు టీస్పూను.

తయారీ: ●పెసర పప్పును శుభ్రంగా కడిగి ఐదారు గంటలు నాన బెట్టుకోవాలి ●నానిన పప్పును మెత్తగా గ్రైండ్ చేయాలి ●పాలకూరను కూడా శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర పేస్ట్‌లో రుబ్బిన పెసర పప్పు, కారం, వంటసోడా, రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా సోడా ఉప్పు వేసి కలపాలి ● పిండిని మరీ జారుడుగా కాకుండా తగినంత నీటిని చేరుస్తూ ఇడ్లీ పిండిలా కలుపుకోవాలి ● ఇడ్లీప్లేటుకు కొద్దిగా నూనె రాసి పిండిని ఇడ్లీ ప్లేటులో వేసి ఆవిరి మీద ఉడికించాలి ● పదిహేను లేదా ఇరవై నిమిషాలు ఉడికిస్తే ఇడ్లీ రెడీ ● పెసర పాలకూర ఇడ్లీలను పుదీనా చట్నీ లేదా సాంబార్‌తో వేడిగా వడ్డించాలి.

బతువా పకోడీ



కావలసినవి: సెనగపిండి – రెండు టేబుల్ స్పూన్లు; గోధుమపిండి – రెండు టేబుల్ స్పూన్లు; బతువా(పప్పు ఆకు) తరుగు – కప్పు; పాలకూర తరుగు – అరకప్పు; పన్నీర్ తురుము – పావు కప్పు; పాలు – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – అర టీస్పూను; ఉప్పు, మిరియాల పొడి – రుచికి సరిపడా; చాట్ మసాలా – ఒకటిన్నర టీస్పూన్లు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక గిన్నెలో పదార్థాలన్నింటి వేసి కలపాలి ● దీనిలో రుచికి సరిపడినంత ఉప్పు; మిరియాలపొడి కొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పకోడీపిండిలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి ● మరుగుతున్న నూనెలో పిండిని పకోడీల్లా వేసి దోరగా వేయించి తీయాలి ●వేడివేడి పకోడీలపై చాట్ మసాలా చల్లి సర్వ్ చేసుకోవాలి.

బచ్చలి జొన్న పరోటా



కావలసినవి: జొన్న పిండి – కప్పు; గోధుమ పిండి – అరకప్పు; బచ్చలి ఆకు పేస్ట్– రెండు కప్పులు; అల్లం తరుగు – పావు టీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; పసుపు – పావు టీస్పూను; నీళ్లు – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా. నూనె – పరోటా కాల్చడానికి తగినంత.

తయారీ: అరకప్పు నీళ్లలో చిటికెడు ఉప్పువేసి వేడిచేయాలి ● మరుగుతున్న నీటిలో జొన్నపిండి వేసి నాలుగు ఐదు నిమిషాలు కలుపుతూ మగ్గనిచ్చి దించేయాలి ● ఇప్పుడు జొన్న పిండిలో బచ్చలి ఆకు పేస్టు వేసి కలపాలి ● అల్లం తరుగు, జీలకర్ర, పసుపు, గోధుమ పిండివేసి కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● నానిన పిండిని చిన్న చిన్న ఉండలుగా చుట్టుకుని పరోటాల్లా వత్తుకోవాలి ● కొద్దిగా నూనె వేస్తూ రెండువైపులా చక్కగా కాల్చుకుంటే బచ్చలి జొన్నపరోటా రెడీ.

గ్రీన్ దోశ



కావలసినవి: బియ్యం – కప్పు; మినప పప్పు – కప్పు; మెంతులు – టీస్పూను; కొత్తిమీర – కప్పు; పుదీనా – కప్పు; కరివేపాకు – అర కప్పు; జీలకర్ర – అరటీస్పూను; వాము – చిటికెడు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – నాలుగు; ఉప్పు – టీస్పూను; నూనె – పావు కప్పు.

తయారీ: ● బియ్యం, మినప పప్పు, మెంతులను శుభ్రంగా కడిగి ఐదు గంటలపాటు నానబెట్టుకోవాలి ● నానాక వీటన్నింటినీ గ్రైండర్‌లో వేసి రుబ్బుకోవాలి ● సగం మెదిగిన తరువాత అందులో కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, ఉల్లిపాయ, పచ్చిమిర్చిలను వేయాలి ● అవసరాన్ని బట్టి నీళ్లు చల్లుకుంటూ పిండిని మెత్తగా రుబ్బుకోవాలి ● చక్కగా మెదిగిన పిండిని గిన్నెలో తీసుకుని అందులో ఉప్పు, జీలకర్ర, వాము కలపాలి ● కాలిన పెనం పైన పిండిని దోశలా పోసుకుని కొద్దిగా నూనె వేయాలి ● రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే ఎంతో రుచికరమైన గ్రీన్ దోశ రెడీ.

గోంగూర బజ్జీ



కావలసినవి: తాజా గోంగూర – కప్పు; సెనగపిండి – కప్పు; బియ్యప్పిండి – మూడు టేబుల్ స్పూన్లు; కారం – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; ఇంగువ – చిటికెడు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – పావు కేజీ.

తయారీ: ● గోంగూరను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● సెనగపిండిలో బియ్యప్పిండి, ఇంగువ, కారం, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● కొద్దిగా నీళ్లుపోసి చిక్కగా కలుపుకోవాలి. చివరిగా టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి ● ఇప్పుడు గోంగూర ఆకులను ఈ పిండిలో ముంచి మరుగుతోన్న నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి ● నూనె ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తే బజ్జీలను టిష్యూ పేపర్ మీద వేసి, నూనెను పేపర్ పీల్చుకున్న తరువాత సర్వ్ చేసుకోవాలి.



● మ్యూజిక్ వరల్డ్

గీతాంజలి

తన యూనిక్ స్టైల్‌తో నటిగా మంచి పేరు తెచ్చుకున్న అంజలి శివరామన్ చక్కని గాయని కూడా. 'నా నటనకు గానం అనేది ఎంతో ఉపయోగపడింది. క్రమశిక్షణతో ఉండడానికి కారణం అయింది. నన్ను నేను వ్యక్తీకరించుకునే సాధనం అయింది' అంటుంది అంజలి. సింగర్ చిత్ర అయ్యర్ కూతురైన అంజలికి చిన్నప్పటి నుంచే స్వరాలతో స్నేహం ఏర్పడింది. స్కూల్ ఫంక్షన్‌ల నుంచి ఫ్యామిలీ ఫంక్షన్‌ల వరకు అంజలి పాట వినిపించాల్సిందే. పాటలు అంటే ఇష్టం ఉన్నప్పటికీ మ్యూజిక్ క్లాస్‌కు తరచుగా బంక్ కొట్టేది. ఆ తరువాత మాత్రం సంగీత శిక్షణ ప్రాముఖ్యత తెలుసుకొని ప్రతిరోజూ క్లాస్‌కు తప్పకుండా హాజరయ్యేది.

'సంగీతం నా రక్తంలోనే ఉంది' అంటుంది అంజలి, అంజలి నోట పాట విన్న వారు...'అమేజింగ్ వాయిస్' అనకుండా ఉండలేరు.

'జాజ్ బ్లూస్ తన స్టైల్ ఆఫ్ మ్యూజిక్'గా చెబుతుంది అంజలి. ముంబైలోని ఒక మ్యూజిక్ స్టూడియోలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అంజలి యాదృచ్ఛికంగా నటనరంగంలోకి వచ్చింది. మోడలింగ్, టీవీ కమర్షియల్స్ ద్వారా గుర్తింపు పొందిన అంజలి క్రైమ్ డ్రామా థ్రిల్లర్ 'క్లాస్'లో లీడ్‌రోల్ పోషించింది. సుహాని అహుజా పాత్రతో మంచి మార్కులు కొట్టేసింది.

అవును...ఇది నిజమే!



● 1987లో స్పైడర్-మ్యాన్, మేరీ జేన్‌ల వివాహాన్ని ప్రచురణ సంస్థ మార్వెల్ కామిక్స్ ఘనంగా జరిపించింది. కాల్పనిక క్యారెక్టర్‌లకు పెళ్లి ఏమిటి? అనుకుంటున్నారా! మరి అదే ఈ పెళ్లి ప్రత్యేకత. ఫిక్షన్, రియాలిటీకి మధ్య హద్దులను చెరిపేయడానికి ఇట్టి వివాహాన్ని తలపెట్టారు. న్యూయార్క్‌లో జరిపిన ఈ మాక్ సెర్మనీకి హీరోల నుంచి మొదలు స్పైడర్-మ్యాన్ ఫ్యాన్స్ వరకు ఎందరో హాజరయ్యారు.

● సింగర్ టేలర్ స్విఫ్ట్‌పై స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ(యూఎస్) ఇంగ్లీష్ డిపార్టుమెంట్ ఒక కోర్సును రూపొందించింది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు టేలర్ ఆల్బమ్స్, లిరిక్స్‌కు క్లాసిక్ లిటరేచర్‌కు మధ్య ఉండే సారూప్యతను విశ్లేషించాల్సి ఉంటుంది.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

ది రియల్ మెకాయ్



చెప్పిన విషయం వాస్తవమే అబద్ధం కాదు, ఈ వస్తువు ఒరిజినలే...ఇలాంటి సందర్భంలో ఉపయోగించే మాట...ది రియల్ మెకాయ్. ఉదా: వుయ్ హ్యావ్ సీన్ సో మెనీ రీప్రొడక్షన్స్ ఆఫ్ ది మోనాలీసా, బట్ వెన్ వుయ్ వర్ ఇన్ ప్యారిస్ వుయ్ సా ది రియల్ మెకాయ్.

● సక్సెస్ స్టోరీ


కైవల్య వోహ్రా
అదిత్ పలీచా

నంబర్‌వన్ కుర్రాళ్లు

బెంగళూరుకు చెందిన కైవల్య వోహ్రా, ముంబైకి చెందిన అదిత్ పలీచా స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ(యూఎస్)లో కంప్యూటర్ సైన్స్ డిగ్రీని మధ్యలోనే వదిలేసి 'ఏదైనా సాధించాలి' అనే లక్ష్యంతో స్వదేశానికి వచ్చారు. 'జెప్టో' స్టార్టప్‌తో తిరుగులేని విజయాన్ని సాధించారు.

తాజాగా లింక్డిన్ 'టాప్ 25 స్టార్టప్'ల జాబితాలో ఇ-కామర్స్ గ్రాసరీ ప్లాట్‌ఫామ్ 'జెప్టో' మొదటి స్థానంలో నిలిచింది. చిన్న వయసులోనే తమ స్టార్టప్ 'జెప్టో'ను యూనికార్న్ స్టేటస్‌కు తీసుకెళ్లిన కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు...

లాక్‌డౌన్ సమయంలో తమకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంటే బహుశా 'జెప్టో' స్టార్టప్ పుట్టేది కాదేమో. ఆ సమయంలో ముంబైలోని అద్దె ఇంట్లో ఉంటున్న కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు నిత్యావసర వస్తువులకు బాగా ఇబ్బంది పడ్డారు. ఆ ఇబ్బందుల్లో నుంచే 'కిరాణామార్ట్' స్టార్టప్ పుట్టింది. ఇదే ఆ తరువాత 'జెప్టో' రూపంలో విశ్వరూపాన్ని చూపించింది.

తిరుగు లేని విజయాలు సాధించడానికి వయసు అడ్డు కాదని, అనుభవం అత్యవసరం కానక్కర్లేదని, కృషి పట్టుదల ఉంటే సరిపోతుందని 'జెప్టో' అసాధారణ విజయం నిరూపించింది. ఆరోజుల్లోకి వెళితే...

'మాకు సవాలు విసిరిన టైమ్ అది. నిజానికి కిరాణాషాప్‌ల గురించి మాకు అంతగా తెలియదు. క్రాష్ కోర్సులు కాలేజీల్లోనే కాదు వాటికి అవతల కూడా ఉంటాయి! రోజూ పొద్దున్నే పది నుంచి ఇరవై కిరాణాషాప్‌లకు వెళ్లి యజమానులతో వివరంగా మాట్లాడి మా కాన్సెప్ట్ చెప్పేవాళ్లం. పిల్లలేదో చెబుతున్నారు...విందాం...అన్నట్లుగా వినేవారు తప్ప మాపై వారికి అంతగా నమ్మకం ఉన్నట్లుగా అనిపించేది కాదు. మా యాప్‌ను కొద్దిమంది మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవడానికి అంగీకరించేవారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు కైవల్య వోహ్రా.

పరిస్థితులను చూస్తుంటే...

'అబ్బే ఇదేదో మనకు వర్కవుట్ అయ్యేట్లు లేదు. మిత్రమా...రథం వెనుక్కు మళ్లించు' అనుకునే పరిస్థితి. కానీ వారు వెనక్కి తగ్గలేదు. ఎందుకంటే 'సక్సెస్ మంత్రా'లో ఒక రూల్....యుద్ధం చేయకుండానే ఓటమిని అంగీకరించకు. రణస్థలి వరకు మాత్రమే వెళ్లారు. ఇంకా యుద్ధం మొదలే కాలేదు.

వారి కృషి ఫలితంగా మెల్లగా యాప్ ఊపందుకుంది.

'ఇక సాధించినట్లే' అనే సంతృప్తితో తబ్బిబ్బై ఉంటే ఆ సంతోషం ఆ సమయానికే పరిమితమై ఉండేదేమో! కాని వారు ' ఇది చాలు' అనుకోలేదు. ' ఇంకా కావాలి' అనుకున్నారు. మళ్లీ కిరాణాదుకాణాల బాట పట్టారు. సలహాలు, సూచనలకు సంబంధించి యజమానుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వస్తువులను డెలివరీ చేసిన ప్రతిసారీ కస్టమర్‌తో మాట్లాడేవారు. వారికి నచ్చింది ఏమిటి? నచ్చంది ఏమిటి? అడిగే తెలుసుకునేవారు.

వారి 'అనుభవ జ్ఞానం' అనే పుస్తకంలో ఒకప్పుడు అన్నీ తెల్ల పేజీలే! ఇప్పుడు అవి విలువైన అనుభవాలతో కూడిన అక్షరాలు, పాఠాలు అయ్యాయి.

'ఇక సాధించినట్లే' అనే సంతృప్తితో తబ్బిబ్బై ఉంటే ఆ సంతోషం ఆ సమయానికే పరిమితమై ఉండేదేమో! కాని వారు 'ఇది చాలు' అనుకోలేదు. ' ఇంకా కావాలి' అనుకున్నారు. మళ్లీ కిరాణదుకాణాల బాట పట్టారు. సలహాలు, సూచనలకు సంబంధించి యజమానుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వస్తువులను డెలివరి చేసిన ప్రతిసారీ కస్టమర్‌తో మాట్లాడేవారు. వారికి నచ్చింది ఏమిటి? నచ్చంది ఏమిటి? అడిగే తెలుసుకునేవారు. వారి 'అనుభవ జ్ఞానం' అనే పుస్తకంలో ఒకప్పుడు అన్నీ తెల్ల పేజీలే! ఇప్పుడు అవి విలువైన అనుభవాలతో కూడిన అక్షరాలు, పాఠాలు అయ్యాయి.

ఇప్పుడు...

'జెప్టో' మన దేశంలోని ప్రధాన నగరాలలో మూడు వేలకు పైగా గ్రాసరీ ప్రొడక్స్‌ను డెలివరీ చేస్తుంది. గంటలు దాటని, కస్టమర్ ఓపికను పరీక్షించని అతి తక్కువ సమయ డెలివరీ టైమ్‌ను నిర్దేశించుకుంది. ఇద్దరితో మొదలైన 'జెప్టో'లో ఇప్పుడు వెయ్యిమంది ఉద్యోగులు ఉన్నారు.

'జెప్టో' సక్సెస్‌లో 'యూజర్ ఎక్స్‌పీరియెన్స్' కీలక భూమిక పోషించింది,

'విజయానికి త్యాగానికి సంబంధం ఉందా?' అని అడిగితే 'కచ్చితంగా ఉంది' అంటాడు కైవల్య వోహ్రా.

'ఏ వయసు ముచ్చట ఆ వయసులో' అంటారు. ఆడి పాడాల్సిన రోజుల్లో, సినిమాలు, షికార్లు, స్నేహితులే ప్రధాన మనిపించే రోజుల్లో అన్నీ విడిచిపెట్టి 'మా స్టార్టపే మా ప్రపంచం' అన్నట్లుగా పగలు,రాత్రి కష్టపడ్డారు.

'మనం ఒక రంగంలో విజయం సాధించాలంటే మన ఇష్టాలకు దూరంగా ఉండక తప్పదు. దీన్ని త్యాగం అనుకోవచ్చు' అంటాడు కైవల్య వోహ్రా.

మన దేశ గ్రాసరీ సెగ్మెంట్‌లో తమదైన ముద్ర వేసిన కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు 'యంగెస్ట్ సెల్ఫ్-మేడ్ మిలీయనీర్స్'గా యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు.

● టెక్.. టాక్



లావా బ్లేజ్ ప్రో 5జీ

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్స్ ర్యామ్: 8జీబి స్టోరేజీ: 128జీబి బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 రిజల్యూషన్: 1080×2460 పిక్సెల్స్ రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్

మైక్రోసాఫ్ట్ స్విఫ్ట్‌కీలో కొత్త ఏఐ ఫీచర్‌లు



మైక్రోసాఫ్ట్ తమ పాపులర్ కీబోర్డ్ యాప్ స్విఫ్ట్‌కీలో కొత్త ఏఐ ఆధారిత ఫీచర్‌లను(ఐవోఎస్, ఆండ్రాయిడ్) యాడ్ చేసింది. కొత్త ఏఐ-పవర్డ్ కెమెరా లెన్సెస్‌తో వీడియోలు, ఫొటోలు, జీఐఎఫ్‌లను యూజర్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిలో 250కి పైగా టూల్స్, ఫిల్టర్స్ ఉన్నాయి. 'లెన్సెస్'ను ఉపయోగించడానికి బింగ్ టూల్‌బార్ ఎడమ వైపున ఉన్న త్రీ డాట్స్‌ను ట్యాప్ చేసి 'కెమెరా'ను సెలెక్ట్ చేయాలి.

బింగ్ ఇమేజ్ జనరేటర్(పవర్డ్ బై డాల్-ఇ)కు షార్ట్‌కట్ కూడా యాడ్ చేసింది స్విఫ్ట్‌కీ. డిస్క్రిప్షన్‌లో టైప్ చేయడం ద్వారా బింగ్ ఇమేజ్ క్రియేటర్‌తో ఇమేజ్‌లను జనరేట్ చేయవచ్చు. పర్సనలైజ్‌డ్ స్టిక్కర్‌లను క్రియేట్ చేసి, సెండ్ చేయడానికి న్యూ స్టిక్కర్ జెనరేషన్ టూల్‌ను యాడ్ చేసింది మైక్రోసాఫ్ట్.



గోప్రో హీరో 12 బ్లాక్ కెమెరా

వీడియో రిజల్యూషన్: 5.3కే60, 4కే120 మరియు 2.7కే240
● వాటర్‌ప్రూఫ్ ● బ్లూటూత్ ● ప్రో-లెవెల్ ఫీచర్స్
● న్యూ హెచ్‌డీఆర్ (హై డైనమిక్ రేంజ్) 5.3కే అండ్ 4కే వీడియో ● వాటర్-రిపెలెంట్ లెన్స్ కవర్ ● బిల్ట్-ఇన్ హరైజన్ లాక్ ● లార్జర్ ఇమేజ్ సెన్సర్

యూట్యూబ్ క్రియేట్



క్రియేటర్‌ల కోసం యూట్యూబ్ 'యూట్యూబ్ క్రియేట్' అనే కొత్త యాప్‌ను తీసుకువచ్చింది. షార్ట్, లాంగ్ వీడియోలను రూపొందించడానికి అనువైన ఉచిత టూల్స్ దీనిలో ఉంటాయి. ఎడిటింగ్ ప్రాసెస్‌లో క్రియేటర్‌లకు ఇది సహాయపడుతుంది. మూడు వేల మంది క్రియేటర్‌లతో మాట్లాడి ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో వేలాది స్టిక్కర్లు, జీఐఎఫ్, రకరకాల ఎఫెక్ట్‌లు అందుబాటులో ఉంటాయి. యూట్యూబ్ లైబ్రరీ రాయల్టీ-ఫ్రీ ట్రాక్స్‌తో 'క్రియేట్' యాప్ యాక్సెస్ కలిగిస్తుంది. దీని ద్వారా క్రియేటర్‌లు వేలాది పాటలను ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. ఆడియో క్లీనప్‌కు కూడా ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. అవసరం లేని బ్యాక్‌గ్రౌండ్ సౌండ్స్‌ను తొలగించవచ్చు. వీడియోకు ఆటోమేటిక్‌గా కాప్షన్‌ను జెనరేట్ చేయవచ్చు.



స్వాప్‌కార్ట్ యుఎస్‌బీ రీడింగ్ ల్యాంప్

బ్రాండ్: స్వాప్‌కార్ట్ స్టైల్: మోడ్రన్
ప్రాడక్ట్ డైమెన్షన్స్: 5డీ×5 డబ్ల్యూ× 5 హెచ్ సెంటీమీటర్స్
కలర్: సిల్వర్ మెటీరియల్: మెటల్ లైట్‌సోర్స్: ఎల్‌ఈడీ

సినిమా


● రణ్‌బీర్ కపూర్


● రకుల్ ప్రీత్‌సింగ్

నాకన్నా చెడ్డవాడు లేడు!

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'యానిమల్'. రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్. అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రీ ముఖ్య పాత్రలు చేశారు. భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషణ్ కుమార్, మురాద్ ఖేతని నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న విడుదల కానుంది. గురువారం రణ్‌బీర్ బర్త్ డే సందర్భంగా 'యానిమల్' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'జ్యోతి... క్రిమినల్‌ను కన్నాం మనం.. (అనిల్ కపూర్), 'మై ఫాదర్ ఈజ్ ది బెస్ట్ ఫాదర్ ఇన్ ది వరల్డ్.. డోన్ట్ ఎవర్ గో దేర్, నేను చెడును వెంటాడుతూ వెళ్లాను. నాకెక్కడా కనపడలేదు. నాలో నేను చూసుకున్నాను. నాకన్నా చెడ్డవాడు లేడు' (రణ్‌బీర్) అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగులోనూ ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఇస్మార్ట్ యాక్షన్


● సంజయ్ దత్, పూరి జగన్నాథ్, రామ్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన తొలి చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. 2019లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా రామ్, పూరీల కాంబినేషన్‌లోనే 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం రూపొందుతోంది. హై బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా గురువారం పూరి జగన్నాథ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా హీరో రామ్, కీలక పాత్ర చేస్తున్న సంజయ్ దత్‌తో పూరి జగన్నాథ్ ఉన్న వర్కింగ్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 18న రిలీజ్ కానుంది.

ఓ సవాల్‌గా ఈ సినిమా చేశాం - శ్రీకాంత్ అడ్డాల

"కొత్త బంగారు లోకం', 'ముకుందా' ఇలా కొత్తవాళ్లతో సినిమాలు చేసిన అనుభవం నాకుంది. కొత్తవారితో పని చేయడం ఫ్రెష్‌గా బాగుంటుంది. అలా ఇప్పుడు 'పెదకాపు 1' చేశాను. అయితే కొత్తవాళ్లతో రెండు భాగాలుగా 'పెదకాపు' వంటి భారీ బడ్జెట్ సినిమా తీయడం దర్శకుడిగా నాకో సవాల్. ఇంత ఖర్చు చేస్తున్నారు కాబట్టి సినిమాలో బాగా నటించడం అనేది విరాట్ ముందున్న సవాల్. సినిమా నిర్మాణం సజావుగా సాగేలా చేయడం రవీందర్ రెడ్డిగారి ముందున్న చాలెంజ్. 'పెదకాపు 1'లో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకుని బాధ్యతతో పని చేశారు" అన్నారు దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల. విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'పెదకాపు 1'. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో శ్రీకాంత్ అడ్డాల చెప్పిన విశేషాలు.

● 1982, 83 సమయాల్లో చోటు చేసుకున్న కొన్ని రాజకీయ సమీకరణాలకు కొంత ఫిక్షన్‌ను జత చేసి ఈ సినిమాను తెరకెక్కించాం. ఆ సమయంలో మా ఊర్లోని రాజకీయాల్లో మా నాన్నగారు క్రియాశీలకంగా ఉండేవారు. ఓ రకంగా ఈ సినిమాకు మా నాన్నగారు కూడా ఓ స్ఫూర్తి. ఇది ప్రత్యేకంగా ఏ కులానికీ సంబంధించిన చిత్రం కాదు. ఓ సారి ఓ ఊరికి వెళ్లినప్పుడు బోర్డుపై ఓ వ్యక్తి పేరు పక్కన 'పెదకాపు' అని ఉంది. అలా ఎందుకు అని అక్కడివారిని అడిగితే... పది మందిని కాపాడుతూ, పది మందికి సాయం చేసే వారిని పెదకాపుగా పిలుస్తామని చెప్పారు. మనం చెబుతున్న కథ కూడా ఈ తరహాలోనే ఉంటుంది కాబట్టి 'పెదకాపు' టైటిల్ పెడదామని నిర్మాత రవీందర్‌గారితో చెప్పినప్పుడు బాగుంది.. సరే అన్నారు.

● ఓ సామాన్యుడి పోరాటమే ఈ సినిమా కథ. అందరికీ కనెక్ట్ అవుతుంది. సాధారణంగా కొత్తవారి కోసం కథలు రాసుకుంటుంటాం. ఇలా నేను రాసుకున్న కథల్లో 'పెదకాపు' ఒకటి. కథగా ఉన్నప్పుడే రెండు భాగాలుగా తీయాలనుకున్నాం. విరాట్ కర్ణకు ఇది తొలి సినిమా. మొదటి చిత్రానికి ప్రతి హీరోకు కొన్ని కష్టాలుంటాయి. అయితే విరాట్‌తో నటింపజేసే బాధ్యత ఓ దర్శకుడిగా నాది. తన నుంచి మంచి నటన రాబట్టుకున్నా. ఈ చిత్రానికి మిక్కీ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ. చోటాగారు మంచి విజువల్స్ ఇచ్చారు

● 'పెదకాపు'లో నేను చేసిన పాత్రకు ముందు ఓ మలయాళ నటుడిని అనుకున్నాం. కొన్ని కారణాల వల్ల ఆయన సెట్స్‌కు రాలేదు. నాగబాబు, రావు రమేష్‌గార్లు ఇలా చాలామందితో కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. ప్రొడక్షన్ ఖర్చు కనిపిస్తోంది. దీంతో ఆ పాత్రను నేనే చేశాను. ఈ సినిమాకి నేను రాసిన డైలాగ్స్‌కు మంచి స్పందన వస్తుండటం హ్యాపీగా ఉంది. 'నీకే అంత ఉంటే మాకు ఎంత ఉండాలి' అనే డైలాగ్ అందరికీ చాలా కనెక్ట్ అయ్యింది. ఆల్రెడీ వేసిన కొన్ని ప్రీమియర్స్‌లో మంచి స్పందన వచ్చింది. ఆ డైలాగ్ కొన్నేళ్లు నిలిచిపోతుంది. ఇక 'అన్నాయ్' అనే మల్టీస్టారర్ కథ నా దగ్గర ఉంది. నా తర్వాతి ప్రాజెక్ట్ గీతా ఆర్ట్స్‌లో ఉంటుంది.




● నీనా గుప్తా

నవ్వించడానికి రెడీ

రకుల్ ప్రీత్ సింగ్ నవ్వించడానికి, థ్రిల్ చేయడానికి రెడీ అయ్యారు. ఆమెతో పాటు నీనా గుప్తా కూడా చేతులు కలిపారు. ఈ ఇద్దరూ కలిసి చేసే కామెడీ, థ్రిల్‌ని వచ్చే ఏడాది వెండితెరపై చూడొచ్చు. రకుల్, నీనా గుప్తా లీడ్ రోల్స్‌లో ఓ చిత్రం రూపొందనుంది. కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు ఆశిష్ ఆర్. శుక్లా తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని సునీల్ కేతర్‌పాల్ నిర్మించనున్నారు. రకుల్ ఓ లీడ్ రోల్‌లో నటించిన 'ఐ లవ్ యు'కి కూడా కేతర్‌పాల్‌నే నిర్మాత. ఈ ఏడాది జూన్‌లో ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో విడుదలైంది. అయితే తాజా చిత్రాన్ని మాత్రం థియేటర్స్‌లోనే విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ని అక్టోబర్‌లో ఆరంభించి, డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది ఆరంభంలో ఈ చిత్రం విడుదలయ్యే చాన్స్ ఉంది.

మనం లాంటి అనుభూతి కలుగుతుంది - సుధీర్ బాబు


● హర్షవర్ధన్, సుధీర్ బాబు

''మామా మశ్చీంద్ర'లో త్రిపాత్రాభినయం చేశాను. ఏయన్నార్ ఫ్యామిలీ నటించిన 'మనం' చూసినప్పుడు అరుదైన సినిమాగా ఎలా అనుభూతి చెందారో, 'మామా మశ్చీంద్ర' చూశాక అలాంటి అనుభూతే కలుగుతుంది. ఈ సినిమాతో హర్షవర్ధన్ టాప్ డైరెక్టర్ అవుతారు'' అన్నారు సుధీర్ బాబు. హర్షవర్ధన్ దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా నటించిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. ఇషా రెబ్బా, మృణాలినీ రవి హీరోయిన్లు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో మహేశ్ బాబు షేర్ చేశారు. ''మనం' రచయితగా మీ అందరి ప్రేమాభిమానాలు పొందాను. ఇంతకాలం విరామం తీసుకొని 'మామా మశ్చీంద్ర' చేయడానికి కారణం.. ప్రేక్షకుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని'' అన్నారు హర్షవర్ధన్. ''ఈ చిత్రంలో ప్రతి పదిహేను నిమిషాలకు ఒక మలుపు, సర్‌ప్రైజ్ వస్తుంది'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు.

కోడిబాయె లచ్చమ్మది


● తలసాని శ్రీనివాస్, దినేష్ తేజ్

దినేష్ తేజ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాలోని మాస్ సాంగ్ 'కోడిబాయె లచ్చమ్మది..'ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేసి, మాట్లాడుతూ – ''యంగ్ టాలెంట్ తీసే చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఈ చిత్రాన్ని కూడా ఆదరించాలి. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. సుభాష్ ఆనంద్ స్వరపరిచిన 'కోడిబాయె..' పాటను మంగ్లీ పాడగా, భాను నృత్యరీతులు సమకూర్చారు. ''ఈ పాటలో దినేష్ తేజ్, హెబ్బా పటేల్‌ల మాస్ స్టెప్స్ ఆకట్టుకునే విధంగా ఉంటాయి. తెలంగాణ నుంచి మరో జానపదం చార్ట్ బస్టర్‌గా నిలవనుంది. సినిమాలోని అన్ని పాటలనూ చంద్ర బోస్ గారు రాశారు '' అని యూనిట్ పేర్కొంది.

యూత్‌ఫుల్ మ్యాడ్ - నాగవంశీ

''మ్యాడ్ యూత్‌ఫుల్ సినిమా అయినప్పటికీ కుటుంబమంతా చూసేలా ఉంటుంది. లాజిక్‌లు, ట్విస్ట్‌లు ఉండవు. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వుతూనే ఉంటారు. 'జాతి రత్నాలు' చిత్రం కంటే ఒక్కసారైనా తక్కువ నవ్వానని ఎవరైనా చెబితే.. టిక్కెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తాం'' అని నిర్మాత నాగవంశీ అన్నారు. రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, శ్రీగౌరీప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ కీలక పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ–''నా 'జాతిరత్నాలు' కంటే 'మ్యాడ్' బాగా నచ్చింది '' అన్నారు. ''ఈ సినిమాలో వినోదం మాత్రమే ఉంటుంది'' అన్నారు కల్యాణ్ శంకర్.



థ్రిల్ చేసే విధి


● రోహిత్ నందా, ఆనంది

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ రచన, దర్శకత్వంలో ఎస్. రంజిత్ నిర్మించిన చిత్రం 'విధి'. ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రోహిత్ నందా మాట్లాడుతూ– ''విధి' మాకెంతో స్పెషల్ మూవీ. ఆడియో డిస్క్రిప్టివ్ టెక్నాలజీతో ఈ సినిమాను చేశాం. దీంతో కంటి చూపు లేనివాళ్లు కూడా మా సినిమాను అనుభూతి చెందగలరు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాలగారు అద్భుతమైన ఆర్‌ఆర్, సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన మూవీ 'విధి'' అన్నారు నిర్మాత రంజిత్. ''మాకు ఇది తొలి సినిమా. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శ్రీకాంత్, శ్రీనాథ్. ''వినోదం మాత్రమే కాదు.. థ్రిల్లింగ్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు హీరోయిన్ ఆనంది. ''ఈ సినిమాలో ట్విస్ట్‌లు బాగుంటాయి'' అన్నారు శ్రీ చరణ్ పాకాల. నటుడు 'రంగస్థలం' మహేశ్ మాట్లాడారు.

విలేజ్ పంచాయితీ

గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఏందిరా ఈ పంచాయితీ'. భరత్, విషికా లక్ష్మణ్ జంటగా టి. గంగాధర దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. ఎం. ప్రదీప్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 6న విడుదల కానుంది. ''ఇటీవల విడుదలైన టీజర్‌కు, తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో వచ్చిన పాటకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. కాశీ విశ్వనాథ్, తోటపల్లి మధు, రవి వర్మ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి పెద్దపల్లి రోహిత్ స్వరకర్త.


● భరత్, విషికా లక్ష్మణ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
610	193
65,508	19,524

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,199	▲	106
డోజోన్స్	33,611	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,602	▲	9
డాక్స్	15,323	▲	106
షాంఘై	3,110	▲	3
నికాయ్	31,873	▼	499

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,998	▼	456
బంగారం (99.5 స్వచ్ఛత)	57,766	▼	454
వెండి (కిలో)	70,432	▼	498

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసీబీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎసీబీఐ	99.46	102.77
€	యూరో	ఎసీబీఐ	85.97	89.05
¥	జపాన్ ఎన్ (100)	ఎసీబీఐ	54.91	56.62
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసీబీఐ	52.00	54.29
S$	సింగపూర్ డాలర్	ఎసీబీఐ	59.76	61.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.27	12.34

8 నెలల్లో కోటి...

ఎన్‌ఎస్‌ఈలో కొత్త రిజిస్ట్రేషన్లు



న్యూఢిల్లీ: గడిచిన ఎనిమిది నెలల్లో తమ ప్లాట్‌ఫామ్‌పై కొత్త ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య కోటి మార్కును దాటినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. దీనితో మొత్తం ఇన్వెస్టర్ల సంఖ్య 8 కోట్లకు చేరినట్లు తెలిపింది. ఈ కోటి కొత్త ఖాతాల్లో ఉత్తరాది ఇన్వెస్టర్ల వాటా 43 శాతంగా ఉండగా, పశ్చిమం (27 శాతం), దక్షిణాది (17 శాతం), తూర్పు రాష్ట్రాలు (13 శాతం) తర్వాత వరుసలో ఉన్నాయి. నగరాలవారీగా చూస్తే ఢిల్లీ (7 శాతం), ముంబై (4.6 శాతం), పుణె (1.7 శాతం) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. డేటా ప్రకారం దేశీయంగా 17 శాతం కుటుంబాలు తమ ట్రేడింగ్ సభ్యుల నెట్‌వర్క్ ద్వారా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించింది. క్లయింట్లు పలు బ్రోకరేజీల ద్వారా రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు ఉన్న నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈలో క్లయింట్ల ఖాతాల సంఖ్య 14.9 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ఆకర్షణీయ పనితీరు కనపరుస్తున్న నేపథ్యంలో క్యాపిటల్ మార్కెట్లపై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోందని ఎన్‌ఎస్‌ఈ వివరించింది. 2022–23లో కొత్త ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్ సంఖ్య 1.3 కోట్లుగా ఉండగా, 2021–22లో 1.9 కోట్లుగాను, 2020–21లో 0.90 కోట్లుగాను నమోదైంది.

గూగుల్‌తో హెచ్‌పీ జట్టు

భారత్‌లో అక్టోబర్ 2 నుంచి క్రోమ్‌బుక్స్ తయారీ



న్యూఢిల్లీ: భారత్‌లోనే క్రోమ్‌బుక్స్‌ను ఉత్పత్తి చేసే దిశగా టెక్ దిగ్గజం గూగుల్‌తో కంప్యూటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ చేతులు కలిపింది. అక్టోబర్ 2 నుంచి వీటిని చెన్నైకి దగ్గర్లోని తమ ఫ్లెక్స్ ఫెసిలిటీలో వీటి ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు హెచ్‌పీ ఇండియా సీనియర్ డైరెక్టర్ విక్రమ్ బేడి తెలిపారు. 2020 ఆగస్టు నుంచి హెచ్‌పీ ఈ ప్లాంటులోనే ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌ల శ్రేణిని ఉత్పత్తి చేస్తోంది. భారత్‌లో విద్యారంగం డిజిటల్ పరివర్తనకు తమ వంతు తోడ్పాటు అందించే క్రమంలో ఇదొక కీలక మైలురాయి కాగలదని గూగుల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ (దక్షిణాసియా) బాణీ ధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం గూగుల్ క్రోమ్ ఆపరేటింగ్ సిస్టంతో లభించే క్రోమ్‌బుక్స్‌ను ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల మంది పైచిలుకు విద్యార్థులు, టీచర్లు వినియోగిస్తున్నారు. కేజీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యాభ్యాసానికి ఉపయోగిస్తున్న డివైజ్‌లలో ఇవి అగ్రస్థానంలో ఉన్నాయి. నోట్‌బుక్స్‌తో పోలిస్తే క్రోమ్‌బుక్స్ ధరలు కొంత తక్కువగా ఉంటాయి. భారత్‌లో ఐటీ హార్డ్‌వేర్ తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 17,000 కోట్ల ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకం కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థల్లో హెచ్‌పీ కూడా ఉంది.

పారిశ్రామిక దిగ్గజం అశ్విన్ డానీ కన్నుమూత



న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక రంగ ప్రముఖులు, ఏషియన్ పెయింట్స్ నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాజీ చైర్మన్ అశ్విన్ డానీ (81) తుది శ్వాస విడిచారు. 1968 నుండి ఏషియన్ పెయింట్స్‌తో డానీకి అనుబంధం ఉంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కంపెనీలో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, నాన్–ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌తో సహా కంపెనీ బోర్డ్‌లో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. 2018 నుండి 2021 మధ్య డానీ ఏషియన్ పెయింట్స్ సంస్థకు, బోర్డ్‌కు చైర్మన్‌గా ఉన్నారు. డానీ తండ్రి సూర్యకాంత్ ఏషియన్ పెయింట్స్ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు. వివిధ ప్రభుత్వ– వాణిజ్య సంస్థల్లో డానీ కీలక బాధ్యతలు నిర్వహించారు. పలు అవార్డులు అందుకున్నారు. సీఎన్‌బీసీ–టీవీ 18 లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, బిజినెస్ ఇండియా మ్యాగజైన్ బిజినెస్‌మెన్ ఆఫ్ ది ఇయర్ (2015), ఇండియన్ పెయింట్ అసోసియేషన్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2002లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ నుండి కెమినార్ అవార్డు ఇందులో ఉన్నాయి. తాజా ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, అశ్విన్ డానీ, ఆయన కుటుంబం 7.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 64,000 కోట్లు) నికర విలువను కలిగి ఉంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా 293వ స్థానంలో నిలిచారు.

ఇక అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన, పారిశ్రామిక బ్యాటరీల తయారీలో ఉన్న అమర రాజా బ్యాటరీస్ పేరు మారింది. అమర రాజా ఎనర్జీ, మొబిలిటీగా నామకరణం చేసినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్, లిథియం అయాన్ సెల్ తయారీ, ఈవీ చార్జర్స్, లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ, రెన్యువేబుల్ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, లూబ్రికెంట్స్ విభాగాల్లో సైతం సంస్థ నిమగ్నమైంది. కాగా, బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 0.15 శాతం క్షీణించి రూ.637.75 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-9-2023	
విశాఖ	533-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	533-00
విజయవాడ	533-00
రిటైల్ ధర (డజను)	72.00
28-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.75

బుల్ మరోసారి కుదేల్



- జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం • సెన్సెక్స్ 610 పాయింట్ల పతనం
- 19,550 దిగువకు నిఫ్టీ • అన్ని రంగాల షేర్లకు నష్టాలే
- ఒక్కరోజులో రూ.2.95 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ సూచీలకు లాభాలు ఒక్క రోజుకే పరిమితమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలకు తోడు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో గురువారం దాదాపు ఒక శాతం నష్టపోయాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు.., కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. సెప్టెంబర్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో రోజంతా సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్స్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. ఫలితంగా సెన్సెక్స్ 610 పాయింట్లు నష్టపోయి 65,508 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 695 పాయింట్లు క్షీణించి 65,423 వద్ద నిలిచింది. ఈ సూచీ దాదాపు పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.95 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.316 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలో 30 షేర్లకు గానూ అయిదు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీ 193 పాయింట్లు పతనమై 19,524 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 224 పాయింట్లు నష్టపోయి 19,492 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,364 కోట్లు అమ్మేయగా..., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,711 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా మూడు పైసలు పెరిగి 83.19 వద్ద స్థిరపడింది. అధిక వడ్డీరేట్ల పెంపు అంచనాలకు తోడు తాజాగా బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు చేరువవడం, చైనాలో ప్రాపర్టీ మార్కెట్ సంక్షోభ ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతోంది. ''అధిక వెయిటేజీ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి తోడు ప్రతికూల ప్రపంచ సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఎన్‌ఎస్‌ఈ సూచీల్లో స్టాక్స్ వెయిటేజీకి సంబంధించిన మార్పులు అమల్లోకి వస్తుండటంతో దీని అనుగుణంగా ట్రేడర్లు తమ పొజిషన్లను సవరించుకున్నారు. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర ఈ ఏడాది(2023) గరిష్ట స్థాయి వద్ద ట్రేడవుతున్నాయి. మార్కెట్లో అస్థిరతలను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ 4 నెలల గరిష్టానికి చేరుకోవడం ప్రతికూలంగా మారింది. ఒకవేళ నిఫ్టీ 19,500 స్థాయిని కోల్పోతే ఆగస్టు కనిష్టం 19,220 స్థాయికి దిగిరావచ్చు'' అని రిలిగేర్ బ్రోకరింగ్ సాంకేతిక నిపుణుడు అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- యాత్రా ఆన్‌లైన్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.142)తో పోలిస్తే 8% డిస్కౌంట్‌తో రూ.130 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో పదిశాతానికి పైగా నష్టపోయి రూ.127 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివర్లో కొంత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 4% నష్టంతో రూ.136 వద్ద నిలిచింది. కంపెనీ విలువ రూ.2,133 కోట్లుగా నమోదైంది. ఎక్ఛేంజీలో 7.43 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- ఐటీ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా 4%, ఎంఫసిస్ 3%, ఎల్‌టీఐఎం 2.50%, విప్రో 2% పర్‌సిస్టెంట్, ఇన్ఫోసిస్ టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, కోఫోర్జ్ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిథ్యం వహించే ఐటీ సూచీ అత్యధికంగా రెండుశాతం క్షీణించింది
- అధిక వెయిటేజీ రిలయన్స్(1.50%), ఐటీసీ(2%), ఇన్ఫోసిస్ (2%), టీసీఎస్(1.50%) మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్ షేర్లు ఒకశాతం నష్టపోయి సూచీల భారీ పతనానికి కారణమయ్యాయి.
- నష్టాల మార్కెట్లోనూ ఎల్అండ్‌టీ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో మూడుశాతం ర్యాలీ చేసి రూ.3051 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి ఒకటిన్నర శాతం లాభపడి రూ.3012 వద్ద నిలిచింది. సెన్సెక్స్, నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన సూచీ ఇదే.

యాక్సిస్ ఎనర్జీతో బ్రూక్‌ఫీల్డ్ జేవీ



నవాల్ సైనీ, రవి కుమార్ రెడ్డి (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకై తాజాగా బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న బ్రూక్‌ఫీల్డ్‌కు చెందిన పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ సహకరిస్తుంది. బ్రూక్‌ఫీల్డ్ గ్లోబల్ ట్రాన్సిషన్ ఫండ్–2 ద్వారా విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి, నిర్మాణం కోసం రూ.7,026 కోట్ల వరకు ఈక్విటీ మూలధనాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నట్టు బ్రూక్‌ఫీల్డ్ ఎండీ నవాల్ సైనీ వెల్లడించారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం కింద ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ కస్టమర్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలతో సహా వివిధ పరిశ్రమలో పాల్గొనేవారికి ఇంధన పరిష్కారాలను అందించడానికి ఇరు సంస్థలు తమ నైపుణ్యం, వనరులను ఉపయోగించుకుంటాయని యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ సీఎండీ కటారు రవి కుమార్ రెడ్డి తెలిపారు. బ్రూక్‌ఫీల్డ్ ఖాతాలో భారత్‌లో 16 గిగావాట్ల పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో కొన్ని పూర్తి కాగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో యాక్సిస్ ఎనర్జీతో కలిసి చేపట్టిన ప్రాజెక్టులు 1.8 గిగావాట్లకు పైమాటే.



శ్రీజ-దియా జంట గెలుపు

ఆసియా క్రీడల టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల డబుల్స్‌లో ఆకుల శ్రీజ-దియా చిటాలె (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో శ్రీజ-దియా 11-8, 15-13, 11-6తో ట్రాన్ మాయ్ ఎన్గాక్-థి ఎన్గా ఎన్గుయెన్ (వియత్నాం)లపై గెలిచారు. భారత్‌కే చెందిన సుతీర్థ-ఐహిక ముఖర్జీ జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్, సత్యన్... మహిళల సింగిల్స్‌లో మనిక బత్రా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశ

ఆసియా క్రీడల్లో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు కథ ముగిసింది. హాంగ్జౌలో గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 0-2 గోల్స్ తేడాతో సౌదీ అరేబియా జట్టు చేతిలో ఓడిపోయింది. సౌదీ అరేబియా తరఫున ఖలీల్ (51వ, 57వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.

అక్షర్ స్థానంలో అశ్విన్



అశ్విన్

వన్డే ప్రపంచకప్
భారత జట్టులో ఒక మార్పు

- ఆస్ట్రేలియా జట్టులో లబుషేన్‌కు చోటు
- నేటి నుంచి వామప్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: తొడ కండరాల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ వన్డే ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు. వన్డే వరల్డ్‌కప్ కోసం ఈనెల 5న బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో అక్షర్ పటేల్ ఉన్నాడు. అయితే ఆసియా కప్ టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో గాయపడ్డ అక్షర్ పటేల్ ఆ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు కూడా దూరమయ్యాడు. అక్షర్ పటేల్ కోలుకునేందుకు కనీసం నాలుగు వారాలు పట్టే అవకాశం ఉండటంతో వన్డే ప్రపంచకప్ కోసం అతని స్థానంలో సీనియర్ స్పిన్నర్, తమిళనాడుకు చెందిన 37 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు వన్డేలు ఆడిన అశ్విన్ తన వైవిధ్యభరిత బౌలింగ్‌తో ఆకట్టుకొని నాలుగు వికెట్లు తీశాడు. శనివారం ఇంగ్లండ్‌తో జరిగే వామప్ మ్యాచ్ కోసం గువాహటి బయలుదేరిన భారత జట్టుతో అశ్విన్ కూడా ఉన్నాడు. అశ్విన్‌కిది మూడో వన్డే ప్రపంచకప్ కానుంది. స్వదేశంలో ధోని సారథ్యంలో 2011 వన్డే వరల్డ్‌కప్ టైటిల్ నెగ్గిన భారత జట్టులో అశ్విన్ సభ్యుడిగా ఉన్నాడు. 2015 ప్రపంచకప్‌లోనూ అశ్విన్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటి వరకు అశ్విన్ 115 వన్డేలు ఆడి 155 వికెట్లు తీయడంతోపాటు 707 పరుగులు సాధించాడు. అక్టోబర్ 5 నుంచి మొదలయ్యే ప్రపంచకప్ కోసం తుది జట్లలో మార్పులు చేర్పులకు గురువారంతో గడువు ముగిసింది. మరోవైపు ఆస్ట్రేలియా వరల్డ్ కప్ జట్టులోనూ ఒక మార్పు చోటు చేసుకుంది. పిక్క కండరాల గాయం నుంచి ఆల్‌రౌండర్ ఆస్టన్ అగర్ ఇంకా కోలుకోకపోవడంతో అతడి స్థానంలో మార్నస్ లబుషేన్‌ను ఎంపిక చేశాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ఐదు వన్డేల సిరీస్‌లో లబుషేన్ 283 పరుగులు... భారత్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 138 పరుగులు సాధించాడు. చేతి వేలి గాయంతో బాధపడుతున్నప్పటికీ ట్రావిస్ హెడ్‌ను వరల్డ్ కప్ జట్టులో కొనసాగించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుంది.

అసలు పోరుకు ముందు...

ప్రపంచకప్ మరో 6 రోజుల్లో

అక్టోబర్ 5 నుంచి మొదలయ్యే వన్డే ప్రపంచకప్ కోసం నేటి నుంచి అన్ని జట్లు వామప్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. మొత్తం 10 జట్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో పాకిస్తాన్–న్యూజిలాండ్... గువాహటిలో శ్రీలంక–బంగ్లాదేశ్... తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా–అఫ్గానిస్తాన్ జట్లు వామప్ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతాయి. పూర్తిస్థాయిలో పోలీసుల బందోబస్తు లేని కారణంగా పాకిస్తాన్, న్యూజిలాండ్ మ్యాచ్‌ను ప్రేక్షకుల్లేకుండా నిర్వహిస్తారు. **ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-1 చానెల్‌లో, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**







పాకిస్తాన్ జట్టు క్రికెటర్లు కెప్టెన్ బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్, షాహిన్ అఫ్రిది, హసన్ అలీ తదితరులు గురువారం ఉప్పల్ స్టేడియంలో రెండున్నర గంటలపాటు ప్రాక్టీస్ చేశారు.

మన గురి అదిరె...

ఆసియా క్రీడల్లో ఐదో రోజూ భారత్ పతకాల వేట కొనసాగింది. ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి గురువారం భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ భారత షూటర్లు నాలుగో స్వర్ణం సాధించగా... వుషులో రోషిబినా దేవి రజతం, ఈక్వెస్ట్రియన్‌లో అనూష్ కాంస్యం గెలిచారు. ఫలితంగా భారత్ పతకాల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. నేటి నుంచి అథ్లెటిక్స్ ఈవెంట్ కూడా మొదలుకానుండటం... టెన్నిస్, షూటింగ్, స్క్వాష్‌లలో కూడా మెడల్ ఈవెంట్స్ ఉండటంతో పతకాల పట్టికలో నేడు భారత్ నాలుగో స్థానానికి చేరుకునే అవకాశముంది.

- షూటింగ్‌లో భారత్‌కు నాలుగో స్వర్ణం
- పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానం
- పతకాల పట్టికలో ఐదో స్థానానికి భారత్



స్వర్ణ పతకాలతో భారత ఎయిర్ పిస్టల్ షూటర్లు శివ నర్వాల్, అర్జున్ సింగ్, సరబ్‌జోత్ సింగ్

హాంగ్జౌ: భారీ అంచనాలతో ఆసియా క్రీడల్లో అడుగుపెట్టిన భారత షూటర్లు నిలకడైన ప్రదర్శనతో రాణిస్తున్నారు. పోటీల ఐదో రోజు గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణ పతకం లభించింది. శివ నర్వాల్, అర్జున్ సింగ్ చీమా, సరబ్‌జోత్ సింగ్‌లతో కూడిన భారత బృందం క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానం సంపాదించి పసిడి పతకం గెల్చుకుంది. క్వాలిఫయింగ్‌లో భారత జట్టు మొత్తం 1734 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. సరబ్‌జోత్ సింగ్ 580 పాయింట్లు, అర్జున్ సింగ్ 578 పాయింట్లు, శివ నర్వాల్ 576 పాయింట్లు స్కోరు చేశారు. సరబ్‌జోత్ ఐదో స్థానంలో, అర్జున్ సింగ్ ఎనిమిదో స్థానంలో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్స్‌కు అర్హత సాధించారు. అయితే వ్యక్తిగత విభాగంలో సరబ్‌జోత్, అర్జున్ సింగ్‌లకు నిరాశ ఎదురైంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అర్జున్ 113.3 పాయింట్లు స్కోరు చేసి చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలువగా... సరబ్‌జోత్ 199 పాయింట్లు సాధించి నాలుగో స్థానం దక్కించుకొని కాంస్య పతకానికి దూరమయ్యాడు. మరోవైపు స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అనంత్ జీత్ సింగ్, గనీమత్ సెఖోన్‌లతో కూడిన భారత జట్టు ఏడో స్థానంలో నిలిచింది. నేడు షూటింగ్‌లో నాలుగు మెడల్ ఈవెంట్స్ (పురుషుల 50 మీటర్ల త్రీ పొజిషన్ టీమ్, వ్యక్తిగత విభాగం; మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత విభాగం) ఉన్నాయి. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత షూటర్లు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఐదు కాంస్య పతకాలు గెలిచారు.

అనూష్ ఘనత...

ఈక్వెస్ట్రియన్ (అశ్వ క్రీడలు)లో భారత్‌కు మరో పతకం దక్కింది. డ్రెసాజ్ వ్యక్తిగత విభాగంలో అనూష్ అగర్‌వల్లా కాంస్య పతకం సాధించాడు. 14 మంది పోటీపడిన ఫైనల్లో అనూష్, అతని అశ్వం 73.030 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆసియా క్రీడల చరిత్రలో డ్రెసాజ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. మరోవైపు వుషు క్రీడాంశంలో స్వర్ణ పతకం సాధించాలని ఆశించిన భారత క్రీడాకారిణి రోషిబినా దేవికి నిరాశ ఎదురైంది. వు జియోవె (చైనా)తో జరిగిన 60 కేజీల సాండా ఈవెంట్ ఫైనల్లో రోషిబినా దేవి 0-2తో ఓడిపోయి రజత పతకం కైవసం చేసుకుంది.





భారత్ 'హ్యాట్రిక్' విజయం

భారత పురుషుల హాకీ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో గురువారం జరిగిన పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున అభిషేక్ (13వ, 48వ ని.లో) రెండు గోల్స్ చేయగా... మన్‌దీప్ (24వ ని.లో), అమిత్ రోహిదాస్ (34వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో సింధు బృందం

మహిళల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్ చేరింది. మంగోలియాతో జరిగిన తొలి రౌండ్‌లో భారత్ 3-0తో గెలిచింది. పీవీ సింధు, అష్మిత, అనుపమ తమ సింగిల్స్ మ్యాచ్‌ల్లో విజయం సాధించారు.

స్క్వాష్ జట్లకు పతకాలు ఖాయం

వరుసగా నాలుగోసారి ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల స్క్వాష్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నాయి. చివరి లీగ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 0-3తో మలేసియా చేతిలో ఓడిపోగా... భారత పురుషుల జట్టు 3-0తో నేపాల్‌పై నెగ్గింది. తమ గ్రూపుల్లో రెండో స్థానంలో నిలవడం ద్వారా భారత జట్లు సెమీఫైనల్ బెర్త్‌లు పొందాయి.

నిశాంత్ పంచ్ అదుర్స్...

భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), జాస్మిన్ లంబోరియా (60 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి విజయం దూరంలో నిలువగా... దీపక్ (51 కేజీలు) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. నిశాంత్ పంచ్‌లకు అతని ప్రత్యర్థి బుయ్ తుంగ్ (వియత్నాం) తొలి రౌండ్‌లోనే చిత్తయ్యాడు. జాస్మిన్ పంచ్‌లకు హదీల్ గజ్వాన్ (సౌదీ అరేబియా) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను ముగించాడు. దీపక్ 1-4తో ప్రపంచ మాజీ చాంపియన్ టొమోయా సుబోయ్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

పసిడి పోరుకు సాకేత్-రామ్ జోడీ



ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ జోడీ ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణ పతకానికి విజయం దూరంలో నిలిచింది. సెమీఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం 6–1, 6–7 (6/8), 10–0తో 'సూపర్ టైబ్రేక్'లో సెంగ్‌చన్ హాంగ్–సూన్వూ క్వాన్ (దక్షిణ కొరియా)పై గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజత పతకం, మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి స్వర్ణ పతకం సాధించాడు. నేడు ఉదయం గం. 7:30 నుంచి జరిగే ఫైనల్లో జేసన్ జంగ్–యు సియో సు (చైనీస్ తైపీ) జంటతో సాకేత్–రామ్ జోడీ తలపడుతుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న–రుతుజా భోస్లే (భారత్) ద్వయం సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న–రుతుజా 7–5, 6–3తో జిబెక్ కులామ్‌బయేవా–గ్రిగోరి లొమాకిన్ (కజకిస్తాన్)లపై గెలిచారు. నేడు జరిగ సెమీఫైనల్లో యు సియో సు–చాన్ హావో చింగ్ (చైనీస్ తైపీ)లతో బోపన్న–రుతుజా తలపడతారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	90	51	26	167
దక్షిణ కొరియా	24	23	39	86
జపాన్	18	30	30	78
ఉజ్బెకిస్తాన్	6	10	15	31
భారత్	6	8	11	25
థాయ్‌లాండ్	6	3	9	18
హాంకాంగ్	5	12	15	32
చైనీస్ తైపీ	4	4	6	14
ఇరాన్	3	9	10	22
ఉత్తర కొరియా	3	5	4	12

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

క్లుప్తంగా...

తిరుమలలో ఘనంగా అనంత పద్మనాభ వ్రతం



తిరుమల: తిరుమలలో గురువారం అనంత పద్మనాభ వ్రతం ఘనంగా జరిగింది. ఉదయం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీ భూవరాహ స్వామి ఆలయం వద్దనున్న స్వామివారి పుష్కరిణి చెంతకు వేంచేపు చేశారు. మహిళల సౌభాగ్యం కోసం వరలక్ష్మి వ్రతం ఎలా చేస్తారో, పురుషులకు సిరి సంపదల కోసం ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు. కాగా, టీమిండియా మాజీ క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ గురువారం శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకులు మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

లిఫ్టు పనిచేయక అర్చకుల పాట్లు



పడమటి పంచతల రాజగోపురం నుంచి ప్రసాదాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయ గర్భాలయం దక్షిణ దిశలో ఉన్న లిఫ్టు సాంకేతిక లోపంతో పనిచేయక అర్చకులు అవస్థలు పడుతున్నారు. స్వయంభువులకు రోజూ ఆరగింపు, నివేదన సమయాల్లో ప్రసాదాన్ని రామానుజ కూటం నుంచి ఈ లిఫ్టు గుండానే తీసుకొస్తారు. ప్రస్తుతం లిఫ్టు సాంకేతిక లోపంలో ఆగిపోవడంతో ఆచార్యులు శ్రీస్వామి వారికి గురువారం ఆరగింపు ప్రసాదాన్ని తిరువీధుల గుండా పడమటి పంచతల రాజగోపురం నుంచి తీసుకెళ్లారు. త్వరగా లిఫ్టును బాగుచేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆచార్యులు కోరుతున్నారు.

ఘనంగా 197వ గన్నర్స్ డే

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ఆర్టిలరీ సెంటర్ హైదరాబాద్‌లో గురువారం 197వ గన్నర్స్ డేని ఘనంగా నిర్వహించారు. 1827 సెప్టెంబరు 28న తొలి భారతీయ ఆర్టిలరీ యూనిట్ అయిన ఐదో (బాంబే) మౌంటెన్ బ్యాటరీని ప్రారంభించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మిలిటరీ ఉన్నతాధికారులు గురువారం మీడియాకు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ, ఏపీ సబ్ ఏరియా జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ రాకేశ్ మనోచా పాల్గొన్నారు. దేశసేవ కోసం ప్రాణాలర్పించిన గన్నర్లకు నివాళిగా ఆర్టిలరీ సెంటర్‌లోని యుద్ధ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. గన్నర్లుగా సేవలందించి రిటైర్ అయిన కొందరు సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా హైదరాబాద్ ఆర్టిలరీ సెంటర్ విజయాలు, చరిత్రను వెల్లడించేలా ప్రదర్శించిన లైట్ అండ్ సౌండ్ షో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మేజర్ జనరల్ రాకేశ్ మనోచా మాట్లాడుతూ...ఫిరంగి సిబ్బంది ఎల్లప్పుడూ దేశ రక్షణలో అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తిస్తోందన్నారు. అసాధారణమైన అంకితభావం, పరాక్రమం, అచంచలమైన నిబద్ధతను కనబరుస్తున్నారని, గన్నర్స్ సాధించినందుకు భారత సైన్యం గర్వపడుతుందని తెలిపారు.

చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఏఐ గురించి మీకు తెలుసా?

ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన మిమ్మల్ని వెంటాడుతోందా?

ఈ కృత్రిమ మేధను ఒడిసిపట్టి కెరీర్ మెట్లు గబగబా ఎక్కేయాలని అనుకుంటున్నారా?

అయితే ఈ కథనం మీ కోసమే.

చాట్‌జీపీటీతో ఉద్యోగ మార్పులు తథ్యం



- లింక్డిన్ సర్వేలో 79 శాతం మంది హైదరాబాదీ టెకీల అభిప్రాయం
- కెరీర్‌లో ముందడుగుకు దోహదపడుతుందని 66% మంది వెల్లడి
- ఇప్పటికే ఉద్యోగాల్లో వాడుతున్నామన్న 64 శాతం మంది ఐటీ నిపుణులు
- ఏఐ గురించి మరింతగా తెలుసుకోవాలనుకుంటున్న వారు 69 శాతం మంది

(కంచర్ల యాదగిరిరెడ్డి)

వృత్తి నిపుణల నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ లింక్డిన్ గురించి మీకు తెలిసే ఉంటుంది. ఇటీవలే ఈ సంస్థ జనరేటివ్ ఏఐ తీరుతెన్నులు ఎలా ఉన్నాయనేది తెలుసుకునేందుకు హైదరాబాద్‌లో ఓ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగుల్లో 79 శాతం మంది జనరేటివ్ ఏఐ తాము చేసే ఉద్యోగాల్లో కచ్చితంగా మార్పులు తీసుకొస్తుందని అనుకుంటున్నారు. అదే సమయంలో ఏఐ వల్ల తమ పని ఎంతో కొంత సులువు అవుతుందని 66 శాతం మంది భావిస్తున్నారు. కెరీర్‌లో ముందడుగు వేసేందుకు ఏఐ పనికొస్తుందని కూడా వారు విశ్వసిస్తున్నారు. కొంచెం వివరంగా చూస్తే చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి రావడంతో దాదాపు ప్రతి రంగంలోనూ వినూత్న మార్పులు రావడం తెలిసిందే. మార్కెటింగ్, సేల్స్ వంటివే కాకుండా చిన్నచిన్న ప్రోగ్రామ్‌లు రాయడం, కష్టమర్ల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడం వంటి అనేక విషయాల్లో ఇది ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలోనే లింక్డిన్ సర్వేకు ప్రాధాన్యం ఏర్పడింది. జనరేటివ్ ఏఐలో వస్తున్న మార్పులను, కొత్త అప్లికేషన్లను దృష్టిలో పెట్టుకుంటే ఏడాది కాలంలో టెక్ రంగంలోనూ గణనీయమైన మార్పులు వస్తాయని హైదరాబాద్‌లోని ఐటీ వృత్తి నిపుణులు అంటున్నారు. సర్వే చేసిన ప్రతి 10 మందిలో దాదాపు 8 మంది ఈ రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. జనరేటివ్ ఏఐ విస్తృత వాడకంతో చాలా ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనపైనా టెకీలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఏఐ రంగంలో వస్తున్న మార్పులను పట్టించుకోకుంటే ఉద్యోగాలకు ఇబ్బందన్నది నిజమేనని 42 శాతం మంది పేర్కొన్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఏఐ గురించి తెలుసుకొనేందుకు దాన్ని తమ ఉద్యోగాల్లో భాగం చేసుకునేందుకు సుమారు 69 శాతం మంది సిద్ధంగా ఉండటం!

మేమిప్పటికే వాడేస్తున్నాం...

సర్వే చేసిన వారిలో సుమారు 64 శాతం మంది ఇప్పటికే తాము ఏఐను ఉద్యోగాల్లో భాగంగా వాడుతున్నట్లు చెప్పారు. అలాగే చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఏఐను వాడే ప్రయత్నం చేస్తున్నామన్న వాళ్లు సగానికిపైగా ఉన్నారు. దేశం మొత్తమ్మీద చూస్తే చాట్‌జీపీటీని వినియోగించే వాళ్లలో 54 శాతంతో మిలినియల్స్ ముందు వరుసలో ఉన్నారు. జెన్–జీకి చెందిన వారు 46 శాతంతో రెండోస్థానంలో ఉన్నారు. అంతేకాదు హైదరాబాద్‌లోని వృత్తి నిపుణులు జనరేటివ్ ఏఐతో జట్టు కట్టేందుకు కూడా ఉత్సుకతతో ఎదురుచూస్తున్నట్లు ఈ సర్వే తెలిపింది.

ఏఐతో అయ్యే పనులేమిటి?

ఏఐతో చేయగల పనులకు హద్దుల్లేవని ఐటీ నిపుణులు అంటున్నారు. తమ ఉద్యోగ జీవితాన్ని మార్చేస్తుందని దాదాపు అందరూ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే తాము ఏఐని ఉద్యోగాల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నామని 98 శాతం మంది పేర్కొనడం గమనార్హం. ఇందుకు తగ్గట్టుగానే ఉద్యోగ ప్రకటనల్లోనూ చాట్‌జీపీటీ, ఏఐ టెక్నాలజీల ప్రస్తావన ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయిందని లింక్డిన్ చెబుతోంది. 'జనరేటివ్ ఏఐ మీ ఉద్యోగ జీవితాన్ని ఎలా మెరుగు పరుస్తుంది?' అని హైదరాబాద్‌లోని వృత్తి నిపుణులను అడిగినప్పుడు కావాల్సిన సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తుంది కాబట్టి చేసే పనిని మరింత సమర్థంగా, విశ్వాసంతో చేయగలమని 66 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఉత్పాదకత విషయంలోనూ ఏఐ తమకు సహాయకారి కాగలదని భావిస్తున్నారు. పనిలో ఎదురయ్యే ఇబ్బందులను సులువుగా అధిగమించేందుకు ఏఐని వాడాలని 83 శాతం మంది ఆలోచిస్తుండగా సహోద్యోగులను అడిగేందుకు ఇబ్బంది పడే ప్రశ్నలకు ఏఐ ద్వారా సమాధానాలు తెలుసుకుంటున్నట్లు 77 శాతం మంది చెప్పారు.

సాఫ్ట్ స్కిల్స్ తోడైతే...

భవిష్యత్తులో వృత్తి జీవితంలో రాణించాలంటే కేవలం ఏఐపైనే ఆధారపడటం తగదని, సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడమూ చాలా అవసరమని లింక్డిన్ సర్వేలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించగలిగే సామర్థ్యం, వ్యూహాత్మక ఆలోచనల వంటి నైపుణ్యాలు ఉన్న వారి అవసరం భవిష్యత్తులో ఎక్కువగా ఉంటుందన్నది హైదరాబాద్‌లోని వృత్తి నిపుణల లెక్క. రోజువారీ చేయాల్సిన, బోర్ కొట్టించే పనుల భారాన్ని ఏఐ టూల్స్ చక్కబెట్టగలవు కాబట్టి తాము ఆసక్తికలిగించే, నైపుణ్యం ఉన్న విషయాలపై ఎక్కువ సమయం వెచ్చించవచ్చునని, ఇది వృత్తి సంతృప్తిని అందిస్తుందని వారు విశ్లేషించారు. అలాగే వృత్తికి.. జీవితానికి మధ్య సమతౌల్యత పెరిగేందుకూ ఏఐ తోడ్పడుతుందని సర్వేలో పాల్గొన్న వారిలో 73 శాతం మంది అభిప్రాయపడ్డారు.


"వచ్చే ఐదేళ్లలో ఏఐ తమ ఉద్యోగాల్లో ఎన్నో సానుకూల మార్పులు తీసుకొస్తుందని హైదరాబాద్ వృత్తినిపుణుల్లో 86% మంది భావిస్తున్నారు. ఏఐ రాకతో తమకు సమయం ఆదా అవుతుందని, దాన్ని కొత్త నైపుణ్యాలను నేర్చుకునేందుకు, సృజనాత్మక, వ్యూహాత్మక పనులు చేసేందుకు వాడుకుంటామని చెబుతున్నారు"

– నిరాజితా బెనర్జీ, లింక్డిన్

ఏఐ కోర్సులు...

1. హౌ టు రీసెర్చ్ అండ్ రైట్ యూజింగ్ జనరేటివ్ ఏఐ టూల్స్ - డేవ్ బిర్స్
2. వాట్ ఈజ్ జనరేటివ్ ఏఐ? - పినార్ సెహాన్ డెమిర్‌డాగ్
3. జనరేటివ్ ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్ - టోమర్ కోహెన్
4. నానో టిప్స్ ఫర్ యూజింగ్ చాట్‌జీపీటీ ఫర్ బిజినెస్ - రాచెల్ వుడ్స్
5. మెషీన్ లెర్నింగ్ విత్ పైథాన్: ఫౌండేషన్స్ - ఫ్రెడిక్ న్యాన్‌గాంగా
6. గెట్ రెడీ ఫర్ జనరేటివ్ ఏఐ - ఆష్లీ కెన్నెడీ
7. ఇంట్రడక్షన్ టు ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ఫర్ జనరేటివ్ ఏఐ - రోనీ షీర్
8. పైథాన్ డేటా స్ట్రక్చర్ అండ్ అల్గారిథమ్స్ - రాబిన్ ఆండ్రూస్
9. ప్రాంప్ట్ ఇంజనీరింగ్: హౌ టు టాక్ టు ద ఏఐస్ - జేవియన్ అమాట్రియాన్
10. జీపీటీ-4, ద న్యూ జీపీటీ రిలీజ్ అండ్ వాట్ యూ నీడ్ టు నో - జోనథన్ ఫెర్నాండెజ్

టుడేస్ గ్రాఫిక్



ఏటేటా.. ఉద్యోగులకు టాటా!

- సింగరేణిలో రిటైర్మెంట్లు, ప్రైవేటీకరణతో తగ్గిన కార్మికుల సంఖ్య
- 1998లో 1,08,212.. ప్రస్తుతం 39 వేలమంది కార్మికులు ఉన్నట్లు అంచనా



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిలో కార్మిక, ఉద్యోగ భాగస్వామ్యం ఏటేటా భారీగా తగ్గుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్మికులు, ఉద్యోగుల సంఖ్య పడిపోతోంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా కొత్తగా గనులు ఏర్పడక క్రమేపి ప్రైవేటీకరణ పెరుగుతోంది. ప్రస్తుతం కార్మికులసంఖ్య 39 వేలకు చేరింది. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లక్షలాది మందికి ఉపాధి కల్పించింది. గత రెండు దశాబ్దాలుగా సంస్థలో యాంత్రీకరణ, ప్రైవేటీకరణతో కాంట్రాక్టు వ్యవస్థ పెరిగిపోయింది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ(వీఆర్ఎస్) కోసం గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకం కింద, విధుల్లో నిర్లక్ష్యం పేరిట 1997 నుంచి 2014 వరకు వందలాది కార్మికులను తొలగించారు. ప్రస్తుతం సింగరేణిలో కార్మిక సంఘ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎంతమంది కార్మికులు ఉంటారనే చర్చ మొదలైంది. కంపెనీలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల ప్రక్రియ మొదలై వచ్చే నెల 5న ఓటర్ల జాబితా వెలువడితే పూర్తిస్థాయిలో సంఖ్య తేలనుంది. కార్మిక ఎన్నికలు మొదలైనప్పటి నుంచి పరిశీలిస్తే 1998లో 1,08,212 మంది కార్మికులు ఉన్నారు. ఇప్పుడా సంఖ్య 39 వేలకు చేరింది. వీటితోపాటు రెండు వేల వరకు ఎగ్జిక్యూటివ్ కేడర్ ఉద్యోగులు ఉంటారు. గత 25 ఏళ్లలో 68 వేల మంది కార్మికులు తగ్గారు. కంపెనీలో ఇప్పటివరకు ఆరుసార్లు కార్మిక ఎన్నికలు జరిగాయి. నాటికీ, నేటికీ ఓటర్ల సంఖ్యలో చాలా వ్యత్యాసం ఉంది. గత ఆరేళ్లలోనే 13 వేలకు పైగా కార్మికులు తగ్గారు.

సంవత్సరం	కార్మిక ఓటర్లు
1998	1,08,212
2001	1,03,904
2003	93,470
2007	75,376
2012	63,827
2017	52,217
2023	39,600(సుమారు)

టీటీడీ బస్సు చోరీ నిందితుడిని పట్టిస్తే రివార్డు

రూ.10 వేలు ఇవ్వనున్నట్లు పోలీసుల వెల్లడి

తిరుమల: టీటీడీ ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సును చోరీ చేసిన నిందితుడు విష్ణు (19)ను పోలీసులకు పట్టించినా, అతడి జాడను సమాచారమిచ్చినా రూ.10 వేలు రివార్డును అందజేస్తామని తిరుమల క్రైమ్ పోలీసులు తెలిపారు. చోరి ఘటనకు సంబంధించి నిందితుడి ఫొటోను పోలీసులు గురువారం మీడియాకు విడుదల చేశారు. నిందితుడు ఈ నెల 24న ఉదయం 3.30 గంటలకు తిరుమల నుంచి టీటీడీ ఎలక్ట్రిక్ బస్సును చోరీ చేసి నాయుడుపేట హైవేలో చెన్నై వైపు వెళుతూ పోలీసులను చూసి బస్సును అక్కడే వదిలి పరారయ్యాడు. నిందితుడి ఆచూకీ తెలిస్తే 9491086022, 9440796770 నంబర్లకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

ఘాట్ రోడ్‌లో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో గురువారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కొండను ఢీకొంది. అలిపిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది.తిరుమలకు 4కి.మీ ముందు మలుపు వద్ద అదుపు తప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సాఫ్ట్‌వేర్ పొరపాట్లు.. ఉద్యోగుల పాట్లు

- ట్రెజరీస్ అకౌంట్స్‌లో కాలం చెల్లిన సాఫ్ట్‌వేర్ తెచ్చిన కష్టం
- పెన్షన్ల కంటే.. రూ.12 కోట్లు అధికంగా చెల్లింపులు
- తిరిగి చెల్లించాలంటూ పెన్షనర్లకు నోటీసులు

సాక్షి,హైదరాబాద్: కాలంచెల్లిన కంప్యూటర్లు తెలంగాణ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్‌కు పెద్ద కష్టాన్నే తెచ్చిపెట్టాయి. సాఫ్ట్‌వేర్ లోపాలు ఉద్యోగులకు శాపాలుగా మారాయి. నిధుల కొరతతో ప్రతి రూపాయి విడుదల కోసం ఆర్థికశాఖ ఆచీతూచి నిర్ణయాలు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం రూ.12 కోట్లను పెన్షనర్ల అకౌంట్లలో జమచేసింది. ప్రతినెలా వారికి ఇవ్వాల్సిన పెన్షన్ కంటే అధికంగా చెల్లించింది. ఇందుకు ప్రధానకారణం కాలంచెల్లిన సాఫ్ట్‌వేర్ కారణమని తేల్చారు. పెన్–13 నుంచి ఇంపాక్ట్ సాఫ్ట్‌వేర్‌గా మార్పు జరిగిన అనంతరం పెన్షన్ డేటాలో లోపాలున్నాయని పలు జిల్లాల నుంచి డైరెక్టరేట్‌కు ఫిర్యాదులొచ్చాయి. అయినా సరిదిద్దకపోవటం వల్ల ఒక నంబర్ టైప్ చేస్తే, మరో నంబర్ ఆటోమెటిక్‌గా అప్‌లోడ్ కావటంతో చాలాకాలంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పెన్షనర్ల ఖాతాలకు వాస్తవ పెన్షన్ కంటే ఎక్కువగా చెల్లించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను థర్డ్‌పార్టీ తనిఖీ లేకుండానే నేరుగా తమపై రుద్దారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రమశిక్షణాచర్యలంటూ సిబ్బందికి హెచ్చరికలు: తాము చెల్లించిన ఎక్కువ మొత్తాన్ని తిరిగి చెల్లించాలంటూ తాజాగా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారులు పెన్షనర్లకు నోటీసులు పంపుతున్నారు. మరోవైపు అధికచెల్లింపులు చేసిన సిబ్బందిపై క్రమశిక్షణాచర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుండటంతో ట్రెజరీస్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. లోపాలు, అధిక చెల్లింపుల విషయాన్ని తాము అనేకమార్లు డైరెక్టరేట్ దృష్టికి తీసుకుపోయినా, కనీస నివారణచర్యలు తీసుకోకుండా తమపై క్రమశిక్షణాచర్యలు తీసుకోవాలని చూస్తే ఆందోళన చేస్తామని ట్రెజరీస్ అకౌంట్స్ ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. పెన్షనర్లు కూడా తాము ఇప్పుడు చెల్లించలేమన్న నిస్సహాయతను వ్యక్తం చేస్తుండటంతో డైరెక్టరేట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మళ్లీ మావోల పాగా!

- ఎన్నికల బహిష్కరణే లక్ష్యంగా రాష్ట్రంలోకి ప్రవేశం
- ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుకు దళాలు
- చంద్రన్నతోపాటు కీలక నేతల భేటీ?
- తృటిలో తప్పిన భారీ ఎన్‌కౌంటర్!
- అడవుల్లో గాలిస్తున్న పోలీసులు



మావోయిస్టులు వదిలేసిన సామగ్రి

సాక్షి ప్రతినిధి, వరంగల్: సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణలో ఎన్నికల బహిష్కరణ నినాదం వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు సమాయత్తమవుతోంది. డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణలో పాగా వేసేందుకు సరైన సమయంగా పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి చేరే అవకాశం ఉందని పోలీసులను రాష్ట్ర ఇంటెలిజెన్స్ హెచ్చరించింది. ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు ములుగు జిల్లా పేరూరు శివారు కర్రెగుట్ట ప్రాంతంలో బుధవారం మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరగడం గమనార్హం.

చంద్రన్న నేతృత్వంలో సాయుధ దళాలు..

రాష్ట్ర విభజనకు ముందు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న నేతృత్వంలో సాయుధ దళాలు మళ్లీ రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. కేంద్ర కమిటీ సభ్యుడిగా, తెలంగాణ ఇన్‌చార్జ్‌గా ఉన్న చంద్రన్న.. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా భారీ దాడులకు వ్యూహరచనతో తెలంగాణలో ప్రవేశించే క్రమంలో పేరూరు కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో 30–40 మంది మావోయిస్టులు ఈ నెల 26న సమావేశమైనట్లు చెబుతున్నారు. బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, కొయ్యడ సాంబయ్య అలియాస్ గోపన్న, కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్‌లతోపాటు ఓగోలపు మల్లయ్య, భద్రు, ముచ్చకి ఉంగల్ (రఘు), కొవ్వాసి గంగ (మహేష్, జనార్దన్), నల్లమారి అశోక్ (విజేందర్), సాంబయ్య (అజాద్), ముస్సాకి దేవల్ (కరుణాకర్), పొడియం కొసయ్య అలియాస్ మాసాలతోపాటు సుమారు 40 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనిపై కచ్చితమైన సమాచారం అందుకున్న ములుగు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు గ్రేహౌండ్స్ బలగాలతో 2రోజులు అడవులను జల్లెడ పట్టారు. పేరూరు అటవీ ప్రాంతం కర్రెగుట్ట వద్ద వారికి మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరగ్గా ఆయుధాలతో మావోయిస్టులు తప్పించుకున్నారు. అయితే పెద్ద మొత్తంలో కిట్ బ్యాగులు, మందులు, బ్యాటరీ చార్జర్‌లు, వాటర్ క్యాన్‌లు, సోలార్ ప్లేట్లు, సుతిలి బాంబులు, పార్టీ సాహిత్యం, వంట సామగ్రి లభ్యం కావడం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేసింది.

అగ్రనేతలు లక్ష్యంగా కూంబింగ్

మావోయిస్టు పార్టీ అగ్రనేతలు మళ్లీ తెలంగాణ సరిహద్దుకు చేరారన్న సమాచారంతో పోలీసులు ఆ పార్టీ సాయుధ దళాల కదలికలపై దృష్టి పెట్టారు. ఉత్తర తెలంగాణ నుంచి మొత్తం 82 మంది వివిధ నక్సల్స్ గ్రూపులలో పనిచేస్తుండగా 8 మంది ప్రజాప్రతిఘటన, ఇద్దరు న్యూడెమోక్రసీలలో, మావోయిస్టు పార్టీలో 72 మంది పనిచేస్తుండగా, 54 మంది ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఏవోబీ తదితర ప్రాంతాలలో వివిధ కేడర్‌లలో ఉన్నారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్న వారిలో 16 మంది పూర్వ వరంగల్‌కు చెందినవారు కాగా, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ (కేకే డబ్ల్యూ), డివిజన్ కమిటీలను ఎత్తేసి ఎన్‌టీఎస్ జడ్సీని తెలంగాణ రాష్ట్ర కమిటీ (టీఎస్‌సీ)గా మార్చింది. రాష్ట్ర కమిటీ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మృతి తర్వాత చంద్రన్న పర్యవేక్షణలో ఆ బాధ్యతలను బడే దామోదర్ చూస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. ఆయనతోపాటు కంకనాల రాజిరెడ్డి, బండి ప్రకాశ్ అలియాస్ క్రాంతి అలియాస్ ప్రభాత్, మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్, కొయ్యడ సాంబయ్య తదితర నేతల నిర్బంధం కారణంగా దండకారణ్యానికి మారారు. ఇప్పుడు తాజా పరిణామాల నేపథ్యంలో సాయుధ దళాల రక్షణతో మళ్లీ తెలంగాణలో అడుగిడుతుండగా పోలీసులు ఆ దళాలు లక్ష్యంగా కూంబింగ్ ముమ్మరం చేశాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.